

TGTEL/25/A1713

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 145 | పేజీలు : 14 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | గురువారం 28 మే 2026 | వెల : 4/-

# తుమ్మిడిహట్టిపై చర్చించేందుకు సిద్ధం

- మహారాష్ట్ర సీఎంకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ
- తుమ్మిడిహట్టిపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్న రేవంత్ రెడ్డి
- చర్చల కోసం సమయమివ్వాలని లేఖలో విజ్ఞప్తి
- ఎఫ్ఆర్ఎల్ పెరిగినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువ ఉంటుందని వెల్లడి
- తుమ్మిడిహట్టి బ్యారేజీపై మహారాష్ట్ర సీఎంకు రేవంత్‌రెడ్డి లేఖ
- తుమ్మిడిహట్టిపై మహారాష్ట్రతో చర్చించేందుకు సిద్ధమని సీఎం లేఖ
- తెలంగాణ ప్రతినిధులకు మహారాష్ట్ర సమయం ఇవ్వాలని కోరిన సీఎం



హైదరాబాద్

మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. తుమ్మిడిహట్టి బ్యారేజీ అంశంపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆ లేఖలో పేర్కొన్నారు. చర్చల కోసం తెలంగాణ రాష్ట్ర ప్రతినిధులకు సమయం ఇవ్వాలని, సమావేశానికి తేదీని ఖరారు చేయాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టుకు 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్‌కు మహారాష్ట్ర ప్రభుత్వం గతంలో అంగీకరించిందని గుర్తు చేశారు. కానీ దీంతో ఉత్తర తెలంగాణ నీటి అవసరాలు తీరవని పేర్కొన్నారు. ఎఫ్ఆర్ఎల్ పెరిగితేనే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీళ్లు వస్తాయని తెలిపారు. ఎఫ్ఆర్ఎల్ పెంచినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువగానే ఉంటుందని పేర్కొన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ఎత్తు, నిర్మాణంపై మహారాష్ట్రతో చర్చించేందుకు తెలంగాణ - మిగతా3లో



## రక్షణ రంగంలో కీలక ముందడుగు

- స్టెల్త్ ఫైటర్ జెట్ ప్రాజెక్టు రేసులో 3 ప్రైవేట్ దిగ్గజాలు!
- 2027 మార్చి నాటికి కాంట్రాక్ట్ ఖరారు
- మొదటి ప్రోటోటైప్ విమానం 2028 నుంచి 2032 మధ్య తొలిసారి గాల్లోకి ఎగిరే అవకాశం



## ప్రధాని మోదీతో తమిళనాడు సీఎం విజయ్ భేటీ

- ముఖ్యమంత్రి అయ్యాక తొలిసారి
- తమిళనాడుకు మౌలిక, సంక్షేమ పథకాలకు, ప్రాజెక్టులకు నిధులు ఇవ్వాలని విజ్ఞప్తి
- 'సెంటర్ ఫర్ ఎయిర్‌బోర్న్ సిస్టమ్స్' (సీఏబీఎస్) ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

## లాజిస్టిక్స్‌లో తెలంగాణ జోరు

- రేవంత్ సర్కార్ చర్యలకు కేంద్ర ప్రభుత్వం ప్రశంసలు..
- జాతీయ లాజిస్టిక్స్ ర్యాంకింగ్స్ 2025లో తెలంగాణ రాష్ట్రం 'హై పెర్ఫార్మర్'గా నిలిచి మరో కీలక మైలురాయి
- గతంలో అచీవర్ కేటగిరీలో ఉన్న తెలంగాణ.. ఈసారి మరింత మెరుగైన స్థాయికి చేరుకోవడం విశేషం.
- కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన లాజిస్టిక్స్-2025 నివేదికలో రాష్ట్ర మౌలిక వసతుల అభివృద్ధి, పారిశ్రామిక ప్రోత్సాహకాలు, లాజిస్టిక్స్ రంగంలో తీసుకున్న చర్యలను ప్రత్యేకం

## 'ఈ స్కామ్‌పై విచారణకు సిట్ ఏర్పాటు చేయాలి'

- సీబీఎస్ఈ (ఓఎస్ఎం) వివాదంపై రాహుల్ గాంధీ ఫైర్
- ఇటీవలే రిలీజైన సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షా ఫలితాలు
- కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) పద్ధతిపై తీవ్ర ఆందోళనలు
- ఈ విధానం కారణంగా తమ ఆన్సర్ షీట్లు తారుమారయ్యాయన్న కొందరు స్టూడెంట్స్



## తెలంగాణలో అకాల వర్షాలు

- తడిసి ముద్దైన ధాన్యం
- రైతును నిండా ముంచిన అకాల వర్షం
- పలు కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యం బస్తాలు
- ఆరబెట్టిన పంట ఆగమవడంతో లబోదిబోమంటున్న రైతులు
- చేతికొచ్చిన పంట చేజారడంతో కన్నీరుమున్నీరైన అన్నదాత





## అసోంలో 'ఉమ్మడి పౌర స్మృతి' బిల్లుకు ఆమోదం

- గిరిజనులకు మాత్రం మినహాయింపు
- అసోంలో యూనిఫామ్ సివిల్ కోడ్ (యూసీసీ) బిల్లుకు ఆమోదం
- ఇది ఓ రాజకీయ అజెండా అని కాంగ్రెస్ విమర్శ

## ఇందిరమ్మ జీవిత బీమా పథకం కోసం ఇంటింటి సర్వే

- ఘనంగా 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' ముగింపు వేడుకలు
- మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో ఆదేశాలు
- జూన్ 2 నుంచి రూ.5 లక్షలతో జీవితా బీమా పథకం ప్రవేశపెడుతున్నట్లు ప్రకటన



హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ జీవిత బీమా పథకం అమలుకు ఇంటింటి సర్వే చేయాలని మంత్రివర్గ ఉపసంఘం ఆదేశించింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం వర్తింపజేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రులు పేర్కొన్నారు. ప్రతి ఇంటికి సంబంధించిన సమగ్ర సమాచారం సేకరించాలని ఉపసంఘం సూచించింది. అర్హుల ఎంపిక కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని తెలిపింది. పథకం ప్రయోజనాల సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపింది. ఈ బీమా పథకానికి ఒక విశిష్టమైన లోగో రూపొందించాలని నిర్ణయించింది. సర్వే పూర్తయిన ప్రతి ఇంటికీ ఈ లోగోతో స్టిక్కర్లను అతికించాలని సూచించింది. ఈ నేపథ్యంలో అన్ని శాఖలు తమ సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను వెంటనే - మిగతా3లో

## గురువారం సిద్ధరామయ్య రాజీనామా!

- మే30న కర్ణాటక కొత్త సీఎం ప్రమాణ స్వీకారం?
- గురువారం గవర్నర్ అపాయింట్‌మెంట్ కోరిన సిద్ధరామయ్య
- రాజీనామా చేసేందుకేనా?



## సరిహద్దులకు 15 కి.మీ పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలు కూల్చేయాలి

- ఈ అంశంలో జీరో టోలరెన్స్ విధానాన్ని అమలు చేయాలన్న అమిత్ షా
- సరిహద్దు జిల్లాల కలెక్టర్లకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ నిర్ణయం
- పెద్ద పెద్ద వ్యాపార సంస్థలను తనిఖీ చేసి, వాటికి అందుతున్న నిధుల మూలాలను పరిశీలించాలి



# రక్షణ రంగంలో కీలక ముందడుగు

భారత వాయుసేన సామర్థ్యాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే ఐదో తరం స్వదేశీ స్టెల్త్ యుద్ధ విమానం అమ్కా అభివృద్ధిలో కీలక అడుగు పడింది. ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ అధికారికంగా రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ జారీ చేసింది. ఇప్పటివరకు ప్రభుత్వ రంగానికే పరిమితమైన యుద్ధ విమానాల తయారీని, మోదీ ప్రభుత్వం తొలిసారిగా ప్రైవేట్ రంగానికి అప్పగించబోతోంది. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌ను పక్కన పెట్టి ప్రైవేట్ రంగానికి కేంద్రం పెద్దపీట వేసింది. అత్యంత ప్రతిష్టాత్మకమైన 15 వేల కోట్ల విలువైన ఈ మెగా ప్రాజెక్ట్ రేసులో మూడు ప్రైవేట్ దిగ్గజాలు నిలిచాయి.

శత్రువుల రాడార్లకు చిక్కకుండా దాడి చేయగల అత్యంత అధునాతన స్టెల్త్ యుద్ధ విమానాన్ని సొంతంగా తయారుచేసుకునేందుకు భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటివరకు దేశంలో తేజస్ వంటి ఫైటర్ జెట్లను ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ మాత్రమే తయారు చేస్తూ వచ్చింది. కానీ, అమ్కా ప్రాజెక్ట్ నుంచి నూాను పక్కన పెట్టి, ప్రైవేట్ రంగానికి రక్షణ శాఖ పెద్దపీట వేసింది. మొత్తం 7 కంపెనీలు పోటీ పడగా, సాంకేతిక పరిశీలన అనంతరం మూడు ప్రైవేట్ సంస్థలను ప్రభుత్వం షార్ట్‌లిస్ట్ చేసింది. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, ఎల్ అండ్ టీ – బెల్ కన్సార్టియం, భారత్ ఫోర్జ్ – బిఇఎమ్ఎల్ కూటమి ఇందులో ఉన్నాయి. ఈ మూడు సంస్థలకు రక్షణ శాఖ టెండర్ పత్రాలను అందించింది. రాబోయే 2–3 నెలల్లో ఇవి తమ తుది బిడ్లను దాఖలు చేయాల్సి ఉంటుంది. 2027 మార్చి నాటికి కాంట్రాక్ట్ ఎవరికి దక్కుతుందనేది ఖరారు కానుంది. ఈ ఐదో తరం యుద్ధ విమానంలో రెండు ఇంజన్లు ఉంటాయి. ఇది సింగిల్ సీటర్. అంతర్గతంగా 1500 కిలోలు, బాహ్యంగా 5,500 కిలోల ఆయుధాలను ఇది మోసుకెళ్లగలదు. ఇంధన సామర్థ్యం 6,500 కిలోలు. 55,000 అడుగుల ఎత్తులో ఇది ప్రయాణించగలదు.



### ఆంధ్రప్రదేశ్‌కు భారీ పారిశ్రామిక ప్రాధాన్యం

ఈ ప్రాజెక్ట్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు భారీ పారిశ్రామిక ప్రాధాన్యం దక్కబోతోంది. టెండర్ గెలుచుకున్న ప్రైవేట్ భాగస్వామి ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తిలో కొత్తగా ఏర్పాటు చేయబోయే 650 ఎకరాల గ్రీన్‌ఫీల్డ్ ఫెసిలిటీలో ఈ యుద్ధ విమానాల నమూనాలను తయారు చేయాల్సి ఉంటుంది. పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులు 15 వేల కోట్లతో ఈ ప్రాజెక్ట్ నడుస్తుంది. ఐ=ఐూ పరిధిలోని ఏరోనాటికల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ పర్యవేక్షణలో ప్రైవేట్ సంస్థ 5 అధునాతన యుద్ధ విమాన నమూనాలను, ఒక స్ట్రక్చరల్ టెస్ట్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను ఇక్కడే నిర్మిస్తుంది.

### భారత వైమానిక దళానికి వెన్నుముక

అమ్కా అనేది కేవలం ఒక యుద్ధ విమానం కాదు, భారత వైమానిక దళానికి వెన్నుముక కాబోయే అస్త్రం. శత్రువుల రాడార్ల కళ్లు కప్పి లోపలికి దూసుకెళ్లేలా దీనికి ప్రత్యేక 'స్టెల్త్ కోటింగ్, ఆయుధాలు లోపలే దాగి ఉండేలా అమరుస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచంలో కేవలం అమెరికా, చైనా, రష్యా వద్ద మాత్రమే ఇటువంటి ఐదో తరం యుద్ధ విమానాలు ఉన్నాయి. ాూీజాూ విజయవంతమైతే, ఈ అగ్రరాజ్యాల సరసన భారత్ సగర్వంగా నిలబడుతుంది. విదేశాలపై ఆధారపడటం పూర్తిగా తగ్గుతుంది. ఐదో తరం యుద్ధ విమానాల తయారీ అత్యంత సంక్లిష్టమైనది. ఇందుకోసం సుదీర్ఘ సమయం పడుతుంది. ఈ ప్రాజెక్ట్ టైమ్‌లైన్ ప్రకారం మొదటి ప్రోటోటైప్ విమానం 2028 నుంచి 2032 మధ్య తొలిసారి గాల్లోకి ఎగిరే అవకాశం ఉంది. అన్ని రకాల పరీక్షలు పూర్తి చేసుకుని, 2035 నాటికి ఇది భారత వైమానిక దళంలో పూర్తిస్థాయిలో చేరనుంది. ప్రైవేట్ భాగస్వామ్యం వల్ల ఈ ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని రక్షణ నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సరిహద్దుల్లో చైనా, పాకిస్తాన్ సవాల్‌లను ఎదుర్కొనేందుకు, అలాగే రక్షణ రంగంలో స్వయంసమృద్ధి సాధించేందుకు అమ్కా ప్రాజెక్ట్ భారత్‌కు ఒక గేమ్ ఛేంజర్ కాబోతోంది.

# ప్రధాని మోదీతో తమిళనాడు సీఎం విజయ్ భేటీ

తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ చంద్రశేఖర్ బుధవారం ప్రధాని మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. విజయ్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రధానిని కలవడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. ఈ భేటీ సందర్భంగా ఇరువురు నేతలు పలు కీలక విషయాలపై చర్చలు జరిపారు. ముఖ్యంగా 'మేకెదాటు డ్యామ్' ప్రాజెక్టు, తమిళ మత్స్యకారుల అరెస్టుల గురించి విజయ్ మోదీతో మాట్లాడారు. ప్రభుత్వ అధికారిక ప్రకటన ప్రకారం, నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా అనైమంగళం రాగి శాసనాలను తిరిగి భారత్?కు తీసుకొచ్చినందుకు ప్రధాని మోదీకి, ముఖ్యమంత్రి విజయ్ కృతజ్ఞతలు తెలియజేశారు. దీనితోపాటు తమిళనాడు ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల ప్రారంభంలో సంప్రదాయకంగా రాష్ట్ర ప్రార్థన గీతం 'తమిళ తాయ్ వాళ్తు' పాడడం ఆనవాయితీగా వస్తోందని సీఎం విజయ్ ప్రధానికి వివరించారు. అయితే ఈ ఏడాది జనవరిలో కేంద్ర హోంశాఖ జారీ చేసిన ఒక సర్క్యులర్ తర్వాత, ప్రభుత్వ కార్యక్రమాల్లో జాతీయ గీతాన్ని ముందుగా పాడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభంలో ఎప్పటిలానే రాష్ట్ర ప్రార్థన గీతాన్ని పాడడానికి అనుమతిస్తూ తగిన వివరణ ఇవ్వాలని కేంద్ర హోంశాఖను ఆదేశించాలని విజయ్ ప్రధానిని కోరారు.

తమిళనాడులో 'సెంటర్ ఫర్ ఎయిర్‌బోర్న్ సిస్టమ్స్' (సీఏబీఎస్) ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని కూడా విజయ్



కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ) డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్, అలాగే సీఏబీఎస్ ఏర్పాటు చేయడంపై గత కొన్ని సంవత్సరాలుగా రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ)తో చర్చలు జరుగుతున్నాయని చెప్పారు.

కర్ణాటక డ్యామ్‌కు అనుమతి ఇవ్వొద్దు

కావేరీ నదిపై కర్ణాటక ప్రభుత్వం ప్రతిపాదించిన 'మేకెదాటు డ్యామ్?' ప్రాజెక్టు గురించి కూడా ప్రధాని మోదీతో విజయ్? మాట్లాడారు. 'ఈ మేకెదాటు ప్రాజెక్టు కోసం భూమి పూజ చేస్తామని కర్ణాటక ఉపముఖ్యమంత్రి ప్రకటన చేశారు. కావేరీ నీటి వివాదాల ట్రిబ్యునల్? ఇచ్చిన తుది తీర్పునకు, సుప్రీంకోర్టు ఆదేశాలకు ఇది పూర్తిగా విరుద్ధం' అని విజయ్ పేర్కొన్నారు. కర్ణాటక తలపెట్టిన ప్రాజెక్టు వల్ల తమిళనాడు రైతుల్లో తీవ్ర ఆందోళన కలిగించిందని ఆయన చెప్పారు. కావేరీ నదీ పరీవాహక ప్రాంతాలుగా ఉన్న తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల అనుమతి లేకుండా ఈ మేకెదాటు ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు ఇవ్వవద్దని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖను, సెంట్రల్? వాటర్ కమిషన్?ను ఆదేశించాలని మోదీని విజయ్ కోరారు.

శ్రీలంక నౌకాదళం తమిళనాడు మత్స్యకారులను అరెస్టు చేయడం, వేధించడం లాంటి ఘటనలు రోజురోజుకూ పెరిగిపోతుండడంపై సీఎం విజయ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ఈ 2026 సంవత్సరంలోనే ఇలాంటి అరెస్టులు 12 సార్లు జరిగాయన్నారు. ప్రస్తుతం 58 మంది మత్స్యకారులు శ్రీలంక జైళ్లలోనే ఉన్నారని, అలాగే 266 ఫిషింగ్ బోట్లను శ్రీలంక స్వాధీనం చేసుకుందని ఆయన వివరించారు. మన మత్స్యకారులను, వారి బోట్లను వెంటనే విడుదల చేసేలా శ్రీలంక ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ప్రధానిని కోరారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి విజయ్?, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్?ను మర్యాదపూర్వకంగా కలిశారు. హస్తిన పర్యటనలో ఉన్న ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్? షాతోపాటు కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతోనూ సమావేశమయ్యే అవకాశం ఉందని సమాచారం.

# అసోంలో 'ఉమ్మడి పౌర స్మృతి' బిల్లుకు ఆమోదం

అసోం అసెంబ్లీ బుధవారం 'ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) బిల్లు'ను ఆమోదించింది. ఈ బిల్లును సెలెక్ట్ కమిటీ పరిశీలన కోసం పంపాలని విపక్షాలు డిమాండ్ చేసినప్పటికీ హిమంత బిశ్వ శర్మ ప్రభుత్వం అందుకు అంగీకరించలేదు. మతంతో సంబంధం లేకుండా పెళ్లి, విడాకులు, వారసత్వం, సహజీవనం వంటి వ్యక్తిగత విషయాలపై అందరికీ ఒకే రకమైన చట్టాలను తీసుకురావాలనే లక్ష్యంతో అసోం ప్రభుత్వం సోమవారం ఈ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు ద్వారా బహుభార్యత్వాన్ని నిషేధించాలని, సహజీవనం రిజిస్ట్రేషన్‌ను తప్పనిసరి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ బిల్లు అసోంలో నివసించే ఏ షెడ్యూల్ తెగలకు (ఎస్‌టీ)లకు వర్తించదు. యూసీసీ ప్రకారం, ఒకరి కంటే ఎక్కువ మందిని పెళ్లి చేసుకుంటే ఏడేళ్ల జైలు శిక్ష విధిస్తారు. సహజీవనం చేసే జంటలు తమ బంధాన్ని రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే 3 నెలల జైలు శిక్ష విధిస్తారు.

### జవహర్‌లాల్ నెహ్రూనే యూసీసీ కావాలన్నారు

ఈ బిల్లు ఆమోదం పొందడానికి కొద్ది సేపటి ముందు అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. 1925లోనే పౌర ఉమ్మడి స్మృతిని మొదటిసారిగా సమర్థించింది కాంగ్రెస్ పార్టీయేనని ఆయన గుర్తు చేశారు. అయితే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ సెక్యులర్ (లౌకిక) పార్టీగా లేదని, కేవలం ఒక నిర్దిష్ట సమాజానికి ప్రతినిధిగా మారిపోయిందని ఆరోపించారు.

ఇకపై అసెంబ్లీలో 'ది యూనిఫామ్ సివిల్? కోడ్, అసోం, 2026'పై అడిగిన ప్రశ్నలకు సీఎం హిమంత బిశ్వ శర్మ సమాధానం ఇస్తూ, "ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నట్లుగా ఈ చట్టం బీజేపీ లేదా ఆర్?ఎస్?ఎస్? సిద్ధాంతాలపై ఆధారపడి లేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్? 44 ఆధారంగానే రూపొందించాం. వాస్తవానికి యూసీసీకి పెద్ద చరిత్రే ఉంది. దీనిని 1925లో మొదటిసారి కాంగ్రెస్ పార్టీయే డిమాండ్ చేసింది. 1937లో స్వయంగా జవహర్?లాల్ నెహ్రూ దీనిని ప్రవేశపెట్టాలని సూచించారు. కానీ అదే కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు యూసీసీని హిందూ, క్రైస్తవ, గిరిజనుల కోణం నుంచి కాకుండా



ఖురాన్?, షరియా కోణం ద్వారా చూస్తూ వ్యతిరేకిస్తోంది" అని విమర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్? పార్టీని విమర్శిస్తూ హిమంత కీలక వ్యాఖ్యలు చేశారు. "అసెంబ్లీలో కాంగ్రెస్? వారి ఎమ్మెల్యేల కూర్పు చేస్తేనే వారు అన్ని కులాలు, మతాలు, వర్గాలకు ప్రాతినిధ్యం వహించడం లేదని, కేవలం ఒక నిర్దిష్ట సమాజానికే ప్రాతినిధ్యం వహిస్తున్నారని అర్థం అవుతోంది. కాంగ్రెస్ పార్టీ అసోంకు ప్రాతినిధ్యం వహించడం లేదు. 126 మంది సభ్యులున్న అసోం అసెంబ్లీలో కాంగ్రెస్?కు 19 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. వారిలో 18 మంది ముస్లిం సమాజానికి చెందినవారు కాగా, ఒక్కరు మాత్రమే హిందువు" అని విమర్శించారు.

### అసోం ప్రజలకు అభినందనలు

యూసీసీ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో కేంద్ర హోం మంత్రి అమిత్?షా ఎక్స్? వేదికగా, అసోం ప్రజలకు అభినందనలు తెలిపారు. "ప్రధాని మోదీ నాయకత్వంలో, బీజేపీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి పౌరుడి కోసం ఒకే విధమైన చట్టాలు ఏర్పాటు చేస్తున్నాయి. ఉత్తరాఖండ్?, గుజరాత్? తర్వాత అసోం కూడా ఈ రోజు ఉమ్మడి పౌర స్మృతి బిల్లును ఆమోదించడం నాకు చాలా ఆనందంగా ఉంది" అని పేర్కొన్నారు.

### ఇది బీజేపీ రాజకీయ ఎజెండా

అంతకుముందు, ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు యూసీసీ బిల్లును తీవ్రంగా విమర్శించాయి. ఈ బిల్లులను బీజేపీ రాజకీయ ఎజెండా అని కొట్టిపారేశారు. ఈ బిల్లుపై ప్రజలతో పెద్ద ఎత్తున చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. అంతేకాదు ఈ ఉమ్మడి పౌర స్మృతి బిల్లు వల్ల మైనారిటీ మత వర్గాల హక్కులకు భంగం వాటిల్లుతుందేమోనని ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేశారు. "యూసీసీలో పేర్కొన్న విషయాలన్నీ ఇప్పటికే వేర్వేరు చట్టాల రూపంలో అమలులో ఉన్నాయి. బాల్యవివాహాలు, బహుభార్యత్వం, పెళ్లిళ్లు–విడాకుల రిజిస్ట్రేషన్?, భరణం వంటి విషయాలన్నీ మన ప్రస్తుత చట్టాల పరిధిలో ఉన్నాయి. మరి అలాంటప్పుడు మళ్లీ యూసీసీ తీసుకురావడంలో అర్థం ఏమిటి? బీజేపీ కేవలం రాజకీయాలు చేయడానికే ఈ బిల్లును తీసుకొచ్చింది. ఇలా పౌరుల వ్యక్తిగత విషయాల్లో జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్యం అనిపించుకోదు. గిరిజనులను మినహాయించినప్పుడు ఈ చట్టాన్ని యూనిఫామ్? (అందరికీ సమానమైనది) అని ఎలా పిలుస్తారు?" అని కాంగ్రెస్? ఎమ్మెల్యే వాజెద్ అలీ చౌదరి ప్రశ్నించారు. నిరుద్యోగం, వరదల సమస్య, ప్రభుత్వ పాఠశాలల దుస్థితి వంటి ప్రజలు ఎదుర్కొంటున్న అసలైన సమస్యల నుంచి దృష్టి మళ్లించడానికి హిమంత ప్రభుత్వం ఈ యూసీసీ బిల్లును తీసుకురావడానికి ప్రయత్నిస్తోందని వాజెద్ అలీ చౌదరి ఆరోపించారు. అయితే ప్రభుత్వం మాత్రం మతంతో సంబంధం లేకుండా పెళ్లి, విడాకులు, వారసత్వం, సహజీవనం వంటి వ్యక్తిగత విషయాలు అన్నింటికీ ఒకే రకమైన చట్టాలను అమలు చేయాలనేదే తమ ఉద్దేశమని స్పష్టం చేసింది. కాంగ్రెస్ ఎమ్మెల్యే జాకీర్ హుస్సేన్ సిక్దర్ మాట్లాడుతూ, 2018 నాటి లా కమిషన్ కూడా ఈ బిల్లును పాస్ చేయడానికి అభ్యంతరం పెట్టిందని గుర్తు చేశారు. ఇక అసోం అసెంబ్లీలోని ఏకైక తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ఎమ్మెల్యే షెర్మన్ అలీ అహ్మద్? ఈ బిల్లులోని నిబంధనలను వ్యతిరేకిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్?డీఏ ప్రభుత్వం దురుద్దేశంతో ఈ బిల్లును ప్రవేశపెట్టిందని ఆరోపించారు.

## సరిహద్దులకు 15 కి.మీ పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలు కూల్చేయాలి

దేశ సరిహద్దులకు 15 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అక్రమ నిర్మాణాలన్నీ కూల్చివేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధికారులను ఆదేశించారు. ఈ అంశంలో రాజీలేని విధానాన్ని అమలు చేయాలన్నారు. రాజస్థాన్‌లోని భారత్–పాక్ సరిహద్దు జిల్లాల్లో భద్రతా పరిస్థితులపై అమిత్ షా ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. దీనికి రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మతో పాటు పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. సరిహద్దు ప్రాంతాల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ఆయా జిల్లా కలెక్టర్లకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది.

### 'వైబ్రెంట్ విలేజెస్ ప్రోగ్రామ్'

అలాగే సరిహద్దు ప్రాంతాల్లోని అన్ని బ్యాంకింగ్ లావాదేవీల్లో చట్టపరమైన, ఆర్థికపరమైన నిబంధనల అమలును పర్యవేక్షించాలని కేంద్ర హోంశాఖ పేర్కొంది. పెద్ద పెద్ద వ్యాపార సంస్థలను తనిఖీ చేసి, వాటికి అందుతున్న నిధుల మూలాలను పరిశీలించాలని తెలిపింది. మ్యూల్ అకౌంట్లు, నకిలీ కంపెనీ కార్యకలాపాలను ఎప్పటికప్పుడు ట్రాక్ చేస్తూ ఉండాలని సూచించింది. నకిలీ ఆధార్ కార్డులను గుర్తించడంతో పాటు సరిహద్దుల గుండా జరిగే స్మగ్లింగ్‌ను పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్లను హోంశాఖ ఆదేశించింది. సరిహద్దు జిల్లాల్లో జరుగుతున్న నేరాలు, డ్రగ్స్ మహమ్మారి వెనుక ఉన్న నెట్‌వర్క్‌లపై లోతైన అధ్యయనం చేయాలని సూచించింది. ఈ సమస్యలు మళ్లీ తలెత్తకుండా శాశ్వత పరిష్కారాలను అన్వేషించాలని స్పష్టం చేసింది. సరిహద్దు జిల్లాల జనాభాకు మద్దతుగా నిలవడానికి, మౌలిక సదుపాయాల కొరతను తీర్చడానికి వైబ్రెంట్ విలేజెస్ ప్రోగ్రామ్‌ను విజయవంతంగా అమలు చేయాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తన ప్రకటనలో తెలిపింది.

### 360–డిగ్రీల భద్రతా కవచానికి ఏర్పాటు

ప్రతి సరిహద్దు జిల్లాకు పౌరులు, ప్రభుత్వ యంత్రాంగం, భద్రతా సంస్థలతో కూడిన 360–డిగ్రీల భద్రతా కవచాన్ని ఏర్పాటు చేయాలని అమిత్? షా చెప్పారు. ముఖ్యంగా అంతర్గత సరిహద్దులకు 15 కిలోమీటర్ల పరిధిలో అక్రమ నిర్మాణాలపై జీరో టాలరెన్స్ విధానాన్ని కఠినంగా అమలు చేయాలని, అటువంటి నిర్మాణాలన్నింటినీ కూల్చివేయాలని హోం మంత్రి పిలుపునిచ్చారు. చొరబాట్లు, మాదకద్రవ్యాల స్మగ్లింగ్, ఆక్రమణలు, ఉగ్రవాదానికి నిధులు సమకూర్చడం, ఇతర సరిహద్దు నేరాల వంటి సమస్యలను పరిష్కరించడానికి బీఎస్ఎఫ్, సీబీడీటీ, ఎన్‌సీబీ, ప్రభుత్వ యంత్రాంగం భాగస్వామ్యంతో సరిహద్దు నిర్వహణకు సమన్వయ విధానం అవసరమన్నారు. ఈ సమావేశంలో సరిహద్దు గ్రామాల్లో అన్ని ప్రభుత్వ పథకాలు నూటికి నూరు శాతం అందేలా చూడాలని అమిత్? షా ఆదేశించారు. అలాగే సైబర్ నేరాలను ఎదుర్కోవడానికి '1930' కాల్ సెంటర్‌ను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ అంశాలపై రెండు నెలల తర్వాత తిరిగి సమీక్ష, అభిప్రాయ సేకరణ చేపడుతారని తెలిపారు. అంతేకాకుండా జిల్లాలు ఫలిత ఆధారిత చర్యలను నిర్ధారించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అక్రమ వలసల ప్రభావం ఇప్పుడు కేవలం సరిహద్దు ప్రాంతాలకే పరిమితం కాలేదని కేంద్ర హోంశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వాటి ప్రభావం పట్టణ కేంద్రాలు, పారిశ్రామిక కారిడార్లు, గిరిజన ప్రాంతాలు, ఇతర సామాజికంగా, ఆర్థికంగా సున్నితమైన ప్రాంతాల వరకు విస్తరించిందని ఒక ప్రభుత్వ నోటిఫికేషన్ పేర్కొంది. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నవోలేకర్ నేతృత్వంలో జనాభా మార్పులపై ఉన్నత స్థాయి కమిటీ (హెచ్ఎల్‌సిడిసి) ఏర్పాటు చేసింది. ఢిల్లీ కేంద్రంగా పనిచేసే ఈ కమిటీలో సెన్సస్ కమిషనర్‌తో పాటు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దుర్గా శంకర్ మిశ్రా, మాజీ ఐపీఎస్ అధికారి బాలాజీ శ్రీవాస్తవ, డాక్టర్ షమికా రవి సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ఏడాదిలోగా తన నివేదికను సమర్పిస్తుంది. హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ, జాయింట్ సెక్రటరీ (విదేశీయులు–1) ఈ కమిటీకి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారని అమిత్? షా చెప్పారు.

## గురువారం సిద్ధరామయ్య రాజీనామా!

కర్ణాటకలో నాయకత్వ మార్పు దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయి. మంగళవారం దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీతో కర్ణాటక సీఎం సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ సమావేశమైన తర్వాత పరిణామాలు వేగంగా మారిపోతున్నాయి. సీఎం సిద్దరామయ్య గురువారం రాజీనామా చేస్తారని విస్తృత ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో సిద్దరామయ్య గురువారం గవర్నర్‌ను సమయం కోరడం, నాయకత్వ మార్పుపై అప్పుడే మాట్లాడతానని చెప్పడం ప్రాధాన్యం సంతరించుకుంది. కాగా మే 30న కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు కాంగ్రెస్ వర్గాల సమాచారం. మంగళవారం దిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీతో జరిగిన భేటీలో నాయకత్వ మార్పుపై అసలు చర్చే జరగలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ స్పష్టంగా చెప్పినప్పటికీ మార్పు దిశగా అడుగులు పడుతున్నాయి. ముఖ్యమంత్రి సిద్దరామయ్య గురువారం కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోత్ అపాయింట్‌మెంట్ కోరినట్లు సీఎంఓ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ వర్గాల సమాచారం ప్రకారం సిద్ధరామయ్య తన రాజీనామాను గవర్నర్ గెహ్లోత్‌కు సమర్పించే అవకాశం ఉంది. సిద్ధరామయ్య తన అధికారిక నివాసం 'కావేరి'లో గురువారం ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, ఇతర మంత్రివర్గ సహచరులతో అల్పాహార సమావేశం నిర్వహించనున్నారు. మాజీ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా బెంగళూరులోని విధాన సౌధలో ఆయనకు సీఎం నివాళులు అర్పించారు. తర్వాత సీఎం మార్పునకు సంబంధించి అడిగిన ప్రశ్నలపై గురువారమే మాట్లాడతానని సిద్ధరామయ్యచెప్పారు.

### విడివిడిగా కలిసిన నేతలు

దిల్లీలో మంగళవారం పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలు సిద్ధరామయ్య, శివకుమార్‌లతో విడివిడిగా సమావేశయ్యారు. వారితో సుదీర్ఘ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా పదవి నుంచి తప్పుకోవాలని సిద్దరామయ్యను అధిష్టానం కోరినట్లు సమాచారం. సిద్ధరామయ్యకు రాజ్యసభ స్థానం, కేంద్ర స్థాయిలో కీలక పాత్ర ఇవ్వజూపినట్లు వచ్చాయి. అయితే రాజ్యసభ ఎన్నికలు, కర్ణాటక శాసనమండలి ఎన్నికల గురించే చర్చించినట్లు సమావేశం తర్వాత కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ చెప్పారు. నాయకత్వ మార్పు గురించి కాదని చెప్పారు.

## 'ఈ స్కామ్‌పై విచారణకు సిట్ ఏర్పాటు చేయాలి'

సీబీఎస్ఈ 12వ తరగతి పరీక్షా ఫలితాలు భారీ అవకతవకలతో నిండిపోయాయని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ మొత్తం కుంభకోణం వెనుక ఉన్న నిజానిజాలను వెలికితీసేందుకు స్వతంత్రంగా న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేశారు. అందుకోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో గ్లోబరేనాగా పనిచేస్తున్నప్పుడు వివాదాల్లో చిక్కుకున్న కోఎంప్ట్‌కు సీబీఎస్ఈ కాంట్రాక్టును ఎందుకు ఇచ్చారని కేంద్ర సర్కార్‌ను ప్రశ్నించారు. కోఎంప్ట్ యాజమాన్యానికీ, ప్రధాని మోదీ ప్రభుత్వానికీ మధ్య ఉన్న సంబంధం ఏంటని ప్రశ్నించారు. కాగా, సీబీఎస్ఈ 12వ తరగతిలో ఈ ఏడాది కొత్తగా ప్రవేశపెట్టిన ఆన్‌స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) పద్ధతిపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం అయ్యాయి. ఈ విధానం కారణంగానే తమ సమాధాన పత్రాలు తారుమారయ్యాయని కొందరు విద్యార్థులు ఆరోపించారు. దీంతో తీవ్ర దుమారం రేగింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.

### 'విద్యార్థులు, వారి తల్లిదండ్రులు దిగ్భ్రాంతికి గురయ్యారు'

మూల్యాంకన వ్యవస్థలో జరిగిన అవకతవకల కారణంగా దాదాపు 18.5 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వివాదం ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ ఉద్దేశపూర్వక కుట్రను సూచిస్తోందని అన్నారు. మూల్యాంకన వ్యవస్థకు సంబంధించిన కాంట్రాక్టుల కేటాయింపుపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. "సీబీఎస్ఈ ఫలితాల స్కామ్‌తో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఇక మోదీజీ విషయానికొస్తే? ఎప్పటిలాగే ఈ విషయంపై ఆయన దగ్గర సమాధానాలు లేవు. జవాబుదారీతనం లేదు." అని రాహుల్ గాంధీ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "సీబీఎస్ఈ పరీక్షా ఫలితాల నిర్వహణ బాధ్యత అప్పగించిన కోఎంప్ట్ సంస్థ గతంలో 2019లో తెలంగాణలో గ్లోబరేనా పేరుతో పనిచేస్తూ ఇలాంటి దుశ్చర్యలకే పాల్పడింది. పేరు మారినా ఆ సంస్థ ఉద్దేశం, స్వభావం మారలేదు. ఆ సంస్థ చరిత్ర బహిరంగంగానే ఉన్నప్పటికీ, లెక్కచేయకుండా సీబీఎస్ఈ కాంట్రాక్టును దానికి అప్పగించారు. 18.5 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తును అలాంటి సంస్థకు అప్పగించారు. ఇది పొరపాటు కాదు.

# లాజిస్టిక్స్‌లో తెలంగాణ జోరు..



**హైదరాబాద్:** లాజిస్టిక్స్ రంగంలో తెలంగాణ మరో కీలక మైలురాయిని చేరుకుంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జాతీయ లాజిస్టిక్స్ ర్యాంకింగ్స్‌లో తెలంగాణ రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధించి హై పెర్ఫార్మర్‌గా నిలిచింది. గతంలో అచీవర్ కేటగిరీలో ఉన్న తెలంగాణ, ఈసారి మరింత మెరుగైన స్థాయికి చేరుకోవడం విశేషంగా మారింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన లీడ్స్-2025 నివేదికలో తెలంగాణ పనితీరును ప్రత్యేకంగా ప్రశంసించింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మౌలిక వసతుల అభివృద్ధి, పారిశ్రామిక ప్రోత్సాహకాలు, వేగవంతమైన నిర్ణయాలే ఈ ఫలితానికి కారణమని అధికారులు భావిస్తున్నారు.

దేశంలోని పలు రాష్ట్రాల మధ్య పోటీలో తెలంగాణ తన ప్రత్యేకతను చాటుకుంది. హర్యానా, ఛత్తీస్‌గఢ్, బిహార్ వంటి రాష్ట్రాలతో సమానంగా నిలవడంతో పాటు మధ్యప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల కంటే మెరుగైన ప్రదర్శన కనబరిచినట్లు నివేదిక వెల్లడించింది. ప్రత్యేకంగా జలమార్గాల వినియోగంపై తెలంగాణ చూపుతున్న దృష్టిని కేంద్రం ప్రశంసించింది. గోదావరి, కృష్ణా, భీమా, మంజీరా, తుంగభద్ర వంటి జాతీయ జలమార్గాలను సరకు రవాణాకు ఉపయోగించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు నివేదికలో ప్రస్తావించారు. పారిశ్రామిక పార్కుల్లో కనీసం ఐదు ఎకరాలను లాజిస్టిక్స్ మౌలిక వసతులకు కేటాయించే విధానాన్ని కూడా కేంద్రం ప్రశంసించింది. పరిశ్రమల అభివృద్ధితో పాటు రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఇది కీలక నిర్ణయంగా గుర్తించింది.

**యంగ్ ఇండియా స్కిల్స్ వర్సిటీకి కేంద్రం ప్రశంసలు**

ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ చేపడుతున్న చర్యలు కూడా కేంద్ర దృష్టిని ఆకర్షించాయి. స్కూల్ ఆఫ్ లాజిస్టిక్స్ అండ్ ఈ-కామర్స్ ద్వారా పరిశ్రమలకు అనుసంధానమైన కోర్సులు ప్రారంభించి యువతకు శిక్షణ అందిస్తున్నట్లు నివేదిక పేర్కొంది. మొదటి ఏడాదిలోనే 500 మందికి పైగా విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం రాష్ట్ర దూరదృష్టికి నిదర్శనంగా అభివర్ణించింది.

వేర్‌హౌస్ మేనేజ్‌మెంట్, లాజిస్టిక్స్ సేవలకు సంబంధించిన ప్రత్యేక కోర్సులు యువతకు ఉద్యోగ అవకాశాలు పెంచే దిశగా ముందుకు వెళ్తున్నాయి. ఇక నల్లగొండ జిల్లా చిట్యాలలో రూ.750 కోట్లతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ లాజిస్టిక్స్ పార్క్, మెదక్ జిల్లాలో ప్రతిపాదించిన మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్క్, నిజామాబాద్‌లో ఐసీడీ ప్రాజెక్ట్ వంటి పలు కార్యక్రమాలు రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి మరింత బలం చేకూర్చనున్నాయి.

రవాణా రంగం, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు.. ఇలా అన్ని రంగాల్లో తెలంగాణ వేగంగా ముందుకెళ్తోందని తాజా నివేదిక మరోసారి స్పష్టం చేసింది.

# తెలంగాణలో అకాల వర్షాలు



తెలంగాణ రాష్ట్రంలో మంగళవారం రాత్రి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వానలు బీభత్సాన్ని సృష్టించాయి. ఒక్కసారిగా కురిసిన వర్షానికి రైతుల బతుకులు అతలాకుతలం అయ్యాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే సమయానికి అకాల వర్షాలు అన్నదాతకు తీరని నష్టాన్ని మిగిల్చాయి. కొనుగోలు కేంద్రాల్లో మొక్కజొన్న, ధాన్యం తడిసి నీటిపాలయ్యింది. కన్న బిడ్డలా కాపాడుకున్న పంట అమ్మకం కోసం నిరీక్షిస్తున్న రైతుకు చివరాఖరికి కన్నీరే మిగిలింది. సిద్దిపేట జిల్లాలో అకాల వర్షం రైతులను తీవ్రంగా నష్టపరిచింది. మిరుదొడ్డి, తొగుట, దుబ్బాక, అక్బర్ పేట భూంపల్లి మండలాల్లో అర్ధరాత్రి ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. అకాల వర్షం అన్నదాతల గుండెల్లో గుబులు రేపింది. ఆయా మండలాల్లోని ఐకేపీ, సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేలాది క్వింటాళ్ల ధాన్యపు రాశులు వర్షపు నీటిలో తడిసి ముద్దయ్యాయి. తూకం వేసిన ధాన్యపు సంచులు సైతం తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గజ్వేల్ నియోజకవర్గం వ్యాప్తంగా మార్కెట్ యార్డులు, రహదారులపై ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ములుగు మండలం బండతిమ్మపూర్ లో భారీ వర్షానికి ధాన్యం, పశుసంపద నష్టపోవడంతో రైతులు ఆందోళన చెందారు. నర్సాపూర్ నియోజకవర్గం, పాపన్న పేట మండలంలోని కొనుగోలు కేంద్రాలు జలమయమై చెరువులను తలపించాయి. సంగారెడ్డి జిల్లాలోని పలు కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన వేల ధాన్యపు బస్తాలు తడిసి ముద్దయ్యాయి. సకాలంలో వడ్లు తూకం వేయకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**రైతులకు తీవ్ర నష్టం**

అర్ధరాత్రి కురిసిన అకాల వర్షం ఉమ్మడి కరీంనగర్ జిల్లా రైతుల గుండెల్లో గుబులు పుట్టించింది. చొప్పదండి, రామడుగు, గంగాధర, మానకొండూరు మండలాల్లో వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో నిల్వచేసిన ధాన్యం తడిసిముద్దైంది. నెల రోజులుగా విక్రయానికి ఎదురుచూస్తున్న రైతులకు తీవ్ర నష్టం వాటిల్లడంతో కన్నీరు మున్నీరవుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్ పల్లి మార్కెట్లో అమ్మకానికి తెచ్చిన మొక్కజొన్న, ధాన్యం తడిచిపోయింది. వర్షానికి పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో అమ్మకానికి పోసిన మక్కలు, వరి ధాన్యం తడిసి ముద్దయ్యాయి. కుండపోత వర్షం కురవడంతో వరి ధాన్యం కుప్పల్లోకి నీరు చేరి.. కొంత ధాన్యం కొట్టుకుపోగా, మక్కల బస్తాలు సైతం తడిసిపోయాయి. మార్క్ ఫెడ్ ద్వారా నెల రోజుల క్రితం కొనుగోలు కేంద్రం ప్రారంభించగా నేటికీ మక్కలను కొనలేదని అందుకే తమకు ఈ దుస్థితి ఏర్పడిందని రైతులు ఆరోపించారు.

కొనుగోలు కేంద్రాల్లో తడిసిముద్దైన ధాన్యం : కామారెడ్డి జిల్లాలో అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి కొనుగోలు కేంద్రాల వద్ద అరబెట్టిన ధాన్యం తడిసి ముద్దైంది. మాచారెడ్డి, కామారెడ్డి, బిక్కనూర్, దోమకొండ, బీబీపేట్ మండలాలతోపాటు రాజంపేట, తాడ్వాయి, రామారెడ్డి, సదాశివ నగర్ మండలాల్లో సైతం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. కల్లాలో ఆరబెట్టిన వరి, మొక్కజొన్న, జొన్న పంటలు పూర్తిగా తడిసిపోయాయి. హమాలీల కొరత, అధికారుల అలసత్వంతో కాంటా ఆలస్యం కావడంతోనే ధాన్యం తడిసి పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సకాలంలో ధాన్యాన్ని కొనుగోలు చేసి ఉంటే ఇలాంటి నష్టం జరిగేది కాదని వాపోతున్నారు. నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి, తెలకపల్లి, తాడూరు, తిమ్మాజిపేట మండలాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిముద్దయింది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మార్కెట్‌లో ఆరబెట్టి సంచుల్లో నింపిన మట్నుక్కజొన్న, ధాన్యం తడిసిపోయిందని రైతులు లబోదిబోమంటున్నారు. అకాల వర్షాలు పడుతున్న ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ : రెండు మూడు వారాలుగా కేంద్రాల్లో పడిగాపులు కాస్తున్నా ధాన్యం కొనకుండా ఇప్పుడు నష్టాలపాలు చేశారని రైతులు ప్రభుత్వంపై మండిపడుతున్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.జ

# పోలీస్ కస్టడీకి బండి భగీరథ్ - ముగిసిన తొలిరోజు విచారణ

పోక్సో కేసులో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్?పై నమోదైన పోక్సో (గూజూూ) కేసు ప్రస్తుతం దర్యాప్తు దశలో ఉంది. మంగళవారం బండి భగీరథ్‌ని 3 రోజులపాటు పోలీసు కస్టడీకి మల్కాజిగిరి కోర్టు అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. బుధవారం పోలీసులు భగీరథ్‌ని కస్టడీలోకి తీసుకున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి పెట్‌బషీరాబాద్ పీఎస్‌కు తరలించారు. అనంతరం మొయినాబాద్‌లోని అరణ్య ఫామ్‌హౌస్‌కు సీన్ రీకన్‌స్ట్రక్షన్ కోసం తీసుకెళ్లారు.

**ముగిసిన బండి భగీరథ్ విచారణ**

అరణ్య ఫామ్‌హౌస్?లో సీన్ రీకన్‌స్ట్రక్షన్ అనంతరం బండి భగీరథ్‌నుకూకట్‌పల్లి డీసీపీ కార్యాలయానికి తీసుకొచ్చారు. కూకట్‌పల్లి డీసీపీ ఆధ్వర్యంలో తొలిరోజు భగీరథ్‌ను విచారించారు. అనంతరం పేట్‌బషీరాబాద్ పీఎస్‌కు బండి భగీరథ్‌ను తరలించారు. మరో రెండు రోజులు భగీరథ్‌ని విచారించాల్సి ఉంది. 7 రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని పోలీసులు కోరినా, కోర్టు కేవలం 3 రోజులపాటు మాత్రమే కస్టడీకి అనుమతి ఇచ్చింది.



**అసలేం జరిగింది :** 2025 జూన్‌లో కామన్ ఫ్రెండ్స్ ద్వారా సదరు మైనర్ బాలికకు బండి భగీరథ్‌తో పరిచయం ఏర్పడిందని, అక్టోబర్, డిసెంబర్ 2025 మధ్య కాలంలో భగీరథ్ తనపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని, మద్యం సేవించాలని ఒత్తిడి చేశాడని బాధిత మైనర్ బాలిక ఆరోపించింది. మైనర్ బాలిక ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హైదరాబాద్‌లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేశారు. బాలల లైంగిక నేరాల నిరోధక చట్టం (పోక్సో)తో పాటు, తీవ్రమైన లైంగిక దాడి ఆరోపణల కింద భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని కఠినమైన సెక్షన్లను పోలీసులు ఈ కేసులో చేర్చారు.

**14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ :** మేడ్చల్ మెజిస్ట్రేట్ ఎదుట పోలీసులు బాధితురాలితో పాటు ఆమె తల్లి వాంగ్మూలాలను నమోదు చేశారు. పోలీసులు మరికొన్ని సెక్షన్లు యాడ్ చేశారు. అనంతరం నాటకీయ పరిణామాల మధ్య బండి భగీరథ్?ను పోలీసులు అరెస్టు చేశారు. న్యాయస్థానం 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించడంతో బండి భగీరథ్ చర్లపల్లి జైలుకు తరలించారు.

**పోలీస్ కస్టడీ**

ఈ కేసులో మరిన్ని కీలక ఆధారాలు, సమాచారాన్ని రాబట్టేందుకు నిందితుడు భగీరథ్?ని మూడు రోజుల పాటు పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ మేడ్చల్ మల్కాజిగిరి న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఇతర వివరాలు ఈ కేసులో దర్యాప్తు చట్ట ప్రకారం జరుగుతోందని, తాము విచారణకు పూర్తిగా సహకరిస్తున్నామని భగీరథ్ తరపు న్యాయవాది పేర్కొన్నారు.

**ఇన్‌ఫ్లుయెన్సర్లపై కేసులు నమోదు**

సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు కేసులు భగీరథ్‌కు మద్దతుగా, మైనర్ బాలికి ఫోటోలు, వీడియోలు చేశారనే ఆరోపణలు వచ్చాయి. అలాగే కేసును తప్పుదోవ పట్టించేలా వీడియోలు, ఫోటోలు వైరల్ చేశారనే ఆరోపణలపై సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై పేట్ బషీరాబాద్ పోలీసులు కేసులు నమోదు చేశారు.

## ఇందిరమ్మ జీవిత బీమా పథకం కోసం ఇంటింటి సర్వే

-మొదటిపేజీ తరువాయి

సమర్పించాలని కోరింది. మంగళవారం సచివాలయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన ఉపసంఘం సమావేశం జరిగింది. ఈ మంత్రులు ఉత్తమ్?కుమార్?రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్?రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్?బాబు పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిల్లో ఇప్పటివరకు నిర్వహించిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల వివరాలను ఉపసంఘం సమీక్షించింది. ఈ మేరకు భట్టి మాట్లాడుతూ ఇంటింటి సర్వేతో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా అమలు చేయాలి. రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 90 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం అయింది. ఈ కార్యక్రమ ముగింపు వేడుకలను జూన్? 2 నుంచి 12 వరకు ఘనంగా నిర్వహించాలి. రాబోయే రోజుల్లో ప్రజాభాగస్వామ్యంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలి అని చెప్పారు.

సమావేశంలో జూన్ 2 నుంచి 12 వరకు నిర్వహించాల్సిన కార్యక్రమాలపై మంత్రులు చర్చించారు. రోడ్డు భద్రత, పర్యావరణ వారోత్సవం, మాదవ ద్రవ్యాలపై వ్యతిరేక ప్రచారం, గృహ నిర్మాణం, మహిళ-శిశు రక్షణ, పర్యాటక ప్రోత్సాహం, పట్టణాభివృద్ధి, అభివృద్ధి కార్యాక్రమాలకు శంకుస్థాపనలు, హరిత ఇంధన ప్రాజెక్టులు, ప్రారంభోత్సవాలను నిర్వహించాలని నిర్దేశం చేశారు. ఎలాంటి లోపాలు లేకుండా, అన్నిశాఖలు సమన్వయంతో పని చేయాలని మంత్రులు స్పష్టం చేశారు.

**జూన్ 2 నుంచి ఇందిరమ్మ బీమా పథకం**

ప్రతి కుటుంబానికి బీమా రూపంలో భద్రత కల్పించేందుకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం జూన్? 2 నుంచి ప్రవేశ పెట్టనుంది. గతంలో తెలంగాణ ప్రభుత్వ వార్షిక బడ్జెట్?లో కీలక ప్రకటన చేసింది. సామాజిక అంతరాలతో సంబంధం లేకుండా రాష్ట్రంలోని 1.15 కోట్ల కుటుంబాలకు రూ.5 లక్షలతో జీవితా బీమా పథకం ప్రవేశపెడుతున్నట్లు ప్రకటించింది. సగటు కుటుంబంలో నలుగురు సభ్యులు ఉండటం సహజం. కానీ అందులో ఒక్కరికే జీవిత బీమా పాలసీ ఉంటే దాని క్లెయిమ్? ద్వారా కుటుంబం మొత్తానికి భరోసా లభిస్తుందా? అనేది చాలా మందికి ఉండే సందేహం. అయితే ఎలాంటి సమస్య రాకుండా ఉండేందుకు ఒకటికంటే ఎక్కువ పాలసీలు తీసుకోవచ్చా? తీసుకుంటే వాటి నిర్వహణ ఎలా ఉండాలి అనే విషయంలో నిపుణులు సూచనలు మీ కోసం.

**రెండు పాలసీలు వర్తిస్తాయా?**

వయసు పెరిగే కొద్దీ బాధ్యతలు పెరుగుతాయి. ఒక వ్యక్తికి 30 సంవత్సరాల వయసు ఉన్నప్పుడు పరిమిత హామీ మొత్తంలో కూడిన ఒక జీవిత బీమా పాలసీ సరిపోవచ్చు. అదే వ్యక్తి 50 సంవత్సరాల వయసుకు చేరేసరికి కుటుంబానికి మూలధారం కావచ్చు. సాధారణంగా చిన్న కుటుంబాలలో నలుగురు సభ్యులుంటారు. వీరితో పాటు సీనియర్? సిటిజన్లు అయిన తల్లిదండ్రులను బాధ్యతలు చూడాలి. అలాంటప్పుడు ఉన్న బీమా పాలసీ అదనపు ఖర్చులకు సరిపోతుందా కుటుంబ ఆర్థిక రక్షణకు, కుటుంబ సభ్యుల అవసరాలు తీర్చేందుకు ఒక పాలసీ సరిపోదనుకుంటే అవసరానికి తగినట్లు సమయానుసారం అదనపు పాలసీలను కొనుగోలు చేయవచ్చా ఒకవేళ కొనుగోలు చేస్తే పాలసీలన్నింటిని ఎలా నిర్వహించాలి? అనే ప్రశ్నలు తలెత్తుతాయి. రెండు లేదా అంతకంటే ఎక్కువ జీవిత బీమా పాలసీలను క్లెయిమ్ చేసుకోవడం సాధ్యమే. ఇది పాలసీదారుడు బీమా అవసరాలు, ఏ ప్లాన్? కొనుగోలు చేశారు అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. అదే విధంగా పాలసీదారులకు ఎంత వరకు బీమా అందించవచ్చు అనే విషయమై బీమా సంస్థలకు కూడా నిర్దిష్ట మార్గదర్శకాలు ఉన్నాయి. పాలసీ కొనుగోలు చేసిన వ్యక్తి ఆదాయం, వయసు, ప్రీమియం చెల్లింపులు సామర్థ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఎంత మొత్తం హామీగా ఇవ్వచ్చు అనేది బీమా సంస్థలు నిర్ణయిస్తాయి. ఏదేమైన ఒక వ్యక్తి రెండో పాలసీ కొనుగోలు చేయాలనుకుంటే, రెండు పాలసీల గురించి బీమా సంస్థకు సమాచారం ఇవ్వాలి. అంతేకాదు ఈ విధంగా రెండో జీవిత బీమా పాలసీని ఎందుకు ఎంచుకుంటున్నారో పేర్కొనాలి.

## తుమ్మిడిహట్టిపై చర్చించేందుకు సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

ప్రభుత్వం అడుగు ముందుకేసింది. ఈ మేరకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందంతో సమావేశానికి సమయమివ్వాలని, అనుకూలమైన తేదీని త్వరగా ఖరారు చేయాలని రేవంత్ కోరారు.

**తెలంగాణకు నీళ్లొస్తాయి**

తుమ్మిడిహట్టి ఎత్తుపై మహారాష్ట్రతో చర్చించాల్సిన అవసరం ఉందన్న సీఎం రేవంత్ రెడ్డి గతంలో 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్‌కు మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని గుర్తు చేశారు. 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ వల్ల ఉత్తర తెలంగాణ నీటి అవసరాలు తీరవని తెలిపారు. ఎఫ్ఆర్ఎల్ పెరిగితే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీళ్లొస్తాయని, ఎఫ్ఆర్ఎల్ పెంచినా మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువేనని రేవంత్ లేఖలో పేర్కొన్నారు.

**కేంద్రమంత్రితో ముఖ్యమంత్రి భేటీ**

కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియాతో సీఎం రేవంత్ రెడ్డి వర్చువల్ గా భేటీ అయ్యారు. అమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రాం కింద తెలంగాణలో టీ-ఫైబర్ ప్రాజెక్టు అమలుపై చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి పలు కీలక అంశాలను కేంద్రమంత్రి దృష్టికి తీసుకువెళ్ళారు. ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి బలమైన హైస్పీడ్ ఇంటర్నెట్ అందించాలనే అంశంపై ఈ సమావేశంలో చర్చ జరిగింది.

అమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రాం అమలుకు సంబంధిత ఒప్పందాన్ని త్వరితగతిన కుదుర్చుకోవడం, పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదల వేగవంతం తదితర అంశాలపై చర్చించారు. మండలం నుంచి గ్రామ పంచాయతీ రింగ్ నెట్ వర్క్ ఆస్తులను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చేసేందుకు స్పష్టమైన విధానం ఏర్పాటు చేయడంపై వారు చర్చించారు. తెలంగాణ విజ్ఞప్తులపై సింధియా సానుకూలంగా స్పందించారు. కేంద్రం సహకరిస్తుందని హామీ ఇచ్చారు.

## వాహన్ తిప్పలు.. దళారుల రాజ్యం

**హైదరాబాద్ :** 'రవాణా శాఖ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా డిజిటల్ సేవలను సులభతరం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్రీకృత 'వాహన్' పోర్టల్ వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు తెచ్చిపెడుతోంది. సాంకేతిక సమస్యల కారణంగా ఆన్‌లైన్ సేవలు సకాలంలో అందకపోవడంతో సామాన్యులు విసిగిపోతున్నారు. ఇదే తరుణాన్ని ఆసరాగా చేసుకుని దళారులు (ఏజెంట్లు) వేలల్లో డబ్బులు తీసుకుంటూ సామాన్యులను దోచుకుంటున్నారు. లర్నింగ్ లైసెన్స్ (ఒఒఖీ), డ్రైవింగ్ లైసెన్స్ పునరుద్ధరణ (రెక్టిఫికేషన్/రిన్యూవల్), చిరునామా మార్పు, డూప్లికేట్ లైసెన్స్ వంటి విభిన్న రకాల సేవల కోసం దేశవ్యాప్తంగా ఒకే విధానం ఉండేలా ఈ పోర్టల్‌ను రూపొందించారు. రాష్ట్ర రవాణా శాఖ ఇటీవల ఈ విధానంలోకి మారినప్పటికీ, అప్పటి నుంచి సాంకేతిక లోపాలు నిత్యకృత్యంగా మారాయి. గతంలో నిమిషాల్లో పూర్తయ్యే డ్రైవింగ్ టెస్ట్ స్లాట్ బుకింగ్ ప్రక్రియ, ఇప్పుడు అరగంట దాటినా కావడం లేదు. ఎల్ఎల్ఆర్ దరఖాస్తుకు మొబైల్ నంబర్ ఆథెంటికేషన్ కావడం లేదు. సరైన సైజులో ఫోటోలు, సంతకం, ఇతర ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేసినప్పటికీ వెబ్‌సైట్‌లో లోపాలు తలెత్తుతున్నాయి. సొంతంగా ఆన్‌లైన్ లో దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నిస్తే వెబ్‌సైట్ పనిచేయకపోవడం, అదే రవాణా కార్యాలయాల్లోని ఏజెంట్లను ఆశ్రయిస్తే వెంటనే స్లాట్ బుకింగ్ అయిపోతుండటం గమనార్హం. వెబ్‌సైట్‌లో ప్రతి సేవకు ఒక నిర్దిష్టమైన ప్రభుత్వ రుసుము ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం దళారులు చెప్పిందే వేదంగా మారుతోంది. ఆన్‌లైన్ ఫీజుతో సంబంధం లేకుండా ఒక్కో సేవకు ఒక్కో రకమైన ధర నిర్ణయించి వాహనదారుల నుంచి వేల రూపాయలను వసూలు చేస్తున్నారు."నా కుమారుడికి లైసెన్స్ కోసం సొంతంగా ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేయడానికి ఎంత ప్రయత్నించినా కాలేదు. కానీ స్థానిక ఆర్టీఓ ఆఫీసులో ఒక ఏజెంట్‌ను సంప్రదించగానే వెంటనే స్లాట్ బుక్ అయింది. ఇందుకోసం అతనికి రూ. 3 వేలు ఇవ్వాల్సి వచ్చింది. రవాణా శాఖ ఆఫీసుల చుట్టూ తిరగకుండా సొంతంగా చేసుకోవచ్చని చెబుతున్నా, ఆచరణలో మాత్రం దళారులను ఆశ్రయించనిదే పని కావడం లేదు అని"ఆసిఫ్ నగర్‌కు చెందిన ఒక వాహనదారుడు ఆవేదన వ్యక్తం చేశారు. పోర్టల్‌లో ఎలాంటి సమస్యలు లేవని రవాణా శాఖ అధికారులు పైకి చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయి పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. జాతీయ సంస్థ 'ఎన్ఐసీ' (ఔఎఅ) నుంచి అవసరమైన టెక్నికల్ సపోర్ట్ తీసుకుంటున్నామని, 'వాహన్' పోర్టల్‌లో మరిన్ని కొత్త మాడ్యూళ్లను దశలవారీగా ప్రవేశపెడతామని అధికారులు పేర్కొంటున్నా

# సంపాదకీయం

## పొంచి ఉన్న నీటి ముప్పు

ఈ జీవికైనా సరే పీల్చేగాలి తర్వాత తాగే నీరు అత్యంత ముఖ్యం. అందువల్లే నీరు ఉన్నచోటే ఈ భూమండలం మీద సంస్కృతులు ఏర్పడ్డాయి. నగరాలు నిర్మాణమయ్యాయి. జీవజాతులు అభివృద్ధి చెందాయి. నీరు లేని చోట ఇప్పటికీ నిర్మానుష్యమైన వాతావరణం కనిపిస్తూ ఉంటుంది. అందువల్లే జలాన్ని జగతికి బలం అని పిలుస్తుంటారుఈ భూమండలంలో సముద్రాలు ఎక్కువగా ఉంటాయి. చాలా తక్కువ శాతం లో తాగునీటి వనరులు అందుబాటులో ఉంటాయి. తాగునీటిని సక్రమంగా వినియోగించుకుంటే ఇబ్బందులు ఉండవు. అలా కాకుండా ఇష్టానుసారంగా వాడితే ఇబ్బందులు ఎదురవుతుంటాయి. నీటిని విచ్చలవిడిగా వాడటం.. జల వనరులను పరిరక్షించుకోకపోవడంతో ఈ ప్రపంచంలో చాలామంది తాగునీటి కొరతను ఎదుర్కొంటున్నారు. పైగా అభివృద్ధి పేరుతో అడవులను నాశనం చేయడంవల్ల వర్షాలు అంతగా కురవడం లేదు. పైగా కాంక్రీట్ జంగిల్ పెరిగిపోవడంతో భూమిలోకి నీరు ఇంకడం పూర్తిగా తగ్గిపోతుంది. అందువల్లే నీటి కొరత తీవ్రంగా ఉంటున్నది.మనదేశంలో కూడా నీటి కొరతతో ఇబ్బంది పడే రాష్ట్రాలు చాలానే ఉన్నాయి. ఆమధ్య మహారాష్ట్రలోని లాతూర్ ప్రాంతానికి ప్రత్యేక రైలు భోగిలలో నీటిని తరలించారు. సైనికుల పహార మధ్య నీటిని సరఫరా చేశారు. దీనినిబట్టి నీటి కొరత ఏర్పడితే జనజీవనం ఏ స్థాయిలో అవస్థ పడుతుందో ఇది కళ్లకు కట్టింది. ఇప్పుడు ఇటువంటి కష్టాలను మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్నారు. మధ్యప్రదేశ్ పూర్తిగా అటవీ రాష్ట్రం. ఇక్కడ చాలా గ్రామాలు దూరం గా ఉంటాయి. ఈ గ్రామాలలో ప్రస్తుతం తాగునీటి కష్టాలు తీవ్రంగా ఉన్నాయి.మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కార్గోనే జిల్లాలోని భగవాన్య గ్రామపంచాయతీ పరిధిలోని సర్బాద్ అనే గ్రామంలో తాగునీటి కొరత తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో అక్కడ తాగునీటి కోసం ప్రజలు నరకం చూస్తున్నారు. సర్బాద్ గ్రామంలో తాగునీటి కోసం బాలికలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో వారు నీటిని సేకరిస్తున్నారు. బావిలో కనీసం తాడు కూడా లేదు. గుడ్డలను తాడుగా మార్చుకొని.. ఆ బాలికలు బావిలో నీటిని తీసుకొని పైకి ఎక్కుతున్నారు. ఏ మాత్రం పట్టు తప్పినా సరే బాలికలు గాయపడడం ఖాయం. రాజస్థాన్‌లోని పెద్ద నగరాల్లో ఒకటైన జైసల్మేర్ ప్రజలు నీటి కోసం అల్లాడుతున్నారు. గత పది రోజులుగా నగరంలో నీటి సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గోల్డెన్ సిటీగా పేరున్న జైసల్మేర్.. ఇప్పుడు నీటి కొరతతో సతమతమవుతోంది. జైసల్మేర్ ఎడారి ప్రాంతం. ఒక పక్క ఎండలు మండిపోతున్నాయి. గరిష్ట ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. వడగాల్పుల ప్రభావం ఎక్కువగా ఉంది. ఇలాంటి సమయంలో నీటి కొరత అంటే అక్కడి ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారో అర్థం చేసుకోవచ్చు.నల్లాల నుంచి నీటి సరఫరా ఆగిపోయి 10 రోజులవుతోంది. దీంతో ట్యాంకర్ల ద్వారా స్థానికులకు నీళ్లు సరఫరా చేస్తున్నారు. మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నాలుగైదు రోజులకు ఒకసారి మాత్రమే నీళ్లు సరఫరా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. పది రోజులుగా నీళ్లు రావడం లేదని అధికారులకు చెప్పినా, రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. నీటి కొరతపై అధికారులు స్పందిస్తూ స్థానిక కాలువకు సంబంధించిన నిర్వహణ పనుల వల్ల ప్రజలకు నీటి సరఫరాలో అవాంతరం ఏర్పడిందన్నారుప్రస్తుతం గ్రేటర్ లో1.30 కోట్ల జనాభాకు రోజుకు 813.28 ఎంజీడీల డిమాండ్ ఉండగా, ప్రస్తుతం వాటర్?బోర్డు 560 ఎంజీడీలు మాత్రమే సరఫరా చేయగలుగుతోంది. ఈ లెక్కన లోటు 253.28 ఎంజీడీలుగా ఉంది. అయితే, 2027 ఆఖరు నాటికి సిటీలో జనాభా1.57 కోట్లకు చేరుకుంటుందని, అప్పుడు నీటి డిమాండ్? 835 ఎంజీడీలు ఉండొచ్చని అధికారులు అంచనా వేశారు. అప్పటి వరకు గోదావరి 2, 3 దశలు పూర్తయితే 869 ఎంజీడీలు సమకూరుతుందని, ఇంకా 34 ఎంజీడీల మిగులు ఉంటుందంటున్నారు. 2030 నాటికి జనాభా 1.60 కోట్లకు చేరితే నీటి డిమాండ్?867.28 ఎంజీడీలకు చేరుకుంటుందని, అప్పటికీ సరఫరా సామర్థ్యం 869 ఎంజీడీలు ఉంటుందన్నారు. అయినా,1.72 ఎంజీడీల మిగులు ఉంటుందన్నారు. ఇక 2035 నాటికి జనాభా 1.73 కోట్లు.. డిమాండ్? 921.05 ఎంజీడీలు ఉంటుందని, సరఫరా సామర్థ్యం 869 ఎంజీడీలు కొనసాగుతుందని, అప్పుడు మాత్రమే 52.05 ఎంజీడీల కొరత ఉండే అవకాశం ఉందని అంచనా వేశారు. 2050 నాటికి నగర జనాభా 2.08 కోట్లకు చేరుతుందని భావిస్తుండగా నీటి డిమాండ్?రోజుకు 1,114.02 ఎంజీడీలు ఉంటుందని అంచనా వేశారు. అప్పుడు సరఫరా చేసే సామర్థ్యం మైనస్? 71 ఎంజీడీలకు పడిపోతుందని భావిస్తున్నారు. అప్పటి వరకూ ఇప్పుడు అనుకున్న అన్ని ప్రాజెక్టులు పూర్తయినా నీటి కొరత ఉంటుందని, అందుకని కొత్త వనరుల కోసం ప్రయత్నాలు చేయాల్సి ఉంటుందని అధికారులుచెబుతున్నారు. నగరం దక్కన్?ఏరియా కావడం వల్ల నీటి వనరులు తక్కువగానే ఉన్నాయి. మన దగ్గర హిమాయత్?సాగర్?, ఉస్మాన్?సాగర్? మాత్రమే ఉన్నాయి. సంగారెడ్డిలో సింగూరు, మంజీరా, నల్గొండ జిల్లాలో నాగార్జున సాగర్, ?పెద్దపల్లి జిల్లాలో ఎల్లంపల్లి ఉన్నాయి. సుదూర ప్రాంతాల నుంచి నగరానికి పైప్?లైన్? ద్వారా నీటిని తరలిస్తున్నారు. 2050 నాటికి ఊహించిన దానికన్నా జనాభా విస్ఫోటనం ఉంటే నీటి కొరతతో ఇబ్బంది తప్పకపోవచ్చని భావిస్తున్నారు. అందుకే కొత్త ప్రాజెక్టులు ఏం చేపట్టాలన్నదానిపై కసరత్తు చేస్తున్నారు. అలాగే, నీటి పొదుపుపై ప్రచారం నిర్వహించాలని భావిస్తున్నారు.

# ప్రధాని.. మీడియాతో ఎందుకు మాట్లాడరు?



మోదీ మూడు టర్మ్‌ల పాలనా కాలంలో తొలిసారి విదేశీ గడ్డపై చేదు అనుభవం నార్వేలో ఎదురైంది. మానవ హక్కులు, పత్రికా స్వేచ్ఛపై దాడి గురించి మోదీని మహిళా జర్నలిస్టు హెల్లే లింగ్ ప్రశ్నించారు. ఆయన సమాధానం ఇవ్వలేదు. భారత ఎంబసీ అధికారుల మీడియా సమావేశంలోనూ సదరు జర్నలిస్టు అదే ప్రశ్నను అడిగారు. అనంతరం ఈ రెండు విషయాలు సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి. ఆ తర్వాత నార్వేలో ప్రముఖ పత్రిక 'ఆఫ్టెన్ పోస్టెన్' లో మన ప్రధాని గురించి వివాదాస్పద కార్టూన్ ప్రచురితం కాగా అది కూడా చర్చకు దారితీసింది. మోదీ తీరు, నార్వే పర్యటనలో ఎదురైన అనుభవాలు, జవాబుదారీతనంపై విస్తృత చర్చ జరుగుతున్నది. బీజేపీ పాలనలో దేశంలో మీడియా స్వేచ్ఛ ఎట్లా ఉన్నదో అందరికీ అనుభవంలో ఉన్నదే. మీడియా స్వేచ్ఛలో మన ర్యాంకు 157వ స్థానంలో ఉన్నదని సదరు హేలి లింగ్ చెప్పిన తర్వాత ఆ విషయంపై కూడా రాజకీయ వర్గాలతోపాటు జన సంభాషణల్లో భాగమైంది. ఇక్కడ గమనించాల్సిన విషయాలు రెండు ఉన్నాయి. గతంలో మన దేశ ప్రధాన మం త్రులు చాలామంది వీదేశాల్లో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ప్రస్తుత ప్రధాన మంత్రి మోదీ మాత్రం విదేశాల్లో కాదు, మన దేశంలో కూడా ఇప్పటివరకు ప్రెస్‌మీట్‌లు నిర్వహించలేదు. ఇంత పెద్ద ప్రజాస్వామ్య దేశానికి పెద్దగా వ్యవహరిస్తున్న వారు తమ విధానాల గురించి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఉంటుంది. అంతెందుకు ప్రధాన మంత్రులు విదేశీపర్యటనల్లో ఉన్నప్పుడు విమానంలో కూడా మీడియాతో మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. మన్మోహన్‌సింగ్ పీఎంగా ఉన్నప్పుడు విమానంలోనూ మీడియాతో మాట్లాడేవారు. ఇందిరాగాంధీ కూడా అంతే. మీడియాతో వాజ్‌పేయి సన్నిహితంగా ఉండే వారు. కానీ ఇలాంటి సందర్భాలు పన్నెండేండ్లుగా ఒక్కటైనా లేదు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాన స్రవంతి మీడియా వ్యవహరిస్తున్న తీరు గురించి సోషల్ మీడియాలో ఎలాంటి అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయో చూడొచ్చు. కొంత మంది జర్నలిస్టులపై కేసులు నమోదయ్యాయి. అందులో కొందరిపై దేశ ద్రోహం కేసులు కూడా పెట్టారు. ప్రశ్నించే వారిని టార్గెట్‌గా చేసుకొని సోషల్ మీడియాలో మోదీ అభిమానులు భారీ ఎత్తున ట్రోల్స్ చేస్తున్నారు. ఆర్టికల్ 19, ఆర్టికల్ 21 గురించి పన్నెండేండ్లుగా రాజకీయ శిబిరాల్లో, మీడియా సంస్థల్లో చర్చ జరుగని రోజు లేదు. ఒకప్పుడు ఇందిరాగాంధీ విధించిన ఎమెర్జెన్సీ గురించి బీజేపీ నాయకులు పదే పదే విమర్శిస్తుంటారు. కానీ ఇప్పుడు అంతకు మించిన రోజులున్నాయని విపక్షాలు, ప్రజా హక్కుల సంఘాలు మండిపడుతున్నాయి. గతంలో కేంద్ర ప్రభుత్వాల పని తీరుపై భిన్న కోణాల్లో వార్తలు ప్రచురణ, ప్రసారం అయ్యేవి. కానీ నేడు మోదీ ప్రభుత్వ విధానాల గురించి వివిధ కోణాల్లో వార్తలు ఇస్తున్న సంస్థలు అరుదు. నేషన్ వాంట్సూ నో అంటూ గొంతు చించుకొనే జర్నలిస్టులు కూడా మోదీ మూడోసారి ప్రధాని అయిన తర్వాత ఎందుకో పెద్దగా చించుకోవడంలేదు. ఎవ్వరైనా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే వాళ్లపై దేశ ద్రోహులు అంటూ బురదజల్లటం బీజేపీ వర్గాల నిత్యకృత్యం. ఈ తరహా అనారోగ్యకరమైన వాతావరణంపై చాలా మందిలో ఆందోళన కూడా ఉన్నది. మన కంటే చాలా చిన్న దేశాలు మీడియా స్వేచ్ఛలో, మావన హక్కుల పరిరక్షణలో అగ్రభాగంలో ఉన్నాయి. వారి నుంచి మనం నేర్చుకోవాల్సింది చాలానే ఉన్నది. మన ప్రధాన మంత్రిని పాములు పట్టే వ్యక్తిగా నార్వే పత్రికవేసిన కార్టూన్‌ను భారతీయులుగా వ్యతిరేకించాల్సిందే. అయితే అక్కడి రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు మోదీ ఎందుకు సమాధానం చెప్పలేకపోయారనేది కూడా మనం ప్రశ్నించాల్సిందే. ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశ ప్రతిష్టను ప్రపంచం ముందు ఇనుమడింప చేసేలా మోదీ వ్యవహరించి ఉంటే బావుండేది కదా అని భారతీయుల అభిప్రాయం. నార్వే, నెదర్లాండ్స్, ఎస్టోనియా, డెన్మార్క్, స్వీడన్ లాంటి దేశాలు పత్రిక స్వేచ్ఛ విషయంలో మొదటి ఐదు స్థానాల్లో ఉన్నాయి. మన దేశం ఎందుకు 157 వ స్థానంలో ఉందో పాలకులే కాదు బుద్ధి జీవులు కూడా ఆలోచించాల్సిన సందర్భం ఇది.

# అవకాశవాదమే కాంగ్రెస్ అసలు సిద్ధాంతం

రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరనే నానుడిని అత్యంత క్రూరంగా ఆచరణలో పెట్టిన పార్టీ ఏదైనా ఉందంటే అది కాంగ్రెస్ మాత్రమే. అధికారం ఒక్కటే పరమావధిగా భావిస్తూ, అవసరం ఉన్నప్పుడు మిత్రపక్షాలను భుజాన వేసుకుని.. అవసరం తీరాక వాటిని నట్టేట ముంచేయటం ఆ పార్టీ రాజకీయ సంస్కృతిగా మారింది. తాజాగా తమిళనాడులో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాలు ఈ విమర్శలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. రెండు దశాబ్దాలకు పైగా కొనసాగిన డీఎంకే-కాంగ్రెస్ అనుబంధం ఒక్కసారిగా తెగిపోవటం, ఇటీవల జరిగిన ఆ రాష్ట్ర శాసనసభ ఎన్నికల ఫలితాలు వచ్చిన మరుసటిరోజే అధికార పార్టీ టీవీకేతో కాంగ్రెస్ కొత్త రాజకీయ సమీకరణాలకు శ్రీకారం చుట్టటం డీఎంకే వర్గాలను దిగ్భ్రాంతికి గురి చేసింది. డీఎంకే నేతల ఆవేదనలో ఒక ప్రధాన అంశం ఉన్నది. కాంగ్రెస్‌తో తమకు ఎదురైన చేదుఅనుభవం ఇదే మొదటిసారి కాదని, గతంలోనూ ఇలాగే వెన్నుపోటు రాజకీయాలకు పాల్పడిందని వారు గుర్తుచేస్తున్నారు. నిజానికి తమిళ రాజకీయాల్లో కాంగ్రెస్ నయవంచన చరిత్ర 1980 నుంచే మొదలైందని డీఎంకే వర్గాలు చెప్తున్నాయి. ఇందిరాగాంధీ హయాంలో 1980 లోక్‌సభ ఎన్నికల్లో తొలిసారిగా కాంగ్రెస్-డీఎంకే కూటమి ఏర్పడింది. అప్పట్లో ఈ కూటమి 39 స్థానాల్లో 37 గెలుపొంది సంచలన విజయాన్ని నమోదు చేసింది.

ఆ విజయాన్ని అడ్డంగా పెట్టుకుని అప్పటి ఎంజీఆర్ ప్రభుత్వాన్ని కేంద్రంలోని ఇందిరా సర్కార్ రద్దు చేసి.. రాష్ట్రపతి పాలన విధించింది. అయితే ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ ఎంజీఆర్ ఘనవిజయం సాధించారు. దీంతో కాంగ్రెస్ ఒక్కసారిగా తన వైఖరిని మార్చుకుని డీఎంకేను పక్కనబెట్టి, అన్నాడీఎంకేతో చేతులు కలిపింది. అప్పుడే డీఎంకేకు కాంగ్రెస్ రాజకీయ స్వభావం మొదటిసారి అర్థమైంది. ఇదే ధోరణి 1991లో మరింత స్పష్టంగా కనిపించింది.

ఎల్టీటీఈకి మద్దతిచ్చారనే ఆరోపణలతో కరుణానిధి ప్రభుత్వాన్ని రద్దు చేయించటంలో కాంగ్రెస్ కీలక పాత్ర పోషించింది. కేంద్రంలో చంద్రశేఖర్ ప్రభుత్వాన్ని అడ్డంపెట్టుకుని తమిళనాడులో డీఎంకే ప్రభుత్వాన్ని కూల్చివేయటం అప్పట్లో పెద్ద రాజకీయ కలకలానికి దారితీసింది.

### జైన్ కమిషన్ పేరుతో మరో దెబ్బ

అంతటి చేదు అనుభవాల తర్వాత కూడా1996లో డీఎంకే కాంగ్రెస్‌కు మద్దతుగా కేంద్రంలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో చేరింది. కానీ 1998లో రాజీవ్ గాంధీ హత్యపై జైన్ కమిషన్ నివేదికను సాకుగా చూపి కాంగ్రెస్ మళ్లీ డీఎంకేను టార్గెట్ చేసింది. జైన్ కమిషన్ నివేదికలో రాజీవ్ హత్యకు పాల్పడిన ఎల్టీటీఈ సభ్యులకు డీఎంకే మహిళా నేత సుబ్బులక్ష్మి జగదీశన్ సహకారం లభించి ఉంటుందని అనుమానం వ్యక్తం చేయటం అప్పట్లో పెద్ద దుమారం రేపింది. జైన్ కమిషన్ నివేదికను ఒక కారణంగా చూపి...డీఎంకేకు చెందిన మంత్రులు రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది.ట ఈ నేపథ్యంలో కేంద్రంలోని ఐకే గుజ్రాల్ ప్రభుత్వం కూలిపోయింది. ఇక్కడ కాంగ్రెస్ అవకాశవాద రాజకీయాల అసలు రూపం బయటపడిందనే విమర్శలు వచ్చాయి. ఎందుకంటే..జైన్ కమిషన్ నివేదికను చూపించి డీఎంకేను దెబ్బతీసిన అదే కాంగ్రెస్..2004లో యూపీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత డీఎంకే నాయకురాలు సుబ్బులక్ష్మి జగదీశన్‌కు కేంద్రమంత్రి పదవి ఇచ్చింది. జైన్ కమిషన్ నివేదిక విషయంలో ఒక్కసారిగా ఎలా మనసు మార్చుకున్నదనే ప్రశ్నకు కాంగ్రెస్ ఎప్పుడూ సమాధానం చెప్పలేదు. తమతో 22 ఏండ్ల అనుబంధాన్ని ఒక్కసారిగా తెంచుకుని, అధికారంలో భాగస్వామ్యం కోసం తమిళనాట విజయ్ నేతృత్వంలోని టీవీకేతో కాంగ్రెస్ చేతులు కలుపటం డీఎంకే నేతలకు తీవ్ర ఆగ్రహం తెప్పించింది. ఈ చర్యతో నాటి ఇందిరాగాంధీ కాలం నుంచి నేటి రాహుల్ గాంధీ నాయకత్వం వరకు కాంగ్రెస్ సంస్కృతిలో మార్పు రాలేదని మండిపడుతున్నారు. కేరళలోనూ కాంగ్రెస్‌పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల్లో పినరయ్ విజయన్ బీజేపీతో రహస్య అవగాహన కుదుర్చుకున్నారని రాహుల్ చేసిన వ్యాఖ్యలను కమ్యూనిస్టు పార్టీలు ఖండించాయి. ఇండి కూటమిలో కలిసి పనిచేస్తూనే, రాష్ట్ర రాజకీయాల్లో ఇలాంటి నీచమైన ఆరోపణలు చేయటం కాంగ్రెస్ ద్వంద్వవైఖరికి నిదర్శనమని వామపక్షాలు విమర్శిస్తున్నాయి.

ఇక్కడ కాంగ్రెస్ గుర్తుంచుకోవాల్సిన ఒక కీలక అంశం ఉన్నది. తమిళనాడు, కేరళలో రాజకీయ లబ్ధి కోసం మిత్రపక్షాలను దెబ్బతీయటం తాత్కాలికంగా ఉపయోగపడవచ్చు. కానీ జాతీయ రాజకీయాల్లో ఇండి కూటమి మనుగడ డీఎంకే, లెఫ్ట్ పార్టీల మద్దతుపైనే ఆధారపడి ఉన్నది. రానున్న రోజుల్లో పార్లమెంట్‌లో కీలక ఓటింగ్ జరిగితే డీఎంకే ఎంపీల మద్దతు లేకుండా కాంగ్రెస్ ఏమీ చేయలేని పరిస్థితి రావచ్చు. దేశ రాజకీయాల్లో కాంగ్రెస్ ప్రత్యామ్నాయ శక్తిగా మారుతుందని రాహుల్ చేస్తున్న ప్రకటనకు జనం నుంచి సరైన స్పందన లేకపోవటానికి ఈ అవకాశవాద రాజకీయాలే కారణమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మిత్రపక్షాలను ఉపయోగించుకుని వదిలేయటం, అధికారమే లక్ష్యంగా రాజకీయ సంబంధాలను తిరగరాయటం వంటి ధోరణులు తాత్కాలిక లాభాలు ఇవ్వవచ్చు. కానీ దీర్ఘకాలంలో అవే పార్టీ విశ్వసనీయతను దెబ్బతీస్తాయి. తమిళనాడులో డీఎంకే ఆగ్రహం, కేరళలో లెఫ్ట్ పార్టీల అసంతృప్తి, తెలంగాణలో కాంగ్రెస్‌పై ఇంకా పూర్తిగా చెరిగిపోని అనుమానాలు. ఇవన్నీ ఒక భావనను కలిగిస్తున్నాయి. అవకాశవాదంతో రాజకీయాలు నడపవచ్చు గానీ..విశ్వాసాన్ని మాత్రం కొనలేరు.

# కాంగ్రెస్, ఎస్పీ పొత్తు సాధ్యమేనా




**లక్నో :** యూపీలో తిరిగి అధికారాన్ని చేపట్టాలని సమాజ్ వాదీ పార్టీ ఎత్తుగడలు వేస్తోంది. వరుసగా మూడు సార్లు బీజేపీ యూపీని పాలిస్తోంది. మాయావతి సారథ్యంలోని బీఎస్పీ అంత బలంగా లేదు. దీంతో ఆ ప్లేస్ ని భర్తీ చేయాలని అఖిలేష్ యాదవ్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. 2024 లో బీజేపీని నిలువరించడానికి ఏ ఫార్ములా అయితే ఫాలో అయ్యారో.. 2027 అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ అదే ఫార్ములతో వెళ్లాలని నిర్ణయించారు.కాంగ్రెస్ తో పొత్తును కొనసాగించడానికే అఖిలేష్ మొగ్గు చూపుతున్నారు. అయితే.. రెండు రోజుల క్రితమే కాంగ్రెస్ నేతలు బీఎస్పీ అధినేత్రి మాయావతి ఇంటికి వెళ్లి కలిశారు. దీంతో అఖిలేష్ అప్రమత్తమైనట్లు తెలుస్తోంది. అందుకే వెంటనే కాంగ్రెస్ తోనే వుంటానని, సీట్ల సమస్య సమస్యే కాదని, విజయమే ముఖ్యమని తక్కుమని చెప్పుకొచ్చారు.కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తన పార్లమెంటరీ నియోజకవర్గమైన రాయ్‌బరేలీ నుండి 'మిషన్ 2027'కు శంఖారావం పూరించారు. సీట్ల పంపకాల చర్చల సమయంలో తమ వాదనలను బలంగా వినిపించే లక్ష్యంతో, రాష్ట్రంలో అభ్యర్థులను మరియు పోటీ చేసే స్థానాలను ఎంపిక చేసే ప్రక్రియను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది.మరోవైపు యూపీ ఎన్నికల్లో సమాజ్ వాదీతో పొత్తు కొనసాగుతుందని కాంగ్రెస్ కూడా ప్రాథమికంగా పేర్కొంటోంది. అయితే.. సీట్ల పంపకం విసయంలోనే భిన్నాభిప్రాయాలు వున్నాయి. గతంలో రెండు సందర్భాల్లో కాంగ్రెస్, ఎస్పీతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసింది. తత్ఫలితంగా, ఒక ప్రశ్న ఉత్పన్నమవుతోంది: 2027లో ఎస్పీ మరియు కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకానికి 2017 ఎన్నికల ఫలితాలు ప్రాతిపదికగా నిలుస్తాయా, లేక 2024లో అనుసరించిన సూత్రాన్నే ఇక్కడ కూడా వర్తింపజేస్తారా? అని ప్రశ్నలు వస్తున్నాయి.యూపీ రాజకీయాల్లో కాంగ్రెస్ ? ఎస్పీ మధ్య పొత్తు వచ్చినప్పుడల్లా సీట్ల పంపకమే ప్రస్తావనకు వస్తుంది. ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ-కాంగ్రెస్ కూటమి చెక్కుచెదరకుండా కొనసాగుతుందా? ఎస్పీతో పొత్తు విషయంలో రాహుల్ గాంధీ మౌనం పాటిస్తున్నప్పటికీ, కాంగ్రెస్‌తో తమ కూటమి కొనసాగుతుందని అఖిలేష్ యాదవ్ మాత్రం స్పష్టంగా ప్రకటించారు.ఉత్తరప్రదేశ్‌లో, కాంగ్రెస్ మరియు ఎస్పీ (సమాజ్‌వాదీ పార్టీ) రెండు సందర్భాలలో కలిసి ఎన్నికల్లో పోటీ చేశాయి. మొదటిసారిగా 2017 అసెంబ్లీ ఎన్నికల సమయంలో, ఎస్పీ మరియు కాంగ్రెస్ ఒక కూటమిగా ఏర్పడి ఎన్నికల బరిలోకి దిగాయి; ఆ తర్వాత, 2024 లోక్‌సభ ఎన్నికలలో, ఈ రెండు పార్టీలు తమ ఎన్నికల అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి మరోసారి చేతులు కలిపాయి. 2017లో, ఎస్పీ 311 స్థానాల్లో పోటీ చేయగా, కాంగ్రెస్ 114 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టింది. ఈ స్థానాల్లో తొమ్మిదింటిలో, కాంగ్రెస్ మరియు ఎస్పీ మధ్య "స్నేహపూర్వక పోటీ" జరిగింది. ఈ సారి ఏం జరుగుతుందో చూడాలి

# పంటల అవశేషాలు కాల్చితే జరిమానా,జైలుశిక్ష తప్పదు..

అవశేషాలను నేలలో కలియదున్నాలని రైతులకు సూచన..

**మందమర్రి,మే27(సూర్యరేఖ)** పంటల కోత అనంతరం మిగిలే అవశేషాలను కాల్చకుండా యంత్రాల సహాయంతో ముక్కలుగా చేసి నేలలో కలియదున్నాలని మండల వ్యవసాయ అధికారి జి.కిరణ్మయి రైతులకు సూచించారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో రైతులతో బుధవారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడుతూ...పంటల అవశేషాలను కాల్చడం వల్ల భూవాతావరణం వేడెక్కి భూమిలో మేలు చేసే సూక్ష్మజీవులు నశిస్తాయని తెలిపారు.దీంతో భూమిలో సేంద్రియ కర్బన శాతం తగ్గి నేల గట్టిపడి పంటల వేరు వ్యవస్థ దెబ్బతింటుందని చెప్పారు. అలాగే భూమి సారం కోల్పోయి మృత నేలగా మారే ప్రమాదం ఉందన్నారు.అదేవిధంగా అవశేషాల దహనం కారణంగా వాతావరణ కాలుష్యం పెరిగి ఓజోన్ పొర దెబ్బతింటుందని,అతినీలలోహిత కిరణాల ప్రభావంతో మానవాళికి వివిధ రకాల వ్యాధులు,క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉంటుందని వివరించారు.పొగమంచు కారణంగా రవాణా వ్యవస్థకు అంతరాయం కలగడమే కాకుండా మంటల కారణంగా రైతులు ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని హెచ్చరించారు.వరి కొయ్యలు,పత్తి కట్టెలను కాల్చకుండా యంత్రాలతో చిన్న ముక్కలుగా చేసి నేలలో కలిపి,సింగిల్ సూపర్ ఫాస్పేట్ ఉపయోగిస్తే అవి త్వరగా కుళ్లి భూసారం పెరుగుతుందని తెలిపారు.దీని ద్వారా అధిక దిగుబడులు, నాణ్యమైన పంట ఉత్పత్తి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భారత న్యాయ సంహిత సెక్షన్ 223,287 ప్రకారం పంటల అవశేషాలను కాల్చిన రైతులపై



చర్యలు తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు.రెండు ఎకరాల లోపు భూమిలో అవశేషాలు కాల్చితే రూ.5 వేల వరకు జరిమానా,రెండు నుంచి ఐదు ఎకరాల వరకు కాల్చితే రూ.10వేల వరకు జరిమానా,ఐదు ఎకరాలకు మించి కాల్చితే రూ.30 వేల వరకు జరిమానాతో పాటు జైలుశిక్ష కూడా విధించే అవకాశం ఉందని తెలిపారు.కావున రైతులు పంటల అవశేషాలను కాల్చకుండా నేలలో కలియదున్ని భూసారం పెంపొందించేందుకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి,వెంకటాపూర్,లేమూరు శివారు రైతులు పాల్గొన్నారు.

# లారీల కోసం రోడ్డెక్కిన రైతన్నలు....





**కొల్చారం,మే 27(సూర్య రేఖ):-** లారీలు రాక కొనుగోలు కేంద్రంలో వరి ధాన్యం నిలిచిపోయిందని రైతులు రోడ్డెక్కి ధర్నా చేపట్టారు. బుధవారం కొల్చారం మండలం చిన్నగఘపురం గ్రామానికి చెందిన రైతులు ఆందోళనకు దిగారు. 25 రోజులుగా కొనుగోలు కేంద్రంలో వడ్లు నిలిచిపోవడంతో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి తూకం వేసిన వడ్లు అలాగే ఉండిపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆందోళనకు దిగారు. నెల రోజులుగా కొనుగోలు కేంద్రంలోని వడ్లు తూకం వేసి ఉండడంతో తరుగు పేరిటదరైతులకు నష్టం జరగడంతో పాటు, వర్షంతో మరోపక్క గుండెలుఅదురుతున్నాయంటూ ఆందోళనకు దిగారు. ఆరుగాలం కష్టపడి అప్పు తెచ్చి పండించిన పంట అకాల వర్షంతో తడిసి ముద్దైతే కళ్ళల్లో నుండి నీరు కాదు రక్తపు నీరు వస్తుందని రైతులు తమ బాధను చెప్పుకున్నారు. ప్రభుత్వం వెంటనే మరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, లారీలను పంపించాలని రైతులు డిమాండ్ చేశారు. లేకుంటే రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏది ఏమైనా వర్షాలు పడుతుండడంతో వర్షాకాలం సీజన్ వ్యవసాయ పనులు ప్రారంభమవుతాయి కాబట్టి కొనుగోలు కేంద్రాల్లో ఉన్న వరి ధాన్యం వెంటనే లారీల్లో తరలించి రైతులకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకుంటే రైతులే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ధర్నా కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మంద నాగయ్య, సొసైటీ పాలకవర్గం సభ్యులు, చిన్న ఘనపూర్ గ్రామ రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ప్రజానాట్యమండలి రాష్ట్ర కమిటీలో జిల్లాకు గౌరవం..

రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా సాధనవేణి ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా ఏగ్గేటి రాజేశ్వరరావు

**మందమర్రి,మే27(సూర్యరేఖ)** హైదరాబాద్‌లోని బషీర్బాగ్ ప్రెస్ క్లబ్ వేదికగా ఈనెల 25,26 తేదీల్లో జరిగిన తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర మహాసభల్లో మంచిర్యాల జిల్లా కళాకారులకు విశిష్ట స్థానం దక్కింది.రాష్ట్ర మహాసభల సందర్భంగా సాధన వేణి ప్రభాకర్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా,ఏగ్గేటి రాజేశ్వరరావును రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా ఎన్నుకోవడం జిల్లాలోని సాంస్కృతిక వర్గాల్లో ఆనందాన్ని నింపింది. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి ప్రజల్లో చైతన్యం కల్పించే సాంస్కృతిక కార్యక్రమాల్లో వీరిద్దరూ చురుకైన పాత్ర పోషించారు.ముఖ్యంగా సింగరేణి ప్రాంతాల్లో రక్షణతో కూడిన ఉత్పత్తి,మద్యపాన వ్యసన నివారణ,కార్మికుల్లో విధి నిర్వహణపై అవగాహన పెంపొందించే అంశాలపై పాటలు, నాటికలు,సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా విశేష సేవలు అందించారు.ప్రజా సమస్యలను కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో వీరి కృషి గుర్తింపు పొందింది.వీరి ఎంపికపై సిపిఐ పట్టణ కమిటీ, ఏఐటీయూసీ ఏరియా బ్రాంచ్ కమిటీ నాయకులు, కార్యకర్తలు,సింగరేణి అధికారులు,కార్మికులు, పలువురు కళాకారులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా సాధన వేణి ప్రభాకర్,ఏగ్గేటి రాజేశ్వరరావులు మాట్లాడుతూ...ప్రజానాట్యమండలి ద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యం పెంపొందించే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. తమపై విశ్వాసం ఉంచి రాష్ట్ర కమిటీలో చోటు కల్పించిన తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్యమండలి ఇన్‌చార్జి కలవేణి శంకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రేగుంట చంద్రశేఖర్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు.



## పొన్నారం గ్రామంలో మహిళా భవన్ నిర్మాణానికి భూమిపూజ..



**మందమర్రి,మే27(సూర్యరేఖ)**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మహిళా భవన్ నిర్మాణ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా శ్రీకారం చుట్టిన నేపథ్యంలో,మందమర్రి మండలం పొన్నారం గ్రామంలో బుధవారం మహిళా భవన్ నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మహిళా సంఘ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జీవన్ కుమార్,ఎంపీడీవో రాజేశ్వర్ లతో కలిసి గ్రామ సర్పంచ్ పెంచాల మధు భూమిపూజ చేశారు. మహిళల అభివృద్ధి,స్వయం ఉపాధి అవకాశాల పెంపు,సమావేశాల నిర్వహణకు మహిళా భవన్ ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీవో ఎస్తార్ డేవిడ్, ఏపీఎం చంద్రశేఖర్,పంచాయతీరాజ్ ఏఈ ఇసాక్, టీఏ రాజలింగు,పంచాయతీ కార్యదర్శి హరీష్, మహిళా అధ్యక్షురాలు గోగు సుమలత,ఉపసర్పంచ్ పెంచాల అమృత,వార్డు సభ్యురాలు సుర్మిల పద్మ, కాంగ్రెస్ నాయకులు పెంచాల రాయలింగు,నీలం ఆనంద్, మాస్ సంతోష్,పూసాల సంతోష్,బేర సమ్మయ్య,ఈద లింగయ్యతో పాటు గ్రామ పెద్దలు పెంచాల ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాతలను అగం చేస్తున్న అకాల వర్షం..

ఒకవైపు లారీల కొరత..
మరోవైపు వర్షంతో బాధ..



**కొల్చారం,మే27(సూర్యరేఖ)** రైతన్నలు ఆరుగాలం కష్టపడి పండించిన పంట అమ్ముకోవడానికి అరిగోష పడుతున్నారు.ఒకవైపు రైతులను వెంటాడుతున్న అకాల వర్షం,మరోవైపు లారీల కొరత,మరోవైపు వర్షం బాధ,ఏ క్షణాన ఏం జరుగునో తెలియని పరిస్థితి రైతులకు తప్పని తిప్పలు.అన్నమొ రామచంద్రా అంటూ అన్నదాతలు హరిగోశ పడుతున్నారు.కొల్చారం మండలంలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి అన్నదాత పండించిన పంట తడిసి ముద్దయింది.కొనుగోలు కేంద్రంలో కాంట చేసిన సంచులు,రాసి కుప్పల చెట్టు నీళ్లు చేరడంతో రైతులకు ఎటు తోచని పరిస్థితి నెలకొంది.ఏం పాపం చేసాం దేవుడా పంట పండించడమే పాపమా అంటూ రైతులు వారి బాధను వెళ్ళబోసుకున్నారు.అధికారులకు వస్తున్నారు పోతున్నారు,ఏం సారు లారీలు ఎప్పుడు వస్తాయంటే రేపు తప్పకుండా పంపిస్తామని చెప్పి వారి సమయాన్ని వృధా చేయకుండా అలా వెళ్ళిపోతున్నారని రైతులు వాపోతున్నారు. మండలంలోని రాత్రి కురిసిన వర్షానికి కొల్చారం, రంగంపేట,సంగాయిపేట,తుక్కాపూర్,కోనాపూర్,వై ందాపూర్, వరిగు ంతం, చిన్నగనాపూర్,గ్రామాలలో వరి ధాన్యం తడిసి ముద్దయింది. ఇప్పటికైనా జిల్లా పోరా సరఫరాలశాఖ అధికారులు,రైస్ మిల్లర్లు, ట్రాన్స్పోర్ట్ యజమానులు,సంబంధిత అధికారులు వెంటనే స్పందించి అకాల వర్షానికి తడిసిన వరి ధాన్యాన్ని మిల్లర్లకు తరలించాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు.

## స్త్రీనిధి రుణాలచెక్కుల పంపిణీ..




**కామారెడ్డి,మే27(సూర్యరేఖ)** కామారెడ్డి నియోజకవర్గం మాచారెడ్డి మండల కేంద్రంలో బుధవారం మండల సమాఖ్య ప్రత్యేక జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. లోన్ మేళా జీవనోపాధి యూనిట్ల స్థాపన బ్యాంకు లింకేజీ స్త్రీనిధి రుణాల చెక్కు పంపిణీ రూ.10 కోట్ల అతిపేద కుటుంబాలకు జీవనోపాధి ఆస్తుల పంపిణీ.మరియు ఉత్తమ విఓఏలకు సన్మానించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా మాచారెడ్డి సర్పంచ్ పి.సంతోష్ రెడ్డి హాజరై మాట్లాడారు.తెలంగాణ ప్రభుత్వం నిరంతరం ప్రజల కోసం పనిచేస్తుందని ఆయన అన్నారు.ఈ సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు నాగలక్ష్మి,కార్యదర్శి పద్మ,ఏపిఎం పి.రవీందర్, శ్రీనిధి ఆర్ఎం కిరణ్,గ్రామ సంఘం అధ్యక్షురాలు, కార్యదర్శులు సన్మానం చేయడం జరిగింది.

# స్టెరాయిడ్ వాడకాల పట్ల జాగ్రత్తగా ఉండాలి..

అధిక స్టెరాయిడ్ వల్ల అనారోగ్యానికి ముప్పు వాటిల్లుతుంది..
మెడినోవా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు

**మేడ్చల్,మే27(సూర్యరేఖ)** హైదరాబాదుకు చెందిన 44ఏళ్ల ఉమేష్ సింగ్ గత కొన్ని సంవత్సరాలుగా నడవడం,కూర్చోవడం, సాధారణ పనులు చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.రోగికి తీవ్రమైన నడుము,తుంటి భాగానికి చెందిన జాయింట్ల నొప్పులు తీవ్రమైనట్లు కుటుంభ సభ్యులు తెలిపారు.ఈ నేపథ్యంలో సదరు రోగిని కుటుంభ సభ్యులు మేడ్చల్ పట్టణంలోని మెడిసిటి గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ కు చెందిన మెడినోవా సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ లోని వైద్యులను సంప్రదించారు.రోగిన పరిశీలించిన ఆర్థోపెడిక్,జాయింట్ రీప్లేస్ మెంట్ వైద్య నిపుణులు డా.కార్తిక్ పలు వైద్య పరీక్షలు నిర్వహించి స్కానింగ్ లో తుంటి భాగానికి చెందిన రెండు హిప్ జాయింట్లలలో అవాస్కులర్ నెక్రోసిస్ అనగా రక్త ప్రసరణ తగ్గి ఎముక దెబ్బతినడం జరిగినట్లు నిర్ధారించారు.అనంతరం తుంటి భాగంలో దెబ్బ తిన్న రెండు హిప్ జాయింట్లలో పూర్తిగా దెబ్బ తిన్న ఎడమ హిప్ జాయింట్ భాగాన్ని తొలగించి ప్రత్యేకమైన ఇంప్లాంట్ ను వైద్య నిపుణులు అమర్చారు.ఇలా ఎడమ హిప్ టోటల్ రీప్లేస్మెంట్ శస్త్రచికిత్సను అత్యాధునిక పద్ధతిలో నిర్వహించడంతో విజయవంతమైందని,ఆపరేషన్ అనంతరం రోగికి ఐసీయూ పర్యవేక్షణ,నొప్పి నియంత్రణ చికిత్స,ఫిజియోథెరపీ,ప్రత్యేక పోషకాహార సంరక్షణ అందించారు. వైద్యుల పర్యవేక్షణలో రోగి ఆరోగ్యం రోజురోజుకూ మెరుగుపడగా, తిరిగి నడిచే స్థితికి చేరుకొని సాధారణ జీవనాన్ని కొనసాగిస్తున్నారని తెలిపారు. స్టెరాయిడ్స్ వినియోగాన్ని తగిన జాగ్రత్తలతో అవసరమైన మోతాదులో మాత్రమే వాడాలని వైద్యులు సూచించారు. ఇలాంటి ఇబ్బందులు ఏర్పడినపుడు తగిన రీతిలో మంచి వైద్య నిపుణులను సంప్రదించి సరైన వ్యాధి నిర్ధారణ పద్దతులను ఉపయోగిస్తే ఖచ్చితమైన



ఫలితాలు వస్తాయని అన్నారు.గత రెండు మూడు సంవత్సరాలుగా పడుతున్న ఇబ్బందులకు మంచి చికిత్స అందించడం ద్వారా నయం చేసిన మెడినోవా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులకు రోగివారి కుటుంభ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

# విద్యార్థుల విజయాలే ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్టకు నిదర్శనం..



మంత్రి వివేక్ వెంకటస్వామి

**మందమర్రి,మే27(సూర్యరేఖ)** విద్యార్థుల విజయాలే ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్టకు నిదర్శనమని రాష్ట్ర కార్మిక,మైనింగ్,ఉపాధిశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు.మందమర్రి మండలం అందుగులపేటలోని శ్రీకన్వెన్షన్ హాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినీ,విద్యార్థులను అభినందిస్తూ బుధవారం ప్రత్యేక సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్యఅతిథిగా హాజరై మెరిట్ సాధించిన విద్యార్థులను శాలువాలతో సత్కరించి ప్రశంసించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటుతూ టాపర్స్గా నిలవడం ఆనందదాయకమన్నారు. విద్యా రంగ బలోపేతానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని,అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో 50వేల టీచర్ పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ను రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేస్తూ ప్రభుత్వ



విద్యను మరింత నాణ్యంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు.చెన్నూరు నియోజకవర్గంలోని పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి మౌలిక వసతులను మెరుగుపరుస్తున్నామని మంత్రి వెల్లడించారు.విశాఖ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళల కోసం టాయిలెట్లు నిర్మించడంతో పాటు పాఠశాలల్లో టీచర్ల నియామకం,బెంచీలు,బోర్వెల్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.చెన్నూరులో నిర్మిస్తున్న ఏటీసీ సెంటర్లో చదివే విద్యార్థులకు నెలకు రూ.2 వేల స్కాలర్షిప్ అందించనున్నట్లు ప్రకటించారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో రోడ్లు,డ్రైనేజీల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చామని,ఇకపై విద్య,వైద్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథరెడ్డి,డీఈఓ యాదయ్య,ఎంఈఓ రమేష్ రాథోడ్,తహసీల్దార్ పనకంటి సతీష్ కుమార్ శర్మ,మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు,ఉపాధ్యాయులు ,ప్రజా ప్రతినిధులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ అంశాన్ని రాజకీయ కోణంలో చూడటం తగదు..

మాజీ ఎమ్మెల్యే ఎన్.వి.ఎస్.ఎస్.ప్రభాకర్





**ఉప్పల్,మే27(సూర్యరేఖ)** ఎస్ఐఆర్ ఉప్పల్ నియోజకవర్గ చిలుకానగర్ డివిజన్ లో బీజేపీ బిఎల్ ఏ-1పోతగాని గోపాల్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ శాసనసభ్యులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రజలకు సంబంధించిన కీలకమైన ఎస్.ఐ.ఆర్ అంశంపై కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీలు అనవసరంగా రాజకీయం చేస్తున్నాయని తీవ్రంగా మండిపడ్డారు.చనిపోయిన వారి ఓట్లు తొలగించడం తప్పా,ఒక్కరికి మూడు చోట్ల నాలుచోట్ల ఓట్లు ఉంటే తొలగించడం తప్పా,అని ప్రభాకర్ అన్నారు.?రాజకీయ కోణం కరెక్ట్ కాదు ప్రజాప్రయోజనాలతో ముడిపడి ఉన్న ఎస్ఐఆర్ అంశాన్ని కేవలం రాజకీయ కోణంలో చూడటం ఎంతవరకు సమంజసం కాదని ఆయన వెల్లడించారు.ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం ఆయా పార్టీల సంకుచిత స్వభావానికి నిదర్శనమన్నారు.కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీలు తమ రాజకీయ ఉనికి కోసమే ఈ అంశాన్ని వాడుకుంటున్నాయని,ఇది ఏమాత్రం కరెక్ట్ కాదని హితవుపలికారు.ఇటువంటి చౌకబారు రాజకీయాలను పక్కనబెట్టి,సమస్యల పరిష్కారానికి నిజాయితీగా కృషి చేయాలని,ప్రజల ప్రయోజనాలే పరమావధిగా అందరూ ముందుకు సాగాలని ఆయన స్పష్టం చేశారు.ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గొరిగే కృష్ణ,రాష్ట్ర కౌన్సిల్ నెంబర్ సతీష్ కుమార్,డివిజన్ అధ్యక్షుడు దత్త సాయి,సీనియర్ నాయకులు బాలచందర్,గోనే అంజయ్య,గోనె శ్రీకాంత్,భరత్ రెడ్డి,బిఎల్ ఏ-2,లు ముఖ్యనాయకులు,కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## తల్లి లాంటి సింగరేణిని తగలబెట్టాలనుకోవడం దారుణం..

సింగరేణిని కాపాడేందుకు కార్మికలోకం సిద్ధం..
ఐఎన్టీయూసీ నాయకులు

**మందమర్రి,మే27(సూర్యరేఖ)** తెలంగాణకు కొంగుబంగారంగా నిలిచిన సింగరేణి సంస్థపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం తీవ్ర దిగ్భ్రాంతికరమని ఐఎన్టీయూసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆరు జిల్లాల్లో విస్తరించి వేలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్న సింగరేణి సంస్థను తగలబెట్టాలని పిలుపునివ్వడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో వారు మాట్లాడుతూ... సుమారు 40వేల మంది శాశ్వత ఉద్యోగులు,30వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు ఉపాధి కల్పిస్తున్న సింగరేణి సంస్థను స్వార్థ రాజకీయాల కోసం వివాదాల్లోకి లాగడం సరైంది కాదన్నారు.గతంలో ప్రజాప్రతినిధులుగా పనిచేసిన నాయకులు సైతం ఇటువంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం సమాజానికి ప్రమాదకర సంకేతమని విమర్శించారు. రైతు ఉద్యమాలకు ప్రజల మద్దతు రాకపోవడంతో సింగరేణి సంస్థను తగలబెట్టాలని,రైలు పట్టాలు ధ్వంసం చేయాలని పిలుపునివ్వడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలని ప్రశ్నించారు.ఈ వ్యాఖ్యలు చేసిన సమయంలో అక్కడే ఉన్న టీబీజీకేఎస్ నాయకులు అడ్డుకోకపోవడం మరింత బాధాకరమన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు బీఆర్ఎస్ నాయకుల ఉగ్ర ఆలోచనలకు నిదర్శనమని ఆరోపించారు.కార్మికుల గుండెల్లో సింగరేణికి ప్రత్యేక స్థానం ఉందని, దానిని దెబ్బతీయాలనే కుట్రలను కార్మికలోకం తిప్పికొడుతుందని పేర్కొన్నారు.మరోవైపు ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్,రాష్ట్ర కనీస వేతనాల సలహామండలి చైర్మన్ డాక్టర్ బి.జనక్ ప్రసాద్ నేతృత్వంలో సింగరేణి అభివృద్ధి,కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వంతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు.మెడికల్ బోర్డు పునరుద్ధరణ,పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాల భర్తీ,పేరు మార్పులు,పెర్క్స్పై ఇన్కమ్ ట్యాక్స్ మినహాయింపు,కార్మికుల సొంతింటి కల సాకారం వంటి అంశాలపై ప్రభుత్వం సహకారంతో చర్యలు తీసుకుంటున్న సమయంలో కొందరు నాయకులు సింగరేణి సంస్థను దెబ్బతీయాలనే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమన్నారు.ఐఎన్టీయూసీ ఎల్లప్పుడూ కార్మికులకు అండగా నిలుస్తుందని,సింగరేణి సంస్థ పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు.

## సీఎం సహాయ నిధి చెక్కు అందజేత



**మేడ్చల్,మే27(సూర్యరేఖ)** మేడ్చల్ పట్టణానికి చెందిన వాకిటి సాయికుమార్ కు సీఎం సహాయ నిధి చెక్కును బుధవారం స్థానిక ఎమ్మెల్యే,మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి చేతుల మీదుగా వాకిటి సాయికుమార్ కి రూ.60 వేల సీఎం సహాయ నిధి చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ...ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద,మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు.అనంతరం చెక్కు అందుకున్న వాకిటి సాయికుమార్ కుటుంబ సభ్యులు సీఎం సహాయ నిధి మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి,అలాగే ఎమ్మెల్యే మల్లారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ భాస్కర్ యాదవ్,మాజీ కో-ఆప్షన్ సభ్యులు అకిటి నవీన్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## ఏళ్ల నుంచి సేవ చేస్తే ఈ విధంగా అవమానించడం ఆవేదన కలిగిస్తుంది..

ఉప్పల్ రెడ్డి-కాపు స్మశాన వాటిక మాజీ అధ్యక్షులు దుబ్బ నరసింహారెడ్డి



**ఉప్పల్,మే27(సూర్యరేఖ)** ఉప్పల్ రెడ్డి-కాపు స్మశాన వాటిక గత పాలకమండలి సంరక్షణ కమిటీ శిలాఫలకం(రిజిస్టర్ నంబర్ 383/2021) తొలగించడంపై మాజీ అధ్యక్షులు, ఉప్పల్ గ్రామ పెద్దలు దుబ్బ నరసింహారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...మేము అధ్యక్ష కార్యదర్శులుగా దుబ్బ నరసింహారెడ్డి,మేకల మోహన్ రెడ్డి తదుపరి మేకల మధుసూదన్ రెడ్డి, సభ్యులు నిస్వార్థంగా సేవ చేసి స్మశాన వాటికను అభివృద్ధి చేస్తే సంస్కారులు ఇలాంటి అన్యాయమైన చర్యలు చేయడం మంచి పద్ధతి కాదని,దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా ఇటీవల నూతనంగా ఏర్పడిన పాలకమండలి అధ్యక్షులు మేకల హనుమంత రెడ్డి అదేవిధంగా సభ్యులు యధావిధిగా శిలాఫలకం ఏర్పాటు చేసి మీ గౌరవాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కమిటీలు మారడం సహజమని,పాత కమిటీ శిలాఫలకాన్ని తొలగించడం దేనికి సంకేతం అని ఆయన ప్రశ్నించారు.కొత్త కమిటీలు ఏర్పడినప్పుడు పాత కమిటీలతో కలిసి పనిచేసి అభివృద్ధికి పాటుపడాలే కానీ విద్వేషాలకు తావివ్వకూడదని ఆయన హితవుపలికారు.మీ పాలకమండలి సమయం అయిపోయాక మీరు ఏర్పాటు చేసే శిలాఫలకాలను కొత్త కమిటీ వాళ్లు తొలగిస్తే మీకు సమ్మతమేనా ఆయన ప్రశ్నించారు.

# రామంతపూర్ పెద్ద చెరువు అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.19 కోట్లతో అభివృద్ధి పనులు..







రూ.16 కోట్లతో వేగంగా సాగుతున్న ఎస్ఎన్డిపి పనులు..

ఈ నిధులతో వాకింగ్ ట్రాక్,చిల్డ్రన్ ప్లే ఏరియా, ఓపెన్ జిమ్,గ్రీనరీ,లైటింగ్ ఏర్పాటు..

పెద్ద చెరువును పరిశీలించిన మందుముల పరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్,మే27(సూర్యరేఖ)** ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి బుధవారం హైడ్రా అధికారులతో కలిసి రామంతాపూర్ పెద్ద చెరువును పరిశీలించారు .స్థానికంగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్న నిరుపేదలకు,కాలనీ వాసులకి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చెరువు సుందరీకరణ చేపడుతామని భరోసానిచ్చారు. చెరువు చుట్టు పక్కల నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కూల్చబోమని,గుడిసెల్లో నివస ి స్తున్న వారికి డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. పెద్ద చెరువును మినీ ట్యాంక్ బండ్ గా మారుస్తాం.. మందుముల పరమేశ్వర్ రెడ్డి సీఎం నియోజకవర్గంలోని చెరువులను రూ.150 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని ఉప్పల్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.రామంతాపూర్ పెద్ద చెరువు చుట్టు పక్కల మెత్తం18.23 ఎకరాల ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం కోసం ప్రభుత్వం రూ.19 కోట్లు కేటాయించినట్లు చెప్పారు.ఈ నిధుల ద్వారా వాకింగ్ ట్రాక్,లైటింగ్, గ్రీనరీతో పెద్ద చెరువును మినీ ట్యాంక్ బండ్గా మారుస్తాం..గత బీఆర్ఎస్ పాలనలో హబ్సిగూడ ప్రాంతంలోని సెంట్ జోసెఫ్ స్కూల్,రవీంద్రనగర్ కాలనీ,సాయిచిత్రనగర్,మహేశ్వరినగర్ తదితర ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి.ఈ కాలనీలలో ప్రజలు,నాటి ప్రజాప్రతినిధులు పడవలు వేసుకొని తిరిగారు.కానీ,ఈ సమస్య పరిష్కారం కోసం ఎలాంటి ప్రయత్నం చేయలేదు.కానీ,సీఎం రేవంత్ రెడ్డి ఈ సమస్య పరిష్కారం కోసం ఉస్మానియా యూనివర్సిటీ నుంచి వచ్చే వరద తరలించేందుకు రూ.16 కోట్ల నిధులతో ఎస్ఎన్డిపి పనులను చేపట్టారు.పనులు వేగంగా సాగుతున్నాయి.ఇక కాలనీలు మునిగే పరిస్థితి రాదు"అని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు..కంది శ్రవణ్ కుమార్ రెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు,హబ్సీగూడ కాంగ్రెస్ సీనియర్ నాయకులు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..పెద్ద చెరువు అభివృద్ధి కోసం రూ.19 కోట్లు కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డి,అందుకు కృషి చేసిన ఉప్పల్ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, లకు హబ్సీగూడ డివిజన్ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోవడం సంతోషంగా ఉంది.. కంది ఆగిరెడ్డి మాజీ ఫ్లోర్ లీడర్ కంది ఆగిరెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈప్రాంతం అభివృద్ధికి నోచుకోవడం సంతోషంగా ఉందన్నారు.కాగా,తమ నిర్మాణాలు తొలగించబోమని హైడ్రా అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వడంతో మహేశ్వరీనగర్,సాయి చిత్రనగర్,రవీంద్రనగర్ కాలనీ వాసులు.. అరవింద్ రెడ్డి,బాల్ రెడ్డి,కొండల్ రెడ్డి,దామోదర్ రెడ్డి,మల్లారెడ్డి, శ్రీధర్ రెడ్డి,అజిత్ రెడ్డి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ కంది ఆగిరెడ్డి,డీసీసీ ఉపాధ్యక్షులు బొప్పనపల్లి సుధాకర్ రెడ్డి,హబ్సీగూడ డివిజన్ ప్రెసిడెంట్ గన్నారం విజయ్ కుమార్,జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు గణేష్ నాయక్, చింతల బాబురావు,లక్ష్మా రెడ్డి,కిషన్ నాయక్,రాజు నాయక్,మురళీ ముదిరాజ్,గుండు రాజన్న,మాలు నాయక్,ధర్మ రాజు,లక్ష్మీ నారాయణ ,వాసునాయక్, సుమన్ నాయక్, షబ్బీర్, రామంతాపూర్ డివిజన్ డిసిసి ప్రధాన కార్యదర్శి జలీల్ పాషా,రామంతపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వల్లపు శ్రీకాంత్ యాదవ్,ఉపేందర్ రెడ్డి,రాజీరెడ్డి,గరిక సుధాకర్, పూస స్తన్న,భాస్కర్ గంగ పుత్ర,బాలయ్య బాబు, బుక్కా సురేష్,కార్పే శంకర్,కార్పే పవన్,ముత్యాల బాబు, ముత్యాల జంగయ్య,షాగా శ్రీధర్, సందీప్ ,భాస్కర్, సతీష్ గౌడ్,కృష్ణ,సీమ కండ్ల జంగయ్య, బుల్లెట్ అశోక్,మిట్టు గౌడ్,సతిరెడ్డి, అలీమ్, రాములు, సుధాకర్,దేవిడ్,కాశమల్ల శంకర్, జి.స్వామి,కె.స్వామి,గౌతమ్,రామకృష్ణ, విజయ్ ,చోటా, రాజు,సలీమ్,అంబిక,రవి సీనియర్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ,హైడ్రాఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ సభ్యత్వ నమోదుపై బీఆర్ఎస్ యువ నాయకులకు దిశానిర్దేశం..





**మందమర్రి,మే27(సూర్యరేఖ)** బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని డిజిటల్ విధానంలో విజయవంతం చేయడానికి మందమర్రిలో పార్టీ యువ నాయకులతో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించారు.స్థానిక టీబీజీకేఎస్ యూనియన్ కార్యాలయంలో బుధవారం జరిగిన ఈ సమావేశానికి బీఆర్ఎస్ పార్టీ పట్టణ మాజీ అధ్యక్షులు జె.రవీందర్ హాజరై కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు.చెన్నూరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్,మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సూచనల మేరకు నిర్వహించిన ఈ సమావేశంలో డిజిటల్ సభ్యత్వ నమోదు ప్రక్రియ,కార్యాచరణ,బూత్ స్థాయి బాధ్యతలు తదితర అంశాలపై చర్చించారు.పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సమిష్టిగా పనిచేయాలని సూచించారు.ప్రతి కార్యకర్త పార్టీ సభ్యత్వ నమోదును ప్రజల్లోకి తీసుకెళ్లాలని, యువత చురుకుగా ముందుకు రావాలని జె. రవీందర్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ బిఆర్ఎస్ యువ నాయకులు తోట సురేందర్, ముస్తఫా,సీపెల్లి సాగర్,దాసరి నవీన్,అందే శ్రీకాంత్, అఖిలేష్ పాండే,ఖదీర్,మాసు వెంకటేష్,బెల్లం అరుణ్, కంది తిరుపతి,అల్లంల ప్రవీణ్,రామ్ శేఖర్, రామ్ సురేష్,ప్రశాంత్,మంతెన సుమన్,ముల్కల రమేష్,కంపెల్లి సుధాకర్,శనివారపు అరుణ్, రామునూరి రాజేష్,కుమార్, ఇమ్రోజ్,మొగురం రాకేశ్,పడల మధు,రామ్ వేణు,మనోజ్,రంజిత్, సాగే శ్రీనివాస్,తోట సన్నీ,సర్త బన్నీ,తోట వేణు, ఆంజనేయ ప్రసాద్,బైరనేని శంకర్,వాసాల శేఖర్, యశ్వంత్,సునీల్, రవియాదవ్,వంశీ,సన్ను,కుమార్, సత్యనారాయణ,శ్యామల రాజశేఖర్, కొత్తపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చెట్ల కొమ్మల తొలగింపు..



**నిజాంపేట,మే27(సూర్యరేఖ)**మండల కేంద్రంలో గత రాత్రి కురిసిన భారీ వర్షానికి విద్యుత్ అంతరాయం ఏర్పడింది.ఈ నేపథ్యంలో 33/11కేవీ లైన్లకు చెట్ల కొమ్మలు తగలడంతో సమస్య తలెత్తిందని విద్యుత్ శాఖ లైన్మెన్ బైరం రమేశ్ తెలిపారు.వెంటనే చెట్ల కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరాను యథావిధిగా పునరుద్ధరించినట్లు చెప్పారు.ఎక్కడైనా వైర్లు తెగిపడితే వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ మునిరాజు,రాజు ,మధు,రఘు, తదితరులు ఉన్నారు.

## కల్వకుంటకు సొసైటీ చైర్మన్ ఎవరు.?




**నిజాంపేట,మే27(సూర్యరేఖ)** మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో సొసైటీ చైర్మన్గా అందెకొండల్ రెడ్డి ఇటీవల సర్పంచ్గా ఎన్నికైన నేపథ్యంలో చైర్మన్ పదవికి రాజీనామా చేశారు.ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం పాత సొసైటీ పాలకవర్గానికి బాధ్యతలు అప్పగించి 15రోజులు గడిచినప్పటికీ ఇప్పటివరకు సొసైటీ చైర్మన్,వైస్ చైర్మన్ బాధ్యతలను ఎవరికి అప్పగిస్తారో స్పష్టత లేకపోవడంతో పాలకవర్గ సభ్యులు చర్చించుకుంటున్నారు.అలాగే ఇన్చార్జి సీఈవో నూతన పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని గ్రామ రైతులు కోరుతున్నారు.

## దేహదానం ద్వారా మానవత్వాన్ని చాటిన భారతి

మంత్రి జి. వివేక్ వెంకటస్వామి



**మందమర్రి,మే27(సూర్యరేఖ)** మరణించిన తర్వాత కూడా సమాజానికి సేవ చేయాలనే ఆలోచనతో తన కళ్లతో పాటు పార్థివ దేహాన్ని దానం చేసిన చెర్లపల్లి భారతి సేవా భావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని రాష్ట్ర కార్మిక,ఉపాధిశాఖ మంత్రి జి.వివేక్ వెంకటస్వామి అన్నారు.ఈ నెల 21న అనారోగ్యంతో కన్నుమూసిన భారతి కుటుంబ సభ్యులను మంత్రి బుధవారం మందమర్రి అంగడి బజార్లోని వారి నివాసంలో పరామర్శించారు. భారతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన మంత్రి,ఆమె తీసుకున్న నిర్ణయం సమాజానికి గొప్ప సందేశమని పేర్కొన్నారు.కంటి దానం ద్వారా ఇద్దరికి చూపునిస్తూనే,దేహదానం ద్వారా వైద్య విద్యార్థుల విద్యాభ్యాసానికి తోడ్పడటం నిజమైన మానవతా సేవ అని కొనియాడారు.భారతి చివరి కోరిక మేరకు ఆమె భౌతిక కాయాన్ని కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాలకు అందజేసిన కుటుంబ సభ్యుల నిర్ణయాన్ని మంత్రి అభినందించారు.ఇలాంటి దానాలు సమాజంలో అవగాహన పెంచడమే కాకుండా మరెందరికో ప్రేరణగా నిలుస్తాయని తెలిపారు.ఈ సందర్భంగా భారతి కుమారులు కుమార్,శ్రీధర్,కుమార్తెలు విజయలక్ష్మి,అరుణ మంత్రికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పల్లె రఘునాథ్,సొత్కు సుదర్శన్,తుంగపిండి రాజేష్,తదితరులు ఉన్నారు

## దాడికి పాల్పడ్డ వ్యక్తికి రిమాండ్..




**నిజాంపేట,మే27(సూర్యరేఖ)** మండల కేంద్రంలో గత వారం రోజుల క్రితం గ్రామానికి పంజా కరుణాకర్,ను అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు అతనిపై దాడి చేయగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వ్యక్తి స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ఇట్టి విషయంపై ఎస్ఐ రాజేష్ విచారణ చేపట్టి దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్ కు తరలించారు.ఎవరైనా చట్ట వ్యతిరేకత కార్యకలాపాలకు పాటుపడితే ఎంతటి వారైనా సరే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజేష్ హెచ్చరించారు.

## సారంగపల్లిలో మహిళా భవన్ నిర్మాణానికి భూమిపూజ..



**మందమర్రి,మే27(సూర్యరేఖ)** మహిళల సాధికారతకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తూ చేపడుతున్న మహిళా భవన్ నిర్మాణ కార్యక్రమంలో భాగంగా మందమర్రి మండలం సారంగపల్లి గ్రామంలో బుధవారం భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు స్వంత భవనాలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే.ఈ సందర్భంగా సారంగపల్లి గ్రామపంచాయతీ పరిధిలో మహిళా సంఘాలకు కేటాయించిన మహిళా భవన్ నిర్మాణ పనులకు మండల ఎంపీడీఓ ఎన్.రాజేశ్వర్,గ్రామ సర్పంచ్ బచ్చలి రాములు చేతుల మీదుగా శంకుస్థాపన నిర్వహించారు.మహిళల అభివృద్ధి,స్వయం ఉపాధి అవకాశాల పెంపు దిశగా మహిళా భవనాలు కీలకంగా మారనున్నాయని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కడారి జీవన్,గ్రామపంచాయతీ కార్యదర్శి సవ్య, ఉపసర్పంచ్ ఎంబడి సతీష్,వార్డు సభ్యులు కాసర్ల సురేష్,మంద సువర్ణ,కాంగ్రెస్ నాయకులు కమల మనోహర్ రావు,మోకీద్,లింగయ్య,రామగిరి కుమారస్వామి, మహిళలు,గ్రామస్థులు పాల్గొన్నారు

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23, Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713

# నాలల విస్తరణ పనులువేగవంతం..





రూ.79.58 కోట్లతో అంచనా వ్యయం..

వరద ముంపు సమస్య నుండి శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు..

నాలల విస్తరణ పనులతో లోతట్టు,ముంపు ప్రాంతాలకు ఉపశమనం..

త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి...

పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

**శేరిలింగంపల్లి,మే27(సూర్యరేఖ)** శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్ కాలనీలో జరుతున్న పటేల్ చెరువు అలుగు నుండి గంగారం చెరువు వరకు నాల విస్తరణ పనులలో భాగంగా రూ.18.92 కోట్లతో నిర్మిస్తున్న రసీసీ బాక్స్ డ్రైన్ నిర్మాణం పనులను,రసీసీ బెడ్,సైడ్ వాల్స్ నిర్మాణం మరియు నాల విస్తరణ నిర్మాణం పనులను పీఏసీ చైర్మన్,ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పరిశీలించారు.ఈ సందర్భంగా అరికపూడి గాంధీ మాట్లాడుతూ... ఎస్ఎన్డిపి ఫేస్ 2లో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రూ.79.58 కోట్లతో అంచనా వ్యయంతో నాలల విస్తరణ పనులు చేపట్టడంతో ఎన్నో ఏండ్ల వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని,దానిలో భాగంగా రూ.18.92 కోట్లతో పటేల్ చెరువు అలుగు నుండి గంగారం చెరువు వరకు నూతనంగా చేపట్టబోయే నాల విస్తరణ పనులను వేగంగా చేయాలని,పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.ఎన్నో ఏండ్ల సమస్య నేటితో తిరనుంది అని,నాలా విస్తరణ పనులకు అందరూ సహకరించాలని,ఒక్కప్పుడు వరదలు వస్తే కంటి మీద కునుకు లేకుండా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు.కానీ నేడు సమస్య లేకుండా మళ్ళీ పునరావృతం కాకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు.నాలల విస్తరణ పనులతో లోతట్టు, ముంపు ప్రాంతాలకు ఉపశమనం లభించిందని,ప్రజా అవసరాల దృష్ట్యా ప్రథమ ప్రధాన్యత విస్తరణ పనులు చేపట్టి యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులకు ఎమ్మెల్యే అరికపూడి గాంధీ ఆదేశించారు.ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పనులు చేపట్టాలని,ప్రధాన రహదారులపై పనులు జరుగుతున్న సమయంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సూచించాలని తెలిపారు.నాలల నిర్మాణం సమయంలో నీటి ప్రవాహం సాఫీగా సాగేలా లెవల్స్ ను నిర్ధారించుకొని పనులు చేపట్టాలని, వర్షాకాలంలోపు పనులు పూర్తయ్యేలా చూడలని, వరద ముంపు మళ్ళీ పునరావృతం కాకుండా నాలల విస్తరణ నిర్మాణం పనులు వేగవంతంగా చేపట్టాలని గాంధీ స్పష్టం చేశారు.నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని,పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని,నాల విస్తరణ పనులుపై అధికారులకు పలు సలహాలు,సూచనలు చేశారు.నాలల విస్తరణపై ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తప్పకుండా పరిష్కరిస్తామని,తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలో ఉంటాయని,ఏ చిన్న సమస్య ఎదురైన తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కరిస్తామని గాంధీ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎన్డిపి ఇంజనీరింగ్ విభాగం అధికారులు డిఈ ధీరజ్,చందానగర్ తాజా మాజీ కార్పొరేటర్ మంజుల రఘునాథ్ రెడ్డి,నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్,కాలనీ వాసులు,తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు..

రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణ మంత్రి గడ్డం వివేకానంద




**మంచిర్యాల,మే27(సూర్యరేఖ)** ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టిందని రాష్ట్ర కార్మిక,ఉపాధి శిక్షణశాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు.బుధవారం జిల్లాలోని జైపూర్ మండలం టేకుమట్ల గ్రామంలో గల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,జైపూర్ ఎసిపి వెంకటేశ్వర్లు,మండల తహసీల్దార్ వనజరెడ్డి,అధికారులతో కలిసి సందర్శించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ...ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా అనేక కార్యక్రమాలు చేపడుతుందని,ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలలో నగదు జమ చేయడం జరుగుతుందని తెలిపారు.ప్రతి సంవత్సరం ఎకరానికి 25క్వింటాళ్ల ధాన్యం వచ్చేదని, ఈసారి28 నుండి 32క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని తెలిపారు.జూన్ 6వ తేదీ వరకు ప్రతి సంవత్సరం కొనుగోలు లక్ష్యం పూర్తి అయ్యేదని,ఈ సంవత్సరం 4వ తేదీ వరకు 1లక్ష 70వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు.రైతుల సంక్షేమంలో భాగంగా పెద్దపల్లిలో 2 గోదాములు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని,పశ్చిమ బెంగాల్ లో జరిగిన ఎన్నికల నేపథ్యంలో హమాలీల కొరత ఏర్పడినందున స్థానికంగా హమాలీలను తీసుకొని ధాన్యం ఎగుమతి,దిగుమతులను వేగవంతం చేయడం జరిగిందని తెలిపారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...51వేల మెట్రిక్ టన్నుల దాన్యం కొనుగోలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 36వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని, పెద్దపల్లి,కరీంనగర్ లలో హమాలీలతో కలిపి 2 గోదాములను ఇచ్చారని,అకాల వర్షాల నేపథ్యంలో రైతులకు నష్టం కలగకుండా ధాన్యం నిల్వ చేయడం జరుగుతుందని తెలిపారు.జిల్లాలోని జైపూర్ మండలంలో గల సుముఖ గోదాములో 35వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే అవకాశం ఉందని, 50మంది హమాలీలు పనిచేస్తున్నారని,రైస్ మిల్లులు,గోదాముల వద్ద ధాన్యం ప్రక్రియ వేగంగా జరిగేలా కృషి చేస్తున్నామని తెలిపారు.ఇప్పటి వరకు 62 శాతం ట్యాబ్ ఎంట్రీ జరిగిందని,సంబంధిత రైతుల ఖాతాలలో 48గంటలలో నగదు జమ చేయడం జరుగుతుందని,3 రోజులలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.మొక్కజొన్న పంట కొనుగోలు లక్ష్యం 8వేల700మెట్రిక్ టన్నులు కాగా ఇంకా 3 వేల మెట్రిక్ టన్నుల పంట కొనుగోలు చేయవలసి తెలిపారు.అంతకుముందు జిల్లా కలెక్టర్,మండల తహసిల్దార్ తో కలిసి జైపూర్ మండలం టేకుమట్ల లోని కొనుగోలు కేంద్రం,బాలాజీ గోదాము,షెట్ పల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రం, ఇందారంలోని వరలక్ష్మి రైస్ మిల్,సుముఖ గోదాములను సందర్శించి ధాన్యం కొనుగోలు,నిల్వ, రవాణా ప్రక్రియలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## చిలుకానగర్ ప్రభుత్వ పాఠశాల సందర్శించి వసతులను పరిశీలించిన

చిలుకానగర్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్

సమస్యలను పరమేశ్వరుడు రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా..

ములకలపల్లి రాజేష్ ముదిరాజ్



**ఉప్పల్,మే27(సూర్యరేఖ)** ముఖ్యమంత్రి ఒంరేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వంలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు బలోపేతమవుతున్నాయని, విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో నాణ్యమైన విద్య అందుతుందని చిలుకానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ అన్నారు.ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాలతో డివిజన్ ఇన్చార్జి ఆగం రెడ్డితో కలిసి డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా రాజేష్ ముదిరాజ్ మాట్లాడుతూ...పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుల కృషితో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని,దీంతో విద్యార్థులు కార్పొరేట్ స్థాయిలో పోటీపడి రాణిస్తున్నారని అన్నారు. అనంతరం పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు వచ్చేలా విద్యార్థులను తీర్చిదిద్దిన ప్రధానోపాధ్యాయుడిని అభినందించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జ్ అకిటి ఆగంరెడ్డి అమరేశ్వరి,నల్లవెల్లి మహేందర్ ముదిరాజ్ , గండికోట గణేష్,దుండగుల శంకర్,పస్తం, శ్రీరాములు,అమర్,పల్లాటి డేవిడ్,రాంచర్ల బలరాం,పల్నాటి కిష్టయ్య,మారపాక నాగయ్య, సత్యం,జగదీష్,శివ తదితరులు పాల్గొన్నారు.

## తల్లి మృతిని తట్టుకోలేక ఆటో డ్రైవర్ ఆత్మహత్య..

**రాజేంద్రనగర్,మే27(సూర్యరేఖ)**



మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది.మార్కండేయ నగర్‌కు చెందిన భరత్ రెడ్డి(27)వృత్తిరీత్యా ఆటో డ్రైవర్ గా పని చేస్తున్నాడు.భరత్ రెడ్డి తల్లి సంవత్సరం క్రితం మృతి చెందడంతో ఇంట్లో ఒక్కడే ఒంటరిగా ఉంటున్నాడు.తల్లి మరణంతో తీవ్ర మనోవేదనకు గురై మద్యానికి బానిసగా మారాడు.తల్లి మృతిని జీర్ణించుకోలేక తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అకాల వర్షం అపార నష్టం..




**నిజాంపేట,మే27(సూర్యరేఖ)**మండల వ్యాప్తంగా గత రాత్రి కురిసిన వర్షానికి రైతులు ఎండబోసిన వరి ధాన్యం కుప్పలు తడిసిపోయాయి .కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలు సకాలంలో జరగకపోవడంతో 15రోజుల్లో పూర్తయ్యే ప్రక్రియ నెలరోజులు గడిచినా పూర్తి కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి వడ్లను రైస్‌మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే కల్వకుంట గ్రామంలో రైతులు కొనుగోలు కేంద్రాలలో వడ్లను తరలించి నెల రోజులు గడుస్తున్నా కాంటలు కావడం లేదని,కాంటలు చేయకుండా నిర్వాహకులు నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కాంటాలను త్వరగతిన పూర్తి చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

## ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ కు వినతి



**ఉప్పల్,మే27(సూర్యరేఖ)** నాచారం డివిజన్ శ్రీనగర్ కాలనీలో ఉన్నటువంటి పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని,శ్రీనగర్ కాలనీ రోడ్డు కూడా పాడైందని కొత్త సిమెంటు రోడ్డు నిర్మించాలని కాలనీవాసులు బారాస రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ కు వినతి పత్రం అందజేయడం జరిగింది.తప్పకుండా తొందరలోనే ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయిస్తామని,రోడ్లు కూడా వేయిస్తామని సాయి జెన్ శేఖర్ కాలనీవాసులకు హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో వెంకటేష్, శ్రీనివాస్,బాలకృష్ణ,భూషణ్,వినోద్,తదితరులు పాల్గొన్నారు.

## బాల్క సుమన్‌పై పోలీసులకు ఫిర్యాదు..

ప్రజలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారంటూ టీపీసీసీ నేత రామిల్ల రాధిక ఆరోపణ



**మందమర్రి,మే27(సూర్యరేఖ)**మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో దుమారం లేపడంతో పాటు చర్చనీయాంశంగా మారాయి.“మన పిల్లలు మిలిటెంట్లు కావాలి”అంటూ ప్రజలను ప్రేరేపించేలా మాట్లాడారని ఆరోపిస్తూ టీపీసీసీ జాయింట్ కన్వీనర్ రామిల్ల రాధిక బుధవారం కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా రామిల్ల రాధిక మాట్లాడుతూ...బాల్క సుమన్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరసనలు తెలిపిన వారిపై కేసులు నమోదు చేయించారని ఆరోపించారు.బెల్ట్ షాపుల వ్యతిరేకంగా పోరాడిన మహిళలను కూడా పోలీస్ కేసుల్లో ఇరికించి రిమాండ్‌కు పంపించారని విమర్శించారు.ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్న ఆమె,ఇలాంటి వ్యక్తులు ప్రజా జీవితంలో కొనసాగకూడదన్నారు.ఈ మేరకు కుషాయిగూడ ఎస్‌హెచ్‌వోకు ఫిర్యాదు అందజేసి,అక్నాలెడ్జ్‌మెంట్ స్వీకరించినట్లు తెలిపారు.బాల్క సుమన్‌పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజాప్రతినిధిగా కొనసాగకుండా అనర్హత వేటు వేయాలని ప్రభుత్వం,ఎన్నికల అధికారులను రామిల్ల రాధిక డిమాండ్ చేశారు.రాజ్యాంగాన్ని గౌరవించే ప్రజలు ఇలాంటి వ్యాఖ్యలను సహించరని ఆమె పేర్కొన్నారు.

## వెంకటాపూర్లో ఘనంగా బోనాల పండుగ..



**కొల్చారం,మే27(సూర్యరేఖ )**మెదక్ జిల్లా కొల్చారం మండలం వెంకటాపూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో శ్రీనల్ల పోచమ్మ,దుర్గమ్మలకు పురవీధుల గుండా పోతురాజుల విన్యాసాలు డీజే సౌండ్ తో పిల్లలు మహిళలు కలిసి ఘనంగా బోనాలు నిర్వహించారు. అనంతరం ముదిరాజ్ సంఘం సభ్యులు మాట్లాడుతూ...ప్రతి సంవత్సరం ఆనవైతిగా దుర్గమ్మ,పోచమ్మలకు బోనాలు తీస్తామని తెలిపారు. గ్రామంలో బోనాల ఊరేగింపుతో పండగ వాతావరణం నెలకొందని గ్రామస్తులు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్,ఉపసర్పంచ్,గ్రామ ప్రజలు, మహిళలు,యువకులు,తదితరులు పాల్గొన్నారు.

# అన్నం పెట్టే రైతన్నలకు రోడ్డుమీద కన్నీళ్ళు..





మూడు గంటల పాటు మెదక్- సంగారెడ్డి రహదారిపై రాస్తారోకో.....

**కొల్చారం,మే27(సూర్యరేఖ)**లారీల కోసం రైతన్నలు కొల్చారం మండలం రంగంపేటలో రాస్తారోకో నిర్వహించారు.వారం రోజుల నుండి ఏర్పాటుచేసిన రంగంపేట,పైతర, రంగంపేట సహకార సంఘం పరిధిలో తుక్కాపూర్, కొనాపూర్,మాందాపూర్ కొనుగోలు కేంద్రాలకు ధాన్యం లారీలు రాకపోవడంతో బుధవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షాలకు దాన్యం తడిసి ముద్దయింది.దీంతో ఆగ్రహించిన రైతన్నలు ఒక్కసారిగా మెదక్ సంగారెడ్డి ప్రధాన రహదారిపై రాస్తారోకో దిగారు.జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారులు నిర్లక్ష్యం మూలంగా ధాన్యంతరలింపులో జాప్యం జరుగుతుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.వెంటనే జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ రంగంపేటకు వచ్చి ధాన్యం తరలింపుపై స్పష్టమైన హామీ ఇచ్చేవరకు ఆందోళన విరమించేది లేదని రైతులు భీష్మించుకు కూర్చున్నారు.కొల్చారం తహసిల్దార్ శ్రీనివాసచారి,ఎస్సై మహమ్మద్ మోహినుద్దీన్,లు రైతుల వద్దకు వచ్చి నచ్చజెప్పినప్పటికీ రైతులు ఆందోళన విరమించలేదు.దీంతో పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ జగదీష్,జిల్లా పౌరసరఫరలశాఖ అధికారి నిత్యానంద రంగంపేటకు చేరుకొని ప్రతిరోజు లారీలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని వారం రోజుల్లో కొనుగోలు కేంద్రంలో మొత్తంధాన్యం తరలిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.ఈ కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షులు అరిగే రమేష్,ఉపాధ్యక్షులు మోత్కు మల్లేశం,సర్పంచ్ల ఫోరం మండలశాఖ అధ్యక్షులు రవితేజ రెడ్డి,యువజన విభాగం మండలశాఖ అధ్యక్షులు సంతోష్ రావు,రంగంపేట సర్పంచ్ అరిగే విజయ్ స్వర్ణలత,ఉపసర్పంచ్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లో ఓనమాలు నేర్పిన ఆరాధ్యదైవం ఎన్టీఆర్..

మహిళలకు ఆస్తిలో సమాన హక్కు కల్పించిన మహానాయకుడు..

తెలుగుజాతి ఉన్నంతవరకు ఆయన కీర్తి చిరస్థాయి..

ఎన్టీఆర్ స్ఫూర్తితోనే హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ఎదిగానన్న

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ



**శేరిలింగంపల్లి,మే27(సూర్యరేఖ)** తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని విశ్వవ్యాప్తం చేసిన వెండితెర ఇలవేల్పు నందమూరి తారక రామారావుతో తనకున్న ఆత్మీయ అనుబంధాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ నెమరువేసుకున్నారు.మే 28న ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళులర్పించారు.రాజకీయాల్లో తనకు ఓనమాలు నేర్పిన ఆదర్శమూర్తి ఆయనేనని,ఆయన ఆశయాలు,విలువలే పునాదిగా నేడు శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో అగ్రగామిగా నిలుపుతున్నట్లు తెలిపారు.ఒక సామాన్య కార్యకర్తగా ప్రస్థానం ప్రారంభించి,నేడు హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ప్రజాసేవలో ఉన్నానంటే దానికి ఎన్టీఆర్ ఇచ్చిన స్ఫూర్తి,ఆయనతో సాగిన మధుర క్షణాలే కారణమని వెల్లడించారు.రాముడు,కృష్ణుడు అంటే ఇలాగే ఉంటారనేలా కోట్లాది మంది హృదయాల్లో ముద్ర వేసుకున్న ఎన్టీఆర్ రూపం అజరామరమని కొనియాడారు.కేవలం వెండితెరకే పరిమితం కాకుండా,రాజకీయాల్లోకి ప్రవేశించి నిఖార్సయిన పేదల పక్షపాతిగా నిలిచారని స్పష్టం చేశారు. పేదవాడి ఆకలి తీర్చడమే పరమావధిగా రెండు రూపాయలకే కిలో బియ్యం వంటి బృహత్తర సామాజిక పథకాన్ని ప్రవేశపెట్టిన మహోన్నతుడని శ్లాఘించారు.పరిపాలనా వికేంద్రీకరణకు అద్దం పడుతూ బ్రిటీష్ కాలం నాటి పాత తాలూకా వ్యవస్థను ధైర్యంగా రద్దు చేసి,మండల వ్యవస్థను తీసుకువచ్చిన ఘనత ఆ మహానాయకుడిదేనని గుర్తుచేశారు.దీనితో పాటుగా,సమాజంలో సగభాగమైన మహిళల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేసిన మహాపురుషుడు ఎన్టీఆర్ అని కొనియాడారు.దేశ చరిత్రలోనే తొలిసారిగా ఆడపిల్లలకు సైతం వారసత్వ ఆస్తిలో సమాన హక్కు కల్పిస్తూ చారిత్రాత్మక చట్టాన్ని తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని ప్రశంసించారు.ఈ విప్లవాత్మక సంస్కరణల ద్వారా ప్రభుత్వ సేవలను నేరుగా గ్రామీణ ప్రజల చెంతకు చేర్చి,దేశవ్యాప్తంగా భారీ రాజకీయ,సామాజిక మార్పులకు నాంది పలికారని విశ్లేషించారు.ఎన్టీఆర్ ఆశయాల వెల్లువలో ప్రభావితమై రాజకీయాల్లోకి వచ్చిన లక్షలాది మంది యువకుల్లో తాను ముందు వరుసలో ఉంటానని ఆరికెపూడి గాంధీ సగర్వంగా ప్రకటించారు.ఆ మహానుభావుడిని పలు దఫాలుగా ప్రత్యక్షంగా కలుసుకునే అరుదైన అదృష్టం తనకు దక్కిందని,ఆ తీపి గుర్తులు తన జీవితాంతం నిలిచిపోతాయని భావోద్వేగానికి లోనయ్యారు. అసలైన ప్రజా నాయకుడు ప్రజల మధ్య ఎలా ఉండాలి,వారి సమస్యలను ఎలా పరిష్కరించాలి అనే అత్యున్నత విలువలను ఎన్టీఆర్ ను చూసే నేర్చుకున్నట్లు చెప్పారు.ఆ మహానాయకుడి నీడన రాజకీయ పాఠాలు నేర్చుకోవడం,ఆయన అడుగుజాడల్లో నడవడం తన జీవితానికి దక్కిన అత్యంత అద్భుత వరంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రపంచవ్యాప్తంగా తెలుగు మాట్లాడే ఆఖరి వ్యక్తి ఉన్నంత వరకు ఎన్టీఆర్ కీర్తి,ఆయన ప్రతిష్ట అజరామరంగా వెలుగుతూనే ఉంటాయని స్పష్టం చేశారు.నాడు యువతలో ఆయన నింపిన చైతన్యం,నేర్పిన రాజకీయ విలువలను నేటికీ తూచా తప్పకుండా పాటిస్తున్నట్లు చెప్పారు.ఆయన ఆశయాల బలమే శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు,నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేసేందుకు తనకు కొండంత అండగా నిలుస్తోందని వివరించారు. ఎన్టీఆర్ జయంతి వేళ ఆయన చూపిన ప్రజా సంక్షేమ బాటలోనే పయనిస్తూ,నియోజకవర్గ సమగ్ర ప్రగతికి పునరంకితం అవుతామని ఉద్ఘాటించారు.

## పల్లెవెలుగు బస్సు పునఃప్రారంభానికి మంత్రి వివేక్‌కు వినతి



**మంచిర్యాల,మే27(సూర్యరేఖ)** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన మంచిర్యాల--చెన్నూరు ఆర్డినరీ (పల్లెవెలుగు)బస్ సర్వీసును తిరిగి ప్రారంభించాలని కోరుతూ యూత్ కాంగ్రెస్ చెన్నూరు అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ మొహమ్మద్ ఇలియాజుద్దీన్ రాష్ట్ర కార్మిక,ఉపాధి శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.చెన్నూరు అసెంబ్లీ పరిధిలోని గ్రామాల ప్రజలు విద్య,ఉద్యోగం,వైద్య అవసరాల కోసం ప్రతిరోజూ రవాణాపై ఆధారపడుతున్న నేపథ్యంలో ఈ బస్సు సేవలను పునరుద్ధరించాలని ఆయన కోరారు. మంచిర్యాల నుంచి నర్వా,జైపూర్, పెగడపల్లి,గంగిపెల్లి,బేజాల, షెట్టపల్లి, మద్దులపల్లి, నర్సింగాపూర్,కుందారం,ఎల్కంటి క్రాసింగ్,వెలాల, గోపాలపూర్, పౌనూర్,శివ్వారం గ్రామాల మీదుగా చెన్నూరు వరకు ఉదయం, సాయంత్రం పల్లెవెలుగు బస్సు నడిపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రస్తుతం గ్రామీణ ప్రాంత ప్రజలు, విద్యార్థులు,ఉద్యోగులు, వృద్ధులు,రోగులు తీవ్ర రవాణా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ఈ బస్సు సర్వీస్ పునఃప్రారంభం ద్వారా వేలాది మందికి ఉపశమనం కలుగుతుందని వినతిపత్రంలో పేర్కొన్నారు.వినతిపత్రంపై మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి సానుకూలంగా స్పందించి సంబంధిత డిపో మేనేజర్‌కు విషయం తెలియజేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా మొహమ్మద్ ఇలియాజుద్దీన్ మాట్లాడుతూ...ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని,గ్రామీణ ప్రాంతాలకు అవసరమైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడంలో ప్రభుత్వం చర్యలు చేపడుతుందనే నమ్మకంతోనే వినతిపత్రం సమర్పించినట్లు చెప్పారు.

## విద్యుత్ ప్రమాదంలో ఎద్దు మృతి..రైతు ఆవేదన



**మందమర్రి,మే27(సూర్యరేఖ)** మందమర్రి మండలం వెంకటాపూర్ గ్రామంలో విద్యుత్ షాక్ కారణంగా ఓ ఎద్దు మృతి చెందిన ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది .గ్రామానికి చెందిన రైతు గోనె రఘువీర్ రావుకు చెందిన ఎద్దు బుధవారం ఉదయం ప్రమాదవశాత్తూ విద్యుత్ ప్రవాహానికి గురై ప్రాణాలు కోల్పోయింది.ఎద్దు వ్యవసాయ పనులకు ప్రధాన ఆధారమైందని,దాని మృతితో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతు రఘువీర్ రావు కన్నీటి పర్యంతమయ్యారు. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ.50 వేల వరకు ఉంటుందని తెలిపారు.ప్రభుత్వం స్పందించి ఆర్థిక సహాయం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఘటన సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ సిబ్బంది, పశువైద్య అధికారులు గ్రామానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.వెంకటాపూర్ సర్పంచ్ సెగ్గం వెంకటేష్ కూడా సంఘటన స్థలాన్ని సందర్శించి రైతును పరామర్శించారు.బాధిత రైతుకు న్యాయం జరిగేలా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

## జియాగూడలో గులాబ్ బోలి స్కూల్ కోసం స్థలం కేటాయింపు..స్కూల్ భవనం నిర్మాణం మరిచారు



**నాంపల్లి,హైదరాబాద్,మే27(సూర్యరేఖ)** జియాగూడలో 2పడక గదుల డిగ్నిటీ హౌసింగ్ కాలనీలో ప్రతిష్టాత్మకంగా కాలనీలో 840రెండు పడక గదుల నివాసాలను ప్రభుత్వం నిర్మించింది. ఆసమయంలో నిర్మాణాలకు అడ్డుగా ఉందని పురాతన గులాబ్ బోలి స్కూల్ భవనాన్ని కూల్చివేసి గులాబోలి స్కూల్ నూతన భవనం కోసం స్థలం కేటాయించారని, నిధులు లేవు,నిర్మాణం లేదని బిఆర్ఎస్ నగర నాయకులు దిలీప్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...ఆ తర్వాత ఆ గులాబ్ బోలి స్కూల్ నిర్మాణం,ప్రారంభానికి నోచుకోలేదని,స్థలం వృధాగా ఉండడమే కాకుండా అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేసారు.ప్రభుత్వం స్పందించి గులాబ్ బోలి స్కూల్ నూతన భవనం నిధులు కేటాయించి,త్వరగా పునః ప్రారంభించాలని కోరారు.అదేవిధంగా జియాగూడలోని పోలీస్ క్వార్టర్స్ ప్రాంగణంలో స్థలం వృధాగా ఉందాని,ఈ పోలీస్ కోటర్స్ ప్రాంగణంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మించాలని,ప్రభుత్వానికి విన్నవించుకోవడం జరుగుతుందన్నారు.ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మిస్తానని రేవంత్ రెడ్డి ప్రభుత్వం హామీ ఇవ్వడం జరిగిందని,జియాగూడలోని పోలీస్ క్వార్టర్స్ ప్రాంగణంలో స్థలం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కు ఉపయోగించి నిర్మించాలని దిలీప్ కుమార్ రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.


## ప్రజల సౌకర్యార్థం ఎక్స్ రే మిషన్ ప్రారంభం..

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల,మే27(సూర్యరేఖ)** జిల్లా ప్రజల సౌకర్యార్థం 2వ ఎక్స్ రే మిషన్ ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.బుధవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా॥అనితతో కలిసి ఎక్స్ రే మిషన్ ను ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...జిల్లాలో క్షయవ్యాధి నియంత్రణలో భాగంగా వైద్య-ఆరోగ్యశాఖ ద్వారా 23లక్షల రూపాయల విలువ గల 2వ డిజిటల్ ఎక్స్ రే మిషన్ అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు.ఈ మిషన్ ద్వారా క్షయవ్యాధి నిర్ధారణ చేయడం జరుగుతుందని తెలిపారు.మంచిర్యాల నగర పాలక సంస్థ పరిధిలోని మారుమూల ప్రాంతాలలో క్షయ వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ఈ మిషన్ ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారి డా॥ సుధాకర్ నాయక్,జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు,టి.బి.సమన్వయకర్త సురేందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ..



**మందమర్రి,మే27(సూర్యరేఖ)** వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలకు ఉపశమనం కలిగించే లక్ష్యంతో మందమర్రి మార్కెట్ ఏరియాలోని ఆంధ్ర బ్యాంక్ (యూనియన్ బ్యాంక్)ఏ టీఎం సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో బుధవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ మహేందర్ పాల్గొని ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.అత్యవసర పరిస్థితులు మినహా మధ్యాహ్న సమయంలో బయటకు రావద్దని,ఎండలో ఎక్కువసేపు ప్రయాణాలు చేయకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో తాడికొండ లూథర్, కడలి శ్రీనివాసరావు,మాదిరెడ్డి సుకుమార్, జమల్పురి నర్సోజి తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలి..






రాష్ట్ర మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి కె.ఏసురత్నం

**రాజేంద్రనగర్,మే27(సూర్యరేఖ)**తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్,కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కొత్తూరు మున్సిపల్ కమిషనర్ బాలాజీకి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా తెలంగాణ మున్సిపల్ సంఘం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే.యేసురత్నం పాల్గొన్నారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రసంగించారు మండిపడ్డారు.మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు రూ.26వేలు అమలు చేయాలన్నారు.రెండో పీఆర్సీని వెంటనే ప్రకటించాలని,రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఉద్యోగులు,కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అన్నారు.రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంఘం ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేసే అన్ని రంగాల కార్మికులకు కనీస వేతనం రూ.26 వేల రూపాయలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి కార్మికులను మూడు భాగాలుగా విభజించి కార్మికులకు తీరని అన్యాయం చేస్తున్నారని ఆవేదన చెందారు.అన్ స్కిల్డ్ కార్మికులకు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కనీస వేతనం రూ.18 వేలు ఇప్పటికే అమలు చేస్తున్నారన్నారు .మున్సిపాలిటీలలో రూ.16,500 అమలు చేస్తున్నారన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పుడు ఇస్తున్న కనీస వేతనాలు కాకుండా కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని,ముఖ్యమంత్రి చిత్తశుద్ధితో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు ఇంప్లిమెంట్ చేయాలని కోరారు.సూపర్ వైజర్స్ కు కనీస వేతనం పారిశుధ్య కార్మికులతో పాటు ఇస్తున్న జీతం కాకుండా వారిని స్కిల్డ్ కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు రూ.30 వేలు అమలు చేయాలన్నారు.అదేవిధంగా కాంటాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు 15 క్యాజువల్ లీవులు,8 జాతీయ పండుగ సెలవులు అమలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు జి. సంజీవ,అంజయ్య,రోజా,హరిగౌడ్,కృష్ణయ్య గౌడ్,శ్రీనివాస్,రఘు కార్మికులు పాల్గొన్నారు.

# గగన్ పహాడ్ బస్తీ 20 ఏళ్లుగా అభివృద్ధికి ఆమడ దూరం..

పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు..
సమస్యలతో సహవాసం చేస్తున్న గగన్ పహాడ్ గ్రామ ప్రజలు..
సీసీ రోడ్లు,భూగర్భ డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాలి..
ప్రజా సమస్యలను పరిష్కరించాలి..
బీఆర్ఎస్ ఉద్యమ నాయకుడు ఎర్రోళ్ల యాదయ్య




**రాజేంద్రనగర్,మే27(సూర్యరేఖ):** రాజేంద్రనగర్ సర్కిల్ గగన్ పహాడ్ బస్తీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని బీఆర్ఎస్ ఉద్యమ నాయకుడు ఎర్రోళ్ల యాదయ్య అన్నారు.ఈ మేరకు విద్యుత్ విభాగం డీఈ కలసి గగన్ పహాడ్ గ్రామంలో వివేకానంద స్ట్రీట్ వీకార్ సెక్షన్ కాలనీ చాలా రోజుల నుంచి పెండింగ్ లో ఉన్న సీసీ రోడ్లు,డ్రైనేజ్ పనులు,వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ ఉద్యమ నాయకుడు ఎర్రోళ్ల యాదయ్య రాజేంద్రనగర్ డిఈకి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎర్రోళ్ల యాదయ్య మాట్లాడుతూ...ప్రజలు స్థానికంగా అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు.వీటి పరిష్కారంపై దృష్టి పెట్టడంలో వైఫల్యం చెందుతున్నారని అన్నారు.గగన్ పహాడ్ బస్తీలో దాదాపు 20 ఏళ్ల క్రితం రోడ్లు వేశారని గుర్తు చేశారు.ప్రస్తుతం ఆ రోడ్లన్నీ శిథిలావస్థకు చేరుకోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.రోడ్లపై కనీసం నడిచే పరిస్థితి కూడా లేదన్నారు.తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురైతున్నట్లు చెప్పారు.సీసీ రోడ్ల నిర్మాణానికి గతంలో నిధులు మంజూరైన కాంట్రాక్టర్ అలసత్వం కారణంగా రోడ్లు వేయలేదని తెలిపారు.రానున్న వర్షాకాలంలోపు రోడ్లు,భూగర్భ డ్రైనేజీల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.అలాగే వీధి దీపాలు ప్రతిరోజు వెలిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.పలు సమస్యలను డీఈకి వివరించడంతో డీఈ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.త్వరలో పనులను చేయిస్తామని హామీ ఇచ్చినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో వినతి పత్రం అందజేసిన వారిలో సరికొండ దుర్గేష్,వీర్లపల్లి నవీన్ కుమార్,వల్లూరి విజయ్,తదితరులు ఉన్నారు.

## వేసవి-బక్రీద్ నేపథ్యంలో జలమండలి అత్యవసర సమీక్ష..

సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఎండీ అశోక్ రెడ్డి సూచన




**రాజేంద్రనగర్,మే27(సూర్యరేఖ)**వేసవి తీవ్రతతో పాటు బక్రీద్ పండుగ సందర్భంగా నగర ప్రజలకు నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు.జేఎండీ మయాంక్ మిట్టల్ తో కలిసి ఉన్నతాధికారులతో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో ఆయన పలు కీలక సూచనలు చేశారు.సమీక్ష సమావేశంలో బక్రీద్ పండుగను దృష్ట్యా రాబోయే 48 గంటలు అత్యంత కీలకమని పేర్కొన్న ఎండీ,అన్ని ఓ అండ్ ఎమ్,ట్రాన్స్ మిషన్ అధికారులు సమన్వయంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.నగరంలో ట్యాంకర్ బుకింగ్‌లు అధికంగా నమోదవుతున్న 48 ఫిల్లింగ్ స్టేషన్లలో 24గంటలపాటు నిరంతర ఫిల్లింగ్,డెలివరీ సేవలు కొనసాగించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.ట్యాంకర్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని అవసరమైన సిబ్బంది,సాంకేతిక వనరులు అందుబాటులో ఉంచాలని సూచించారు.అలాగే అన్ని ఫిల్లింగ్ స్టేషన్లలో ఫిల్లింగ్,డెలివరీ నిరంతరాయంగా కొనసాగించేలా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.అలాగే బక్రీద్ పండుగ సందర్భంగా కొంతమంది ట్యాంకర్ డ్రైవర్లు విధులకు అందుబాటులో ఉండకపోవచ్చని పేర్కొంటూ,వారి స్థానంలో ప్రత్యామ్నాయ డ్రైవర్లను ముందస్తుగా నియమించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.గాలివాన వల్ల మంజీరా పేజ్-1,2 సిస్టమ్‌లో విద్యుత్ అంతరాయాలు ఏర్పడి పంపింగ్ నిలిచిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని అధికారులు సమావేశంలో వివరించారు.దీనిపై స్పందించిన ఎండీ అశోక్ రెడ్డి,ప్రభావిత ప్రాంతాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యామ్నాయ ప్రాంతాల నుంచి నీటిని మళ్లించే చర్యలు చేపట్టాలని సూచించారు.

## బీసీ అభ్యున్నతికి చొరవ చూపాలి..

ప్రభుత్వ సలహాదారు వీ.హనుమంతరావును కోరిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్,మే27(సూర్యరేఖ)** రాష్ట్రంలో ఉన్న బీసీల అభ్యున్నతికి చొరవ చూపాలని ప్రభుత్వ సలహాదారు వీ.హనుమంతరావును రాజేంద్రనగర్ నియోజకవర్గం శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్ కోరారు.బుధవారం ప్రభుత్వ సలహాదారు వీ.హనుమంతరావును రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి,శాలువాతో సత్కరించి తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.తెలంగాణ ప్రభుత్వ వెనుకబడిన తరగతుల సంక్షేమం,అభివృద్ధి సలహాదారుగా నియమితులైన సీనియర్ నాయకులు వీ.హనుమంతరావును కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు.బీసీల అభ్యున్నతికి హనుమంతరావు అనుభవం ఎంతో దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం వీరిద్దరూ రాష్ట్రంలోని బీసీ సంక్షేమ కార్యక్రమాలు,రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి అంశాలపై కొద్దిసేపు ప్రత్యేకంగా చర్చించుకున్నారు.

## రమాబాయి అంబేడ్కర్‌కు నివాళులర్పించిన రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు



**రాజేంద్రనగర్,మే27(సూర్యరేఖ)**రాష్ట్ర బిజెపి కార్యాలయంలో భారత రత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సతీమణి రమాభాయి అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు అన్నారు.రామాబాయి వర్ధంతిని పురస్కరించుకొని రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు క్రాంతి కిరణ్ అధ్యక్షతన 91వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు రామాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ దేశానికి రాజ్యాంగాన్ని రచించి గొప్ప మహోన్నతుడిగా పేరు ప్రఖ్యాతులు సంపాదించినప్పటికీ ఆయన సతీమణిగా రమాబాయి సాధారణ జీవితం గడిపారని ఈ సందర్భంగా ఎన్.రామచంద్రరావు కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతంరావు,దాసరి మల్లేష్,పాపారావు, గోల్కొండ గోషామహల్,జిల్లా ఇన్చార్జ్ వై.శ్రీధర్,రాజేంద్రనగర్ డివిజన్ ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి ఇ.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## భూసమస్యల పరిష్కారానికి సీఎం సానుకూల స్పందన..

స్పష్టం చేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**రాజేంద్రనగర్,మే27(సూర్యరేఖ)** భూసమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు.బుధవారం సీఎం క్యాంప్ ఆఫీస్‌లో సీఎం రేవంత్ రెడ్డిని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు.శంషాబాద్ మండలంలోని బహదూర్ గూడ,ఘాన్సీమియాగూడ గ్రామాల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూముల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యమంత్రికి ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.ఎమ్మెల్యే విజ్ఞప్తిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత సానుకూలంగా స్పందించారు.ఈ భూ సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు వీలుగా వెంటనే రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు అవసరమైన ఆదేశాలు జారీ చేశారు.రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ఆధ్వర్యంలో ఈ సమస్యను సమగ్రంగా సమీక్షించి,పూర్తి స్థాయిలో పరిష్కరించాలని అధికారులను సూచించారు.తమ ప్రాంత ప్రజల సమస్యపై తక్షణమే స్పందించి,సానుకూల నిర్ణయం తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి

**జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ సాద్వి నిరంజన్ జ్యోతిను కలిసిన ఎంపీ ఆర్.కృష్ణయ్య**



**న్యూఢిల్లి :** కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలి.× కేంద్రం బడ్జెట్ లో బీసీల అభివృద్ధికి రెండు లక్షల కోట్లకు పెంచాలి.× ఆంధ్రప్రదేశ్ ? తెలంగాణ మాదిరిగా హాస్టళ్ళు ? గురుకుల పాఠశాలల పూర్తి ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్ షిప్ పథకం దేశమంతటా అమలు చెయ్యాలని రాజ్యాంగ బద్ధమైన సంస్థగా సిఫార్స్ చెయ్యాలి. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి రెండు లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించి ఆర్థిక, విద్య, ఉద్యోగ, శిక్షణ, అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రాజ్యాంగ బద్ధమైన సంస్థగా జాతీయ బి.సి కమిషన్ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పలువురు బి సి సంఘం నేతలతో కలిసి జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ సాద్వి నిరంజన్ జ్యోతిను ఢిల్లీలో లో కలిసి చర్చలు జరిపారు. స్వాతంత్ర వచ్చి 77 సంవత్సరాలు గడిచిన 56% జనాభా గల బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవడం ఈ కులాల అభివృద్ధి జరగడం లేదు అన్నీ సామాజిక వర్గాలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ లు యున్నవి. కానీ బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకపోవడం వలన న్యాయం జరుగుతుంది అని తెలిపారు . కేంద్ర ప్రభుత్వం బీసీలకు విద్యా ఉద్యోగ రంగాలలో 27 శాతం రిజర్వేషన్లు పెట్టారు వీటికి అనుబంధంగా ఆర్థికపరమైన రాయితీలు స్కాలర్ షిప్ లు, ఫీజు రియంబర్స్ స్కీము మంజూరు, హాస్టల్స్, గురుకుల పాఠశాలలు, నవోదయ పాఠశాలలు, మంజూరుకు బడ్జెట్ కేటాయించడం లేదు. ప్రత్యేక హాస్టళ్ళు ? విద్యా సంస్థలు లేకపోతే బి.సి లు ఎలా చదువుకుంటారని తెలిపారు. విద్యా సంబంధమైన రాయితీలు స్కాలర్ షిప్ లు ? ఫీజులు, హాస్టళ్ళు లేకపోతే ఆర్థికంగా అత్యంత వెనుక బడిన కులాలు ఎలా చదువుకుంటారని సాద్వి నిరంజన్ జ్యోతికి తెలిపారు. ఐ.ఐ.టి – ఐ.ఐ.యం – నీట్ లాంటి ముఖ్యమైన కోర్సులు చదివే బీసీ విద్యార్థులకు ఈ కోర్సుల ఫీజులు చాలా ఎక్కువగా ఉన్నవి. ఒక లక్షా 30 వేల నుండి ఒక లక్షా 70 వేల వరకు ఫీజులు ఉన్నవి. పైగా బీసీలకు క్రిమిలేయర్ ఆర్థిక పరిమితి విధించారు అత్యంత వెనకబడిన కులాల వారు సీట్లు పొందినప్పటికీ ఫీజు కట్టే సోమత లేక చదువు మానుకుంటున్నారని చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాలు. విద్యా రంగంకు అత్యంత ప్రాదాన్యత ఇచ్చి ఉచిత విద్యా 3వ తరగతి నుండి పి.జి వరకు ఇస్తున్నారు. ముఖ్యంగా 6వేల హాస్టళ్ళు, 1500 గురుకుల పాఠశాలలో 24 లక్షల మందికి ఉచిత భోజన వసతి కల్పిస్తున్నారు. అలాగే 30 లక్షల మందికి కాలేజీ విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ అమలు చేస్తున్నారు.విద్యకు అత్యంత ప్రాదాన్యత ఇస్తున్నారు.విద్య వలన జ్ఞాన సమాజం ఏర్పడుతుంది. సమాజంలో ప్రతి పౌరుడు సభ్యతతో – సంస్కారవంతంగా జీవిస్తారు. దీని మూలంగా సమాజంలో శాంతియుతంగా ఉన్నత జీవన ప్రమాణాలతో జీవిస్తారు. ఆరోగ్య స్పృహ ఎక్కువగా వస్తుంది. దీని మూలంగా ప్రభుత్వం వైద్య, ఆరోగ్యం పై పెట్టె బడ్జెట్ ఖర్చు తగ్గుతుంది. అలాగే శాంతిభద్రతలు కూడా చక్కగా ఉండడంతో పోలీసు శాఖపై పెట్టే ఖర్చు కూడా తగ్గుతుంది. ఇలా ఒకదాని పై ఒకటి ప్రత్యక్షంగా, పరోక్షంగా సమాజంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయి.విద్య ద్వారానే మనుషులలో నైతిక, సామాజిక, మానవ విలువలు పెరుగుతాయి. అప్పుడే సమాజం సజావుగా కొనసాగుతుంది. సమాజంలో కనిపిస్తున్న అత్యాచారాలు, హత్యలు, దోపిడీలు విద్య ద్వారానే నిర్మించగలనీ. సమాజంలో ఉన్న దోపిడీ, పీడన, వివక్ష, అసమానతలు, అణచివేతలకు విద్య ద్వారానే పరిష్కారం లభిస్తుందని, అజ్ఞానం అమాయకత్వం, విద్య ద్వారానే నిర్మించగలనీ. భారత దేశాన్ని పట్టి పీడిస్తున్న అనేక సమస్య లకు విద్య ద్వారానే పరిష్కారం లభిస్తుంది. రాకెట్ స్పీడ్ తో వెలుగుతున్న ఆధునిక విజ్ఞాన ప్రపంచంలో విద్య ద్వారానే భారత్ పోటీని ఇవ్వగలుగుతుంది. భవిష్యత్తులో మానవ మనుగడకు ఎదురవుతున్న సవాళ్లను, వాతావరణ కాలుష్యం, పర్యావరణ పరిరక్షణ విద్య ద్వారానే జాతిని జాగృతం చేయగలుగుతాం. ఒక వ్యక్తి నిర్మాణం ? కుటుంభ నిర్మాణం ? సమాజ నిర్మాణం విద్యా ద్వారానే జరుగుతుంది.విద్య ఒక్కటే మానవ వికాసానికి మార్గం. విద్య ద్వారానే బడుగు వర్గాలకు సాంఘీక సమానత్వం – సామాజిక న్యాయం దక్కుతుంది. ప్రపంచంలో నేడు అగ్రదేశాలుగా చలామణి అవుతున్న అమెరికా, ఇంగ్లాండ్, చైనా, జపాన్, రష్యా, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీ 100% విద్య వలననే అగ్రదేశాలుగా గుర్తించబడ్డాయి. విద్యా ద్వారానే భారతదేశంలోనే శక్తి వంతమైన దేశంగా రూపొందుతుంది. పరిశ్రమలు రావడం, యాంత్రీకరణ చెందడం మూలంగా కులవృత్తులు – చేతివృత్తులు దెబ్బతిన్నాయి. దీనితో ఈ కుల వృత్తుల వారు వృత్తులు కోల్పోయి ఆకలి చావులకు గురవుతున్నారు. వీరికి ఆర్థికంగా చేయూతనిచ్చి ప్రతి కుటుంబానికి 10 లక్షల నుండి 50 లక్షల వరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని కోరారు. అలాగే రాజీవ్ ఫెలో షిప్ పథకం కింద అర్హులైన ఖష్ట్ర.ఆ స్కాలర్స్ అందరికీ స్టై ఫండు మంజూరు చేయాలని, గురుకులపాఠశాల, హాస్టల్ భవనాల నిర్మాణాలకు బడ్జెట్ కేటాయించాలని కోరారు. పారిశ్రామిక పాలసీలలో, కాంట్రాక్టుల కేటాయింపులో బీసీలకు 50 శాతం కోటా ఇవ్వాలని సాద్వి నిరంజన్ జ్యోతిను కోరారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాలు అమలు చేసే బీసీ పథకాలకు 60 శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలని కోరారు.కేంద్రానికి సిఫార్సు చేస్తామని హామీ :బీసీల డిమాండ్లు న్యాయమైనవని ఈ డిమాండ్లు పరిశీలించి కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని చైర్మన్ సాద్వి నిరంజన్ జ్యోతి హామీ ఇచ్చారు . తెలుగు రాష్టాలు అమలు చేస్తున్న ఫీజు రియంబర్స్ మెంట్, స్కాలర్ షిప్ లు, హాస్టళ్ళు, గురుకుల పాఠశాలలు దేశమంతా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని సాద్వి నిరంజన్ జ్యోతి హామీ ఇచ్చారు.

# మహిళా ఆర్థిక స్వావలంబనే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం









**వనపర్తి :** మహిళా ఆర్థిక స్వావలంబనే పరమావధిగా... తెలంగాణ రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందనీ వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సమైక్య ఆవరణలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో వనపర్తి శాసనసభ్యులు గౌరవ శ్రీ తూడి మేఘారెడ్డి పాల్గొన్నారు.ముందుగా మహిళా సమాఖ్య భవనంలో నూతనంగా ఏర్పాటుచేసిన వీడియో కాన్ఫరెన్స్ హాల్ను ఆయన ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూదివంగత మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలనలో మహిళలకు భావన వంటిపై రుణాలు ఇచ్చారని.నేడు రేవంత్ రెడ్డి పాలనలో మహిళలను మహారాణులుగా చేయాలన్న ఉద్దేశంతో వడ్డీ లేని రుణాలు ఇస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు.పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో మహిళా సంఘాలు పూర్తిగా నిర్వీర్యమైపోయాయని ఆయన అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదటి సంతకం మహిళలు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం చేసే ఫైల్ పైనే సంతకం చేశారని ఆయన గుర్తుకు చేశారు.ఈ ఉచిత ప్రయాణం ద్వారా కేవలం వనపర్తి నియోజకవర్గం సంబంధించి ఇప్పటివరకు 30 కోట్ల 32 లక్షల రూపాయలు ప్రభుత్వానికి చెల్లించిందని ఆయన వివరించారు.1996లో మహిళా సంఘాలు ఏర్పాటు అయ్యాయని అప్పుడు కేవలం 10 వేల రూపాయలు మాత్రమే మహిళా సంఘాలకు రుణంగా ఇచ్చేవారని నేడు 20 లక్షల రూపాయలు మహిళా సంఘాలకు వడ్డీ లేకుండా రుణం ఇస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే పేర్కొన్నారు.మహిళా సంఘాలకు ప్రత్యేక గ్రామంలో మహిళా సంఘం భవనం ఉండేలా నేడు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా 12,700 మహిళా సంఘాల భవన నిర్మాణాలను చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు.కేవలం వనపర్తి నియోజకవర్గంలో 104 మహిళా సంఘం భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.మహిళా సంఘంలోని మహిళలకు 10 లక్షల బీమా కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఇప్పటివరకు 6000 సంఘాలకు 324 కోట్ల రూపాయల రుణాలు ఇచ్చినట్లు వారి తెలిపారు.ఈ సందర్భంగా అంగన్వాడి కేంద్ర చిన్నారులకు మంజూరైన యూనిఫారం లను చిన్నారులకు అందజేశారు. నిరవధిక నిరసనలు చేపట్టిన వివో ఏలు జూన్ రెండో తారీకు వరకు సమయమైన పాటించాలని జూన్ రెండు తర్వాత ప్రభుత్వంతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.అనంతరం డిఆర్డిఓ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎమ్మెల్యే సందర్శించారు. వారు చేసిన ఉత్పత్తుల గురించి అడిగి తెలుసుకున్నారు మహిళా అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతైనా సహాయ సహకారుల అందిస్తుందని స్వయం సహాయ కోత్పత్తులపై మృతి సారించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో వనపర్తి అడిషనల్ కలెక్టర్ కిమ్యా నాయక్, డి ఆర్ డి ఓ ఉమాదేవి, వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, జిల్లా సమైక్య అధ్యక్షురాలు ఇందిర, మండల సమాఖ్యఅధ్యక్షురాలు సంధ్యారాణి.బి డబ్ల్యు ఓ సుధారాణి, పట్టణ కౌన్సిలర్లు, ంఖఓ లు, అఅ లు, ఉా లు, అధికారులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నేతకు ఘన నివాళులు..

మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్ లాల్ ప్రధమ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహణ..



**కారేపల్లి,మే27(సూర్యరేఖ)** సింగరేణి మండలంలోని బస్ స్టాండ్ సమీపంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వైరా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్ లాల్ ప్రధమ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్కే గౌసుద్దీన్,మాజీ జెడ్పిటిసి వాంకుడోత్ జగన్ నాయక్ ఆధ్వర్యం వహించగా, పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు హాజరై భావోద్వేగంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్ లాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా స్మరించుకున్నారు.అనంతరం రెండు నిమిషాల మౌనం పాటించి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.నాయకులు మాట్లాడుతూ... బానోత్ మదన్ లాల్ సాధారణ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకున్న నిజమైన ప్రజానాయకుడని కొనియాడారు.వైరా నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ముఖ్యంగా గిరిజనుల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి,పేద ప్రజల హక్కుల కోసం ఆయన నిరంతరం పోరాడారని గుర్తు చేసుకున్నారు.ప్రజల సమస్యల పరిష్కారమే తన రాజకీయ లక్ష్యంగా పెట్టుకుని పనిచేసిన మహానేతగా బానోత్ మదన్ లాల్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని నాయకులు అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు, ప్రజాప్రతినిధులు,యువ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని మాజీ ఎమ్మెల్యేకు ఘన నివాళులు అర్పించారు.

## హెల్మెట్ ధరిస్తే ప్రాణ రక్షణతో పాటు వడగాలుల నుంచి కూడా రక్షణ..

సీఐ నునావత్ సాగర్




**కారేపల్లి,మే27(సూర్యరేఖ)** రోడ్డు ప్రమాదాల్లో ప్రాణ నష్టం తగ్గించేందుకు ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కారేపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ నునావత్ సాగర్ సూచించారు.హెల్మెట్ లేకుండా ప్రయాణించడం చట్టరీత్యా నేరమేకాకుండా ప్రాణాలకు ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు."హెల్మెట్ అనేది కేవలం ట్రాఫిక్ జరిమానాల నుంచి తప్పించుకునేందుకు కాదు...ప్రమాద సమయంలో ప్రాణాలను కాపాడే రక్షణ కవచం"అని తెలిపారు. ఇటీవల ప్రాంతంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని యువత మరింత జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు.అధిక వేగం,నిర్లక్ష్యడ్రైవింగ్,మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం వంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు.ద్విచక్ర వాహనదారులు నాణ్యమైన హెల్మెట్ ధరించి,ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. ప్రస్తుతం మండుతున్న ఎండలు,వడగాలుల తీవ్రత కూడా ఎక్కువగా ఉన్న నేపథ్యంలో హెల్మెట్ ధరించడం వల్ల వేడి గాలుల ప్రభావం కొంతవరకు తగ్గి ఆరోగ్య సమస్యల నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు.ముఖ్యంగా మధ్యాహ్న సమయంలో అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని,తగినంత నీరు తాగుతూ జాగ్రత్తలు పాటించాలని ప్రజలకు సూచించారు.ప్రజల భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని,రోడ్డు భద్రతతో పాటు ప్రజల ఆరోగ్య పరిరక్షణపై కూడా అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తామని సీఐ నునావత్ సాగర్ తెలిపారు. "హెల్మెట్ ధరించండి...ప్రాణాలను కాపాడుకోండి... సురక్షితంగా ఇంటికి చేరండి"అంటూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పార్టీకి నమ్మకమైన కార్యకర్త ఉండటం వలనే ఈ జన ప్రభంజనం..

ఎమ్మెల్యే అమిలినేని ఎమ్మెల్యేగా సురేంద్ర బాబు రావడం మీ అదృష్టం..

జోనల్ ఇంచార్జ్ శ్రీనివాసరెడ్డి

ఘనంగా ముగిసిన మొదటి రోజు మహానాడు తెలుగుదేశం పార్టీకి అత్యంత కీలకమైన పసుపు సోదరులకు ప్రతిష్టాత్మకమైన పండుగ మహానాడుకు ఈ సారి వర్చువల్ విధానములో అది కూడా క్లస్టర్లలో నిర్వహించడం గొప్ప విశేషం..ఇలాంటి గొప్ప వర్చువల్ మహానాడుకు అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తి గ్రామంలో జరిగిన వేడుకకు ముఖ్యఅతిథులుగా తెలుగుదేశం పార్టీ జోనల్ ఇంచార్జ్ రెడ్డప్ప గారి శ్రీనివాస రెడ్డి, పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పూల నాగరాజు, నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, మాజీ గ్రంథాలయ చైర్మన్ గౌస్ మొహిద్దీన్, కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, క్లస్టర్ నాగరాజులతో కలసి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు నేటి సాయంత్రం పాల్గొన్నారు..ఈ సందర్భంగా శ్రీనివాస రెడ్డి గారు మాట్లాడుతూ కళ్యాణదుర్గం ప్రాంతానికి ఎమ్మెల్యేగా సురేంద్ర బాబు రావడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న

## బిజినెస్

### రూ.200 లకే జియో కొత్త 'ఓటీటీ పాస్'.. 15 ప్రీమియం యాప్‌లు, అన్‌లిమిటెడ్ 5జి డేటా!




రిలయన్స్ జియో తన వినియోగదారుల కోసం సరికొత్త ప్లాన్‌ను అందుబాటులోకి తెచ్చింది. కేవలం రూ. 200 ధరతో సరికొత్త 'జియో ఓటీటీ పాస్' (జీఔశీ ఘ్బ్ఖుం)ను ఈరోజు విడుదల చేసింది. ఒకే రీఛార్జ్‌తో మొబైల్ కనెక్టివిటీతో పాటు మెరుగైన వినోదాన్ని అందించే లక్ష్యంతో ఈ 28 రోజుల ప్యాక్‌ను కంపెనీ ప్రవేశపెట్టింది. ఈ సరికొత్త ప్యాక్ ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ ద్వారా వినియోగదారులందరికీ అందుబాటులోకి వచ్చింది. అయితే దీనిని యాక్టివేట్ చేసుకోవాలంటే కస్టమర్ల మొబైల్‌లో ఏదైనా యాక్టివ్ బేస్ ప్లాన్ ఉండటం తప్పనిసరి.

ఈ సరికొత్త ప్యాక్ ద్వారా వినియోగదారులకు 15 ప్రీమియం ఓటీటీ యాప్‌ల సబ్‌స్క్రిప్షన్ లభిస్తుంది. ఇందులో యూట్యూబ్ ప్రీమియం, జియోహాట్‌స్టార్ మొబైల్ ం హాలీవుడ్ (లైవ్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ ఒరిజినల్స్, హాలీవుడ్ సినిమాలు), అమెజాన్ ప్రైమ్ వీడియో మొబైల్ ఎడిషన్లు ఉన్నాయి. వీటితో పాటు జియోటీవీ యాప్ ద్వారా యాక్సెస్ చేసుకోగలిగే సోనీలివ్, జీ5, లయన్స్ గేట్ ప్లే, డిస్కవరీ ప్లస్, సన్ నెక్స్ట్, ఫ్యాన్‌కోడ్, కాంచా లంకా, ప్లానెట్ మరాఠీ, చౌపాల్, హోయిచోయ్, టైమ్స్ ప్లే, తరంగ్ ప్లస్ వంటి మరో 12 ఓటీటీల సబ్‌స్క్రిప్షన్ కూడా ఇందులో లభించబోతున్నాయి. ఇక ఈ వినోదంతో పాటు జియోటీవీ (జీఔశీం) యాప్ ద్వారా కస్టమర్లు 1,000 కి పైగా లైవ్ టీవీ ఛానళ్లను ఉచితంగా వీక్షించవచ్చు. ఇందులో 150 కి పైగా పెయిడ్ ఛానళ్లు కూడా ఉన్నాయి. ఇక డేటా ప్రయోజనాల విషయానికి వస్తే, ఈ ప్లాన్ ద్వారా వినియోగదారులకు 30 +దీ హై-స్పీడ్ 4+/5+ డేటా లభించబోతుంది.

# పెరుగుతున్న ఇంధన రేట్లే కారణం




న్యూఢిల్లీ, మే 26 : పెరుగుతున్న ఇంధన ధరలు, బంగారం-వెండిపై అధిక దిగుమతి సుంకాలు.. జూన్‌కల్లా రిటైల్ ద్రవ్యోల్బణాన్ని 5 శాతానికి ఎగదోసే వీలుందని పలువురు ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కీలక వడ్డీరేట్ల పెంపు విషయంలో వేచిచూసే ధోరణినే అవలంబించవచ్చని అభిప్రాయపడుతుండటం గమనార్హం. గత నెల ఏప్రిల్‌లో అటు రిటైల్, ఇటు హోల్‌సేల్ ద్రవ్యోల్బణ గణాంకాలు విజృంభించిన నేపథ్యంలో వచ్చే నెల జూన్‌లో జరుగబోయే ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన సమీక్షలో రెపోరేటును ఆర్బీఐ పెంచే అవకాశాలే ఎక్కువన్న అంచనాలు వినిపించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వడ్డీరేట్లను పెంచడానికి ముందు ఇంధన ధరల పెంపు ప్రభావంలో కొంత స్థిరత్వం ఏర్పడేదాకా పెంపు జోలికి సెంట్రల్ బ్యాంక్ వెళ్లకపోవచ్చనే అభిప్రాయాన్ని ఇప్పుడు మెజారిటీ ఆర్థిక నిపుణులు కనబరుస్తున్నారు. దీంతో జూన్ ద్రవ్య సమీక్షలో వడ్డీరేట్ల పెంపు ఉండదని, ద్వితీయార్ధం (జూలై-డిసెంబర్) ద్రవ్య సమీక్షల్లోనే వడ్డింపులుంటాయన్న అంచనాలు నెలకొన్నాయి.

**11 రోజుల్లో రూ.8..**

ఈ నెల 15 నుంచి 25 మధ్య 11 రోజుల్లో 4సార్లు పెట్రోల్, డీజిల్ రేట్లను చమురు మార్కెటింగ్ సంస్థలు పెంచేశాయి. తెలంగాణలోనే లీటర్ ధర దాదాపు రూ.8 పెరిగింది. సీఎన్‌జీ కూడా రూ.4 ఎగిసింది. దీంతో రవాణా ఖర్చులు ఒక్కసారిగా పెరిగిపోయాయి. ఈ ప్రభావం అన్ని వస్తూత్పత్తుల ధరలపై పడుతున్నది. అందుకే పండ్లు, కూరగాయల దగ్గర్నుంచి పప్పులు, వంటనూనెలు, ఇతర కిరాణా సరుకులదాకా అన్ని ఆహార పదార్థాల రేట్లు ఎగబాకాయి. ఈ క్రమంలోనే ఈ నెలకుగాను వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 4-4.5 శాతానికి, జూన్‌లో 4.5-5 శాతానికి చేరవచ్చని ఈవై ఇండియా చీఫ్ పాలసీ అడ్వైజర్ డీకే శ్రీవాత్సవ పీటీఐతో అంటున్నారు. పెరుగుతున్న ఇంధన ధరలు స్టోరేజీ, జనరేటర్ ఆధారిత విద్యుత్తు ఖర్చులనూ ఎగదోస్తున్నదన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కాగా, జూన్ 12న మే నెల రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు రానున్నాయి. ఏప్రిల్‌లో 3.48 శాతంగా నమోదైన సంగతి విదితమే. ఇక టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 42 నెలల గరిష్ఠాన్ని తాకుతూ 8.3 శాతంగా ఉన్నది. అయితే ఆర్బీఐ రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాల ఆధారంగానే ద్రవ్య సమీక్షలో నిర్ణయాలు తీసుకుంటుందన్న విషయం విదితమే.

**ప్రభావం ముమ్ముందే..**

పెరుగుతున్న ఇంధన ధరల ప్రభావం.. మార్కెట్‌పై పూర్తిగా జూన్ లేదా జూలై నుంచి కనిపిస్తుందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం పాత స్టాక్ ఉంటుంది కాబట్టి వాటి ధరల్లో మార్పు కనిపించట్లేదని, కొత్త స్టాక్ వస్తే పెరిగిన రవాణా ఖర్చులు, ఇతర ఉత్పాదక వ్యయాన్ని జోడించి నూతన ధరల ముద్రణ ఉంటుందని వివరిస్తున్నారు. ము ఖ్యంగా వంటనూనెలు, ఇతర ఆయిల్స్, సబ్బుల ధరలు పెరిగే వీలుందని చెప్తున్నారు. అంతేగాక వివిధ ఆహార పదార్థాల ధరలు, ప్యాకేజ్డ్ ఫుడ్స్ రేట్లు పెరుగుతాయని పేర్కొంటున్నారు. నిజానికి ఏప్రిల్‌లో ఆర్బీఐ ద్రవ్య సమీక్ష సమయంలో బ్యారెల్ ముడి చమురు ధర అంతర్జాతీయ మార్కెట్‌లో 85 డాలర్లుగా ఉన్నది. ఇప్పుడు అది 10-15 డాలర్లు ఎక్కువగా కదలాడుతున్నది. మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలు ముదిరితే అటు గ్లోబల్ మార్కెట్‌లో, ఇటు దేశీయ మార్కెట్‌లో క్రూడాయిల్, ఇంధన రేట్లు భగ్గుమనడం ఖాయం. దీంతో జూన్ మొదటి వారంలో నమోదయ్యే ముడి చమురు ధరలూ కీలకమేనన్న అభిప్రాయాలున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య యుద్ధం ఈ ఏడాది ఫిబ్రవరి 28న మొదలవగా.. 3 నెలలు కావస్తున్నా ఆ ఉద్రిక్తతలు సద్దుమణగడం లేదు. అమెరికాకు అండగా ఉంటున్నాయని యూఏఈ, కువైట్, ఖతార్, బహ్రెయిన్, సౌదీ తదితర గల్ఫ్ దేశాలపై ఇరాన్ దాడులు చేస్తున్నది. దీంతో చమురు, సహజ వాయువు ఉత్పత్తి పడిపోయింది. పైగా హొర్ముజ్ జలసంధిలో రవాణాను కూడా ఇరాన్ అడ్డుకుంటున్నది. ఫలితంగా భారత్‌కు క్రూడ్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయి.

# వికసిత్ భారత్‌కు బ్యాంకింగ్ దన్ను




**న్యూఢిల్లీ:** వికసిత్ భారత్ లక్ష్య సాకారంలో బ్యాంకింగ్ రంగం కీలకపాత్ర పోషిస్తుందని ప్రభుత్వ రంగ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు. మూలధన సమీకరణ, పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, మౌలిక సదుపాయాల అభివృద్ధిలో బ్యాంకింగ్ ప్రధానంగా ఉంటోందన్నారు. వార్షిక నివేదికలో షేర్‌హోల్డర్లకు ఇచ్చిన సందేశంలో ఆయన ఈ విషయాలు పేర్కొన్నారు. "దేశంలోనే అతి పెద్ద బ్యాంకు కావడం వల్ల మాకు అవకాశాలూ, బాధ్యత.. రెండూ ఉంటాయి. ఈ విషయాన్ని గుర్తెరిగి, భారత్ వృద్ధి ఆకాంక్షలు సాకారం కావడానికి అవసరమైన తోడ్పాటు అందించేందుకు మేము కట్టుబడి ఉన్నాం" అని తెలిపారు. డిజిటల్ మాధ్యమం, కస్టమర్ల ప్రయోజనాలకు ప్రాధాన్యతనిచ్చేలా 'డిజిటల్ ఫస్ట్, కస్టమర్ ఫస్ట్' విధానాలను మరింత పటిష్ఠంగా అమలు చేస్తామని చెప్పారు. ఈ క్రమంలో బ్యాంకింగ్ సేవలను బలోపేతం చేసేలా టెక్నాలజీ, డేటా అనలిటిక్స్, కృత్రిమ మేథ, సైబర్‌సెక్యూరిటీ, డిజిటల్ ఇన్‌ఫ్రాపై పెట్టుబడులను కొనసాగిస్తామని శెట్టి చెప్పారు.

**కొత్త ఆవిష్కరణలపై ఫోకస్..**

కొత్త ఆవిష్కరణలకు తెరతీస్తూ, నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపర్చుకుంటూ, మరింత నాణ్యమైన సేవలు అందించేలా వివిధ ప్రక్రియలను సరళతరం చేయడంపై దృష్టి పెడుతున్నట్లు శెట్టి తెలిపారు. ఇందుకు ప్రాజెక్ట్ సరళ్ కింద ఆటోమేషన్, కృత్రిమ మేథ (ఏఐ)ని మరింత వినియోగించుకోనున్నట్లు వివరించారు.

## స్పోర్ట్స్

# సన్‌రైజర్స్‌ను ముంచిన వైభవ్, ఆర్చర్.. క్వాలిఫయర్ 2లో రాజస్థాన్..!



ఓపెనర్ల నుంచి ఆరో బ్యాటర్ వరకూ అందరూ దంచికొట్టగల సమర్థులే. ఇదివరకే తమ వైల్డ్‌ఫైర్ ఆటతో ఐపీఎల్ రికార్డు స్కోర్‌ను షేక్ చేసిన రికార్డు ఉండనే ఉంది. ఇంకేముంది ఎలిమినేటర్‌లో 244 పరుగుల లక్ష్యాన్ని సన్‌రైజర్స్ హైదరాబాద్ ఉఫ్‌మనిపిస్తుందనుకుంటే.. అనూహ్యంగా కుప్పకూలింది. పదిహేనేళ్ల వైభవ్ సూర్యవంశీ(97) ఊచకోతతో డీలా పడిన హైదరాబాద్‌ను జోఫ్రా ఆర్చర్(58-3) పవర్ ప్లేలోనే పడగొట్టాడు. ఓపెనర్లను ఇషాన్(33) ఔట్ చేసి మ్యాచ్‌ను రాజస్థాన్ వైపు తిప్పాడు. నితీశ్ రెడ్డి(38) కాసేపు నిలబడినా ఆరెంజ్ ఆర్మీ ఘోర ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించింది. అదిరే విక్టరీ కొట్టిన రాజస్థాన్ మే 29న క్వాలిఫయర్ 2లో గుజరాత్ టైటాన్స్‌ను ఢీకొట్టనుంది.

చావోరేవో పోరులో బ్యాటర్లు, బౌలర్ల వైఫల్యంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇంటిదారి పట్టింది. ఎలిమినేటర్‌లో చెత్తాటతో రెండో టైటిల్ వేటను నాకౌట్ దశలోనే ముగించింది. ప్లాన్ ఏ, ప్లాన్ బీ, ప్లాన్ సీ ఉందన్న కమిన్స్ సేనకు వణుకు పుట్టిస్తూ వైభవ్ సూర్యవంశీ(97) సిక్సర్ల మోతతో భారీ స్కోర్ కొట్టిన రాజస్థాన్.. ఆర్చర్(58-3) నిప్పులు చెరగడంతో పవర్ ప్లేలోనే మ్యాచ్‌ను తమ గుప్పిట్లోకి తీసుకుంది. టాపార్డర్ కూలినా.. క్లాసెన్(18) ఉన్నాడులే అనే సన్‌రైజర్స్ ధైర్యాన్ని యశ్ పంజా లాగేసుకున్నాడు. క్లాసెన్‌ను అతడు ఎల్బీగా ఔట్ చేయగా ఓటమి ఖాయమైంది. భారీ విజయంతో క్వాలిఫయర్‌కు 2కు దూసుకెళ్లింది.

**అభిషేక్ డకౌట్**

ప్లే ఆఫ్స్‌లో ఓడితే మరో అవకాశం ఉండదని తెలిసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ పేలవ ప్రదర్శనకు మూల్యం చెల్లించుకుంది. 244 పరుగుల లక్ష్యం పెద్దది కావడంతో దూకుడుగా ఆడి తలొక అర్ధ శతకంతో గెలిపిస్తారనుకుంటే టాపార్డర్ బ్యాటర్లు చేతులెత్తేశారు. అందుకు కారణం ఆదిలోనే సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను జోఫ్రా ఆర్చర్(58-3) గట్టి దెబ్బ కొట్టడమే. ఓపెనర్ అభిషేక్ శర్మ(0)ను రెండో బంతికే డకౌట్ చేసిన అతడు.. సిక్సర్లతో వేగంగా ఆడుతున్న ఇషాన్ కిషన్(33)ను స్లో బంతితో బోల్తా కొట్టించాడు.

బ్యాటింగ్ ఆర్డర్లో ముందొచ్చిన స్మరణ్ రవిచంద్రన్(1) బంతిని అంచనా వేయలేక బర్గర్ ఓవర్లో వెనుదిరిగాడు.

టపటపా మూడు వికెట్లు పడిన వేళ.. ట్రావిస్ హెడ్(17), హెన్రిచ్ క్లాసెన్(18)లు ఆచితూచి ఆడబోగా.. హెడ్‌ను బౌల్డ్ చేసిన ఆర్చర్ సన్‌రైజర్స్‌ను ఓటమి వైపు నడిపాడు. కీలక వికెట్లు పడినా క్లాసెన్ జతగా తెలుగబ్బాయి నితీశ్ రెడ్డి(38) జట్టును గెలిపించాలనుకున్నాడు. కానీ, యశ్ రాజ్ పంజా వేసిన 7వ ఓవర్లో క్లాసెన్ ఎల్బీగా వెనుదిరిగగా 81 వద్దే సన్‌రైజర్స్ ఐదో వికెట్ పడింది. ఉన్నంతసేపు చూడచక్కని షాట్లు ఆడిన నితీశ్‌ను జడ్డూ.. కమిన్స్(1)ను సుశాంత్ ఔట్ చేయడంతో ఇంప్యాక్ట్ సబ్ సలీల్ అరోరా(35) కాసేపు పోరాడాడు. 47పరుగుల తేడాతో గెలుపొందిన పరాగ్ సేన మే 29న ఇదే మైదానంలో గుజరాత్‌తో అమీతుమీ తేల్చుకోనుంది.

**వైభవ్ పిడుగల్లే**

ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ(97) రికార్డులను బద్ధలు కొడుతూ ఆడిన తుఫాన్ ఇన్నింగ్స్‌తో ఎలిమినేటర్‌లో రాజస్థాన్ రాయల్స్ కొండంత స్కోర్ చేసింది. ముల్లన్‌పూర్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ పేస్ దళాన్ని వణికిస్తూ 16 బంతుల్లోనే అర్ధ శతకం బాదిన వైభవ్.. తృటిలో రికార్డు శతకాన్ని చేజార్చుకున్నాడు. అనంతరం ధ్రువ్ జురెల్(50) హాఫ్ సెంచరీతో రాణించగా 250 ప్లస్ కొట్టేలా కనిపించింది రాజస్థాన్. కానీ, డెత్ ఓవర్లలో 36 పరుగులే ఇచ్చిన హైదరాబాద్ ప్రత్యర్థిని 243కు కట్టడి చేసింది. మెరుపు అర్ధ శతకం బాదిన వైభవ్ ఒకే సీజన్‌లో క్రిస్ గేల్ పేరిట ఉన్న 59 అత్యధిక సిక్సర్ల రికార్డును అధిగమించాడు. ప్రస్తుతం అతడి ఖాతాలో 65 సిక్సర్లున్నాయి.

### ధోనీ భవితవ్యం మా చేతుల్లో లేదు.. ఏ నిర్ణయం తీసుకున్నా గౌరవిస్తాం..!




ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్‌లో మహేంద్ర సింగ్ ధోనీ (మీా ఇష్ట్రశీఅఱ) ఆడకపోవడంతో అతడి భవితవ్యం ఏంటీ? అనేది చర్చనీయాంశంగా మారింది. హుందాగా వీడ్కోలు పలికుతాడా లేదా చెన్నై సూపర్ కింగ్స్ కోచ్, మెంటర్, క్రికెటర్ డైరెక్టర్ .. వంటి పదవులు చేపడుతాడా? అనేది అంతుచిక్కడం లేదు. ఎందుకంటే.. పెద్దన్నలాంటి మహీ భాయ్‌ను సీఎస్కే యాజమాన్యం ఎట్టి పరిస్థితుల్లనూ వదులుకోదు. ఈ నేపథ్యంలో సీఎస్కే సీఈఓ కాశీ విశ్వనాథన్ మాట్లాడుతూ ధోనీ భవితవ్యం మా చేతుల్లో లేదని కుండబద్ధలు కొట్టేశాడు. ఐపీఎల్‌లో ధోనీ శకం ముగిసిందా? అనే ప్రశ్నకు సమాధానం దొరకడం లేదు. పంతొమ్మిదో సీజన్‌కు దూరమవ్వడంతో.. ఇకపై ఆటగాడిగా ధోనీని మైదానంలో చూడలేమని, కోచ్‌గా వస్తాడని ఊహాగానాలు జోరందుకున్నాయి. అయితే.. సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ స్పందిస్తూ ధోనీ భవితవ్యం తమ చేతుల్లో లేదని స్పష్టం చేశాడు. ఇదివరకు చెప్పనట్టే.. ధోనీని తాము అడ్డుకోమని, అతడికి నచ్చినన్ని రోజులు ఆడనిస్తామని చెప్పాడు. 'ధోనీ గురించి మేము ఇప్పుడే ఆలోచించడం లేదు. అతడి భవితవ్యాన్ని అతడికే వదిలేశాం. అతడు ఏ నిర్ణయం తీసుకున్నా గౌరవిస్తాం. సీఎస్కే ఫ్రాంచైజీలో ధోనీని శాశ్వత సభ్యుడిగా భావిస్తాం. ఆటగాడిగా లేదంటే కోచ్‌గా లేదా మెంటర్‌గా.. అతడు ఏది ఇష్టపడితే అదే హోదాలో కొనసాగేందుకు అనుమతిస్తాం. ఏ నిర్ణయమైనా అతడి చేతుల్లోనే ఉంది. ధోనీ, కోచ్ ఫ్లెమింగ్‌లు రుతురాజ్ గైక్వాడ్‌ను ప్రశాంతమైన కెప్టెన్‌గా తీర్చిదిద్దారు. గైక్వాడ్ సారథ్యంలో సీఎస్కే గొప్ప విజయాలు సాధిస్తుంది' అని విశ్వనాథన్ వెల్లడించాడు. ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ ధోనీ గైర్హాజరీలో తీవ్రంగా నిరాశపరిచింది. 19వ సీజన్‌లో ఆరు విజయాలతో ప్లే ఆఫ్స్‌కు దూరమైంది. కీలక ఆటగాళ్లకు గాయాలు, సమిష్టితత్వం కొరవడడం.. బౌలింగ్ యూనిట్‌లో అన్షుల్ కంబోజ్ ఒక్కడే రాణించడం వంటివి చెన్నై జట్టును ఇంటికి పంపించాయి.






# సనాతన ధర్మం, మైథలాజికల్ టచ్‌తో శ్రద్ధాదాస్ 'త్రికాల'


టాలీవుడ్‌లో 'సిద్ధు ఫ్రమ్ శ్రీకాకుళం' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమైన శ్రద్ధాదాస్, 'ఆర్య 2', 'గుంటూరు టాకీస్', 'ఏక్ మినీ కథ', 'డిక్టేటర్', 'నాగవల్లి' వంటి చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఇప్పుడు 'త్రికాల'లో మరో విభిన్నమైన పాత్రలో ప్రేక్షకుల ముందుకు రానుంది.. మణి తెల్లగూటి కథ, దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని రాధిక--శ్రీనివాస్ నిర్మించగా, చాగంటి ప్రొడక్షన్ ఎల్‌ఎల్‌పీ(ఇండియా) ప్రపంచవ్యాప్తంగా మే 28న విడుదల చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, ప్రచార చిత్రాలు, పాటలు ప్రేక్షకుల్లో సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. ముఖ్యంగా అడవి నేపథ్యంలో రూపొందించిన విజువల్స్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, వెన్నులో వణుకు పుట్టించే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ట్రైలర్‌ను బట్టి చూస్తే ఇది కేవలం సాధారణ హారర్ చిత్రం కాకుండా దైవిక శక్తులు, అతీత శక్తుల మధ్య జరిగే సస్పెన్స్‌భరితమైన మైథలాజికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కినట్టు తెలుస్తోంది. ఈ సందర్భంగా దర్శకుడు మణి తెల్లగూటి మాట్లాడుతూ...'ప్రపంచంపై చీకటి కమ్ముకున్న సమయంలో వెలుగుగా అవతరించే ఒక శక్తి చుట్టూ 'త్రికాల' కథ సాగుతుంది. సనాతన ధర్మంలోని కొన్ని ఆధ్యాత్మిక అంశాలను థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో మిళితం చేసి ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. ఇప్పటికే ట్రైలర్, పాటలకు అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రేక్షకులకు ఇది సరికొత్త అనుభూతిని అందిస్తుంది' అని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ...'మైథలాజికల్ టచ్‌తో రూపొందిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. సంస్కృతి, ఆధ్యాత్మికత, థ్రిల్ అంశాల సమ్మేళనంగా రూపొందిన 'త్రికాల' ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది'అని పేర్కొన్నారు. ఈ చిత్రానికి 'అర్జున్ రెడ్డి', 'యానిమల్', 'స్పిరిట్' వంటి చిత్రాలకు సంగీతం అందించిన హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం సమకూరుస్తున్నారు. ఆయన అందించిన మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాకు ప్రధాన బలంగా నిలవనుందని చిత్రబృందం చెబుతోంది.

# రామ్ చరణ్‌పై ట్రోలింగ్‌కు జగపతి బాబు కౌంటర్.. అది పనిలేని వాళ్ల పనే అంటూ కామెంట్..



రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కు తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'పెద్ది' విడుదలకు సిద్ధమవుతోంది. జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. చిత్ర బృందం ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రమోషన్స్‌తో బిజీగా ఉండగా, ఇటీవల జరిగిన కొన్ని ఈవెంట్లలో రామ్ చరణ్ మాట్లాడిన తీరు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైంది. కొన్ని సందర్భాల్లో పేర్లు మర్చిపోవడం, బెంగళూరు ఈవెంట్‌లో కొద్దిగా కన్నడలో మాట్లాడటం వంటి అంశాలపై కొందరు సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు దిగారు. ఈ నేపథ్యంలో 'పెద్ది' చిత్రంలో అప్పలసూరి అనే పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్న జగపతి బాబు తాజాగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా రామ్ చరణ్‌పై జరుగుతున్న ట్రోలింగ్‌తో పాటు తనపై గతంలో వచ్చిన విమర్శలపైనా స్పందించారు.

జగపతి బాబు మాట్లాడుతూ.. "ట్రోలింగ్ చేసే వాళ్ల గురించి నేను పెద్దగా పట్టించుకోను. పనిలేని వాళ్లు ఎవ్వరినైనా కిందకి లాగాలనే ఉద్దేశంతో ఇలాంటి పనులు చేస్తుంటారు. చరణ్ ఈ సినిమా కోసం ఎంత కష్టపడ్డాడు, ఎన్ని గాయాలు అయ్యాయి, ఎంత శ్రమించాడు అనే విషయాలను పక్కనపెట్టి చిన్న విషయాలను పట్టుకుని పెద్దదిగా చేస్తున్నారు" అని అన్నారు.అలాగే ఒక పెద్ద సినిమా ప్రమోషన్స్ సమయంలో హీరోలపై ఎంత ఒత్తిడి ఉంటుందో కూడా ఆయన వివరించారు. "ఒకవైపు డబ్బింగ్ పనులు, మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్, సెన్సార్, థియేటర్ల వ్యవహారాలు.. ఇలా ఎన్నో బాధ్యతలు ఒకేసారి ఉంటాయి. ఆ ఒత్తిడిలో చిన్న చిన్న విషయాలు మర్చిపోవడం సహజం. నేను కూడా చాలా సందర్భాల్లో మర్చిపోతాను. అలాంటివాటిని పట్టుకుని ట్రోల్ చేయడం సరికాదు అని వ్యాఖ్యానించారు. ఇక తనపై గతంలో వచ్చిన ట్రోలింగ్‌పై కూడా ఆయన స్పందించారు. "ఒక సీన్ కోసం నేను 70 లేదా 80 టేక్స్ తీసుకున్నానని సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. కానీ అందులో ఎలాంటి నిజం లేదు. ఎక్కువలో ఎక్కువ మూడు టేక్స్ తీసుకుని ఉంటాను. పూర్తిగా ఫేక్ సమాచారంతో ట్రోలింగ్ చేశారు" అని స్పష్టం చేశారు. ప్రస్తుతం 'పెద్ది' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. రామ్ చరణ్‌ను సరికొత్త అవతారంలో చూపించనున్న ఈ స్పోర్ట్స్ డ్రామాపై అభిమానులు భారీగా ఆశలు పెట్టుకున్నారు. విడుదలకు ఇంకా కొన్ని రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో ప్రమోషన్స్ మరింత జోరుగా కొనసాగుతున్నాయి.



# రామ్ పోతినేని - అనిల్ రావిపూడి క్రేజీ కాంబో ఫైనల్.. దశాబ్దం నిరీక్షణకు ముగింపు

తెలుగు చిత్ర పరిశ్రమలో వినోదం, కమర్షియల్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు అనీల్ రావిపూడి, తన ఎనర్జీతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న హీరో రామ్ పోతినేని కలయికలో సినిమా వస్తే ఎలా ఉంటుందో అన్న ఆసక్తి అభిమానుల్లో చాలా కాలంగా ఉంది. ఇప్పుడు ఈ ఆసక్తికి తెరపడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఫిలింనగర్ వర్గాల సమాచారం ప్రకారం, ఈ క్రేజీ కాంబినేషన్ త్వరలోనే పట్టాలెక్కే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. నిజానికి ఈ కాంబినేషన్ చాలా ఏళ్ల క్రితమే సెట్స్‌పైకి రావాల్సి ఉందని ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దర్శకుడు అనిల్ రావిపూడి గతంలో తెరకెక్కించిన రాజా ది గ్రేట్ కథను మొదట రామ్ పోతినేనిని దృష్టిలో పెట్టుకుని సిద్ధం చేశారట. ఆ కథను రామ్‌కు వినిపించినప్పటికీ, అప్పట్లో వరుస మాస్ యాక్షన్ సినిమాలతో బిజీగా ఉండటం వల్ల ఆయన ఆ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్లలేదని సమాచారం. తరువాత ఆ కథ హీరో రవితేజ వద్దకు వెళ్లి భారీ విజయాన్ని అందుకుంది. అప్పటి నుంచి రామ్ -- అనిల్ రావిపూడి కాంబినేషన్ ఎప్పుడు సెట్స్‌పైకి వస్తుందా అని అభిమానులు ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం, అనిల్ రావిపూడి ఇటీవల రామ్‌కు ఒక కొత్త కథా లైన్ వినిపించగా, అది ఆయనకు బాగా నచ్చినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇద్దరూ తమ తమ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నప్పటికీ, వాటిని పూర్తి చేసిన తర్వాత ఈ సినిమా ప్రారంభం కానుందని టాక్ వినిపిస్తోంది.అలాగే ఈ చిత్రాన్ని 2027 దసరా సందర్భంగా విడుదల చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇక ప్రస్తుతం రామ్ పోతినేని తన కెరీర్‌లో కొత్త ప్రయోగానికి సిద్ధమవుతున్నారు. నటుడిగా మాత్రమే కాకుండా దర్శకుడిగానూ కొత్త ప్రయాణం ప్రారంభిస్తున్నారు. ఆయన కెరీర్‌లో 23వ చిత్రంగా రూపొందనున్న ర్యాపో 23 స్టైలిష్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కనుంది. 'ది స్టోరీ ఆఫ్ ఏ లోన్ వోల్ఫ్' అనే ట్యాగ్‌లైన్‌తో రాబోతున్న ఈ చిత్రంలో రామ్ 'వీర' అనే పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం.

# తనకంటే 21 ఏళ్లు పెద్దవాడైన మిలింద్ సోమన్‌తో బ్రేకప్.. ఎట్టకేలకు నోరు విప్పిన బాలీవుడ్ నటి

ప్రముఖ మోడల్, నటుడు, ఫిట్‌నెస్ ఐకాన్ మిలింద్ సోమన్‌తో తనకున్న పాత ప్రేమాయణం గురించి ఎట్టకేలకు నోరు విప్పింది బాలీవుడ్ నటి షహానా గోస్వామి. ఇటీవల ఒక వీడియో పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె తన రిలేషన్‌షిప్ విషయాల గురించి, మిలింద్‌తో బ్రేకప్ గురించి పంచుకుంది. తాను మొదట్లో మిలింద్‌కు ఒక అభిమానిని అని, ఆ ఆరాధన నుంచి మొదలైన మా ప్రయాణం డేటింగ్ వరకు ఎలా వెళ్లిందో షహానా చెప్పుకొచ్చింది. నాకు 16-17 ఏళ్ల వయసున్నప్పుడు ఢిల్లీలో మిలింద్ నటించిన ఒక సినిమాను చూసి ఆయన మాయలో పడిపోయాను. ఎలాగైనా ఆయనతో మాట్లాడాలని ఇంటర్నెట్‌లో వెతకగా, మిలింద్ ల్యాండ్‌లైన్ నంబర్ దొరికింది. ఆ నంబర్‌కు ఫోన్ చేయగా.. పేజర్ మెషీన్‌లో మిలింద్ తన మొబైల్ నంబర్‌ను వదిలివెళ్లారు. ఆ నంబర్‌కు షహానా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ మెసేజ్ చేయగా, మిలింద్ వెంటనే స్పందించారు. అయితే, ఆ తర్వాత దాదాపు ఆరేళ్ల పాటు వారిద్దరూ ఫోన్‌లో మాట్లాడుకోలేదు, కేవలం మెసేజ్‌ల ద్వారానే టచ్‌లో ఉన్నారు. కాలేజీ చదువుల కోసం షహానా ముంబైకి వచ్చిన తర్వాత, ఇద్దరూ సింగిల్‌గా ఉన్న సమయంలో మళ్లీ కలిసి డేటింగ్ ప్రారంభించారు. మిలింద్ సోమన్‌తో డేటింగ్ చేసే సమయానికి అతడి వయసు 43 ఏళ్లు కాగా, షహానా 20లలో ఉంది. అయితే వీరి డేటింగ్‌పై అప్పట్లో విమర్శలు రాగా.. దీనిపై షహానా స్పందిస్తూ.. నేను ఆ వయసు తేడాను ఎప్పుడూ గుర్తించలేదు. నా వయసు కంటే నేను చాలా ఉన్నతంగా ఆలోచించేదాన్ని. మా కుటుంబంలో కూడా అందరం స్నేహితుల్లా ఉంటాం కాబట్టి ఈ విషయం ఇంట్లో చెప్పడానికి ఎలాంటి ఇబ్బంది కలగలేదు అని పేర్కొన్నారు. ఇక 2013లో వీరిద్దరూ విడిపోవడానికి గల కారణాన్ని షహానా బయటపెడుతూ.. చివరి క్షణం వరకు మా ఇద్దరి మధ్య ఎంతో ప్రేమ ఉంది. కానీ కొన్నిసార్లు బంధాలు అనుకున్నట్లు సాగనప్పుడు వాటిని వదిలేయడమే మంచిది. నేను సాంప్రదాయ బంధాలలో ఇమడలేనని నాకు అర్థమైంది. నేను ప్రేమిస్తాను, కానీ స్వేచ్ఛను అంతకంటే ఎక్కువగా కోరుకుంటాను. ఒకరిని బంధించి ఉంచడం ప్రేమ అనిపించుకోదు. మా ఇద్దరి ఆలోచనలు వేరుగా ఉన్నాయని, భవిష్యత్తుపై మా అంచనాలు కలవడం లేదని గ్రహించి పరస్పర అంగీకారంతోనే విడిపోయాం అని షహానా చెప్పుకొచ్చారు.



Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23, Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713